తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక



SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 05
October - 2024, Price Rs.20/-.

అక్టోబరు 2024
వెల రూ. 20/-
పుటలు - 56




శ్రీవారి గరుడసేవ
(08-10-2024)

**తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు**
(2024, అక్టోబరు 04 నుండి 12 వరకు)



తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు, తిరుమల

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 03-10-2024 | గురు | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 04-10-2024 | శుక్ర | వజ్రకవచాద్యాభరణములతో తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 05-10-2024 | శని | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 06-10-2024 | ఆది | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 07-10-2024 | సోమ | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 08-10-2024 | మంగళ | పల్లకిలో మోహినీఅవతారం | గరుడవాహనం |
| 09-10-2024 | బుధ | హనుమద్వాహనం, సా॥ వసంతోత్సవం, సువర్ణరథరంగ డోలోత్సవం | గజవాహనం |
| 10-10-2024 | గురు | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 11-10-2024 | శుక్ర | రథోత్సవం | అశ్వవాహనం |
| 12-10-2024 | శని | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : వేదావినాశినం నిత్యం య ఏన మజ మవ్యయమ్ ।**
**కథం స పురుషః పార్థ కం ఘాతయతి హన్తి కమ్॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-21వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** పార్థ=ఓ అర్జునా!; యః= ఎవడు; ఏనమ్= ఈ ఆత్మను; అజమ్= పుట్టుక లేనివానిగను; అవ్యయమ్= క్షయము లేనివానిగను; అవినాశినమ్= నాశరహితునిగను; నిత్యమ్= నిత్యునిగను; వేద= తెలిసికొనుచున్నాడో; సః పురుషః= ఆ మనుజుడు; కథం= ఎట్లు; కమ్= ఎవనిని; ఘాతయతి= చంపించును?; కమ్= ఎవనిని; హన్తి= చంపును?

**భావం:** ఓ అర్జునా! ఈ ఆత్మనెవడు జననమరణములు లేనివానిగను, నాశరహితునిగను, నిత్యునిగను ఎరుంగునో, అట్టివాడెట్లు ఒకనిని చంపించగలడు? తాను చంపగలడు?

## విందుభోజనం ఆరగించ రండి స్వామీ!

ఇందిర వడ్డించ నింపుగను
చిందక యిట్లే భుజించవో స్వామి

అక్కాళపాశాలు నప్పాలు వడలు
పెక్కైన సయిఁదంపు పేణులును
సక్కెరరాశులు సద్యోఘృతములు
కిక్కిరియ నారగించవో స్వామీ

మీరినకెళంగు మిరియపుఁ దాలింపుఁ
గూరలు కమ్మని కూరలును
సారంపుఁ బచ్చళ్లు చవులుగ నిట్టే
కూరిమితోఁ జేకొనవో స్వామీ

పిండివంటలునుఁ బెరుగులుఁ బాలు
మెండైన పాశాలు మెచ్చి మెచ్చి
కొండల పొడవు కోరి దివ్యాన్నాలు
వెండియు మెచ్చవే వేంకటస్వామీ

(అధ్యాత్మ సంకీర్తన సంపుటం-01;
సంకీర్తన-22)





శ్రీవేంకటేశ్వరుడు ఎంతటి అలంకారప్రియుడో అంతటి నైవేద్య ప్రియుడట! ఎంతటి నైవేద్యప్రియుడో అంతటి భక్తప్రియుడట! అందుకే తాను ఏరికోరి ఆరగించిన రుచికరమైన ప్రసాదాలన్నీ భక్తులు తింటేనే ఆయన కానందమట! అసలు భక్తులకు తినిపించడానికే శ్రీస్వామి మంచిమంచి కమ్మనైన పిండివంటల్ని, అన్నప్రసాదాల్ని ఆరగిస్తాడట! ప్రపంచంలోనే ఈ స్వామిని మించిన నైవేద్యప్రియుడు, భోజనప్రియుడు మరొకడు లేడు. అలా స్వామికి ఏ ఏ ఆహారప్రసాదాలు ఇష్టమో వాటినన్నింటినీ స్వామి దేవేరి స్వామివారిని అడిగి తెలుసుకుని తయారుచేయించి స్వామివారికి ప్రియమార ప్రేమతో కొసరి కొసరి వడ్డించేదట. అందులో స్వామి కిష్టమైన అక్కాళపాశాలు, అప్పాలు, వడలు, పేణులు, మిరియపు తాళింపులు, కూరలు, పిండివంటలు, పెరుగులు, పాలు మొదలైనవన్నీ ఉండేవట. ఇలా స్వామివారి ఆరగింపును, స్వామి దేవేరి స్వామికి వడ్డించే నైవేద్యాల గుబాళింపును, ఆ వడ్డింపు విధానాన్ని అన్నమయ్య ఎంతో రసరమ్యంగా పై సంకీర్తనలో బహు సుందరంగా వర్ణించాడు.



## 'సప్తగిరి' సకాలంలో చేరాలంటే...

01) పాఠకులు తాము 'సప్తగిరి' చందాదారులుగా చేరినప్పుడు ఇచ్చిన చందా నెంబరును మరొక్కమారు పరిశీలించుకోగలరు.

02) ఎందుకంటే.. 'సప్తగిరి' పత్రిక ఒకవేళ అందనివారు, ఆ చందా నెంబరు కార్యాలయానికి చేరవేసి వివరాలు పొందవచ్చు.

03) 'సప్తగిరి'పత్రిక సకాలంలో చేరకపోయినా, చిరునామాలో మార్పులు ఉన్నా ఈ-మెయిల్ (chiefeditortpt@gmail.com) ఐడిని సంప్రదించాలి.

04) ఈ-మెయిల్ సౌకర్యంలేని వారు 0877-2264543, 0877- 2264359 నెంబర్లకు ఫోన్ చేసి, చందా నెంబరు చెప్పి సమస్య పరిష్కరించుకోవచ్చు.

05) నేరుగా సంప్రదించదలచినవారు ప్రధాన సంపాదక కార్యాలయ పనివేళల్లో "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ భవనం, తిరుపతి-517 507" చిరునామాలో సంప్రదించవచ్చు.

## 'సప్తగిరి' చందాదారులుగా చేరాలంటే...

01) చందాదారులుగా చేరేవారు తమ చిరునామా, పిన్‌కోడ్, సెల్‌ఫోన్ నెంబరును, మీకు కావలసిన పత్రిక భాషను స్పష్టంగా వ్రాసి పంపాలి.

02) 'సప్తగిరి' పత్రిక సంవత్సర చందా రూ.240/-.

03) 'సప్తగిరి' పత్రిక జీవిత చందా (12 సంవత్సరాలు మాత్రమే) రూ.2400/-

04) 'సప్తగిరి' పత్రిక ఇతర దేశాలకు సంవత్సర చందా రూ.1030/-

05) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు డి.డి./ ఈ.ఎం.ఓ./ ఐ.పి.ఓ./ ఆన్‌లైన్ (ttdevasthanams.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

06) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు ఏ జాతీయబ్యాంకులోనైన "చీఫ్ ఎడిటర్, సప్తగిరి మ్యాగజైన్, టి.టి.డి., తిరుపతి" పేర డి.డి. తీసి పోస్టు ద్వారా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, తిరుపతి-517 507" ఈ చిరునామాకు పంపవచ్చు.



















తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 అక్టోబరు, 2024 సంచిక : 05

**వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।**
**వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥**

**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| బ్రహ్మోత్సవం | శ్రీ కల్లూరు గురుప్రసాద్ | 07 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 10 |
| తిరుమలకొండ | డా॥ మైలవరపు లలితకుమారి | 11 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 14 |
| గురుశ్లోకం | శ్రీ యం.రవితేజ | 17 |
| ర్యాలీ | డా॥ యస్.పద్మావతి | 19 |
| వినా వేంకటేశం...! | శ్రీ మల్లాది హనుమంతరావు | 22 |
| దసరా | శ్రీమతి యస్.రమ్య | 23 |
| మానవజన్మ | శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్ | 24 |
| తిరుమణిక్కూడమ్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| సప్తర్షుల కవితల్లో సప్తగిరీశుడు | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 27 |
| దీపావళి | శ్రీ ఐనవోలు మోహనాచార్యులు | 31 |
| మంగళవాద్యం | డా॥ దేవులపల్లి పద్మజ | 33 |
| ఉద్యోగం | శ్రీ డి.భాస్కరరామశర్మ | 35 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 38 |
| అశ్వం | డా॥ ఎన్.సిహెచ్.సుధామైథిలి | 40 |
| చదువుకోసం దెబ్బలు తినవచ్చు | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 41 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 42 |
| ప్రసాదాల స్వామి | శ్రీ బి.శ్రీనివాసరావు | 44 |
| క్షేత్రయ్య | డా॥ శివలెంక ప్రకాశరావు | 45 |
| స్వార్థం వద్దు!! | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| గరుడ గర్వభంగం (చిత్రకథ) | కథ : శ్రీమతి వావిలాల నాగవల్లి<br>చిత్రాలు : శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| గరికె | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : శ్రీవేంకటేశ్వరస్వామివారి గరుడవాహనసేవ, తిరుమల
వెనుకచిత్రం : శ్రీవేంకటేశ్వరస్వామివారి చక్రస్నానం, తిరుమల



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# బ్రహ్మోత్సవపిలుపు

***“శ్రీవేంకటేశ్వర దేవాదిదేవుని బ్రహ్మోత్సవంబు రారండు ప్రజలు భక్తిప్రపత్తులు బత్తెముల్ కాగను దర్శనోత్సాహంబె దక్షిణగను”*** – అంటూ గరుడుడు దేశవిదేశాల ప్రజలందరిని ఆబాలగోపాలం శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు రండి...రారండి..!! అంటూ పిలిచే పిలుపు అది. ఆ పిలుపుమేరకు దేశవిదేశాలనుండి సైతం అశేషప్రజానీకం బ్రహ్మోత్సవవైభవాన్ని కన్నులారా తిలకించాలనే తపనతో, భక్తిపూర్వకంగా ఉరుకులు పరుగులతో సమాయత్తమౌతారు.

అలా వచ్చే సమస్తప్రజానీకం మొట్టమొదటగా అలిపిరి గరుత్మంతుని విగ్రహానికి నమస్కరించి వివిధ వాహనాలలో బయలుదేరుతారు. ఎన్నిరకాల వాహనాలో... కన్నులతో చూడాల్సిందే. ఆ వాహనాల రొదకూడా ఇక్కడ చెవులకింపుగానే ఉంటుంది. ఎందుకంటే... స్వామివాహనసేవ దర్శనానికి కదా బయలుదేరేది. ఆ ఆనందంలో ఉంటాం కాబట్టి ధ్వనికాలుష్యంకూడా పట్టించుకోనంత తన్మయత్వంలో ఉంటారు మరి. అలా ప్రయాణం చేస్తూకూడా గోవిందనామస్మరణమంత్రం మరవరు మరి. అలాగే అలిపిరి కాలినడకమార్గంలోకూడా గోవిందనామస్మరణతో అశేష ప్రజానీకం బయలుదేరుతుంది. ఆ దృశ్యాలన్నీకూడా కన్నులకింపుగా ఉంటాయి.

అలా అందరూ బయలుదేరి కొండకు చేరుకోగానే అక్కడ అడుగుపెట్టగానే అంతవరకూ ప్రయాణించిన ఆ అలుపూ, సొలుపూ, ఆ ప్రయాణపు బడలిక ఏమైపోతాయో మరి. ఆ బడలికనంతా మరచిపోయేటంత సౌందర్యమే తిరుమలకొండ సౌందర్యం. ఇక్కడినుండి మనసు హాయిగా “కొండగాలి పిలిచింది గుండె ఊసులాడింది” అంటూ ఎంతో మధురతన్మయత్వంతో పులకించిపోతాయి అందరి మనస్సులు.

ఇకపోతే కొండపై ఎక్కడచూచినా గోవిందనామఘోషలే. భక్తుల కోలాహలమే. నాదనీరాజనం, ఆస్థానమండపాల్లో వినసొంపైన ఆధ్యాత్మిక సంగీత, సాంస్కృతికకార్యక్రమాల హేల, అన్న ప్రసాదవితరణశాలల్లో కమ్మని విందుభోజనాలు, ఫలపుష్పప్రదర్శనశాలల్లో పరిమళపు పూల గుబాళింపులు, నాలుగుమాడవీథుల్లో స్వామివారి వాహనసేవల్లో స్వామివారి విభిన్న అలంకారాలు, వాహనసేవల ముందు భజనబృందాలు, కోలాటాలు, ప్రబంధగోష్ఠిగానం, మంగళవాయిద్యాల ఘోష.. అబ్బో ఇలా ఒకటికాదు. ఎన్నో ఆకర్షణీయ మనోహరదృశ్యాలతో, వినూత్నశోభతో అలరారే ఆ వైభవం కన్నులారా చూడాల్సిందే! ఇంతటి అద్భుతాల్ని కళ్లారా చూసేవారిదే భాగ్యం. భగవంతునికి హారతులిచ్చే చేతులున్నవారిదే భాగ్యం. హరినామసంకీర్తనచేసే వేనోళ్లదే భాగ్యం. ఇలా అన్నిరకాల ఆనందతరంగాల్లో ముంచెత్తే ఆధ్యాత్మికానుభూతిని కల్గించే సేవల్లో పాల్గొనే భక్తులదే ధన్యత కల్గిన జీవితం. అలాగే స్వామివారి మూలమూర్తికికూడా ఎన్నోరకాల కైంకర్యాలు, నివేదనలు అఖండంగా జరుగుతాయి. ఆ సమయంలో స్వామివారి దర్శనం అఖండం, అద్వితీయమే.

ఇలా తిరుమలకు వచ్చే భక్తులందరికీ తి.తి.దే. అతిథిమర్యాదలు, సకలసౌకర్యాలను కల్పించి భక్తులకు తిరుమలక్షేత్రసందర్శనీయఫలాన్ని, అలాగే స్వామివారి వాహనసేవల వైభవాన్ని వారు మనసారా ఆస్వాదించేలా చేస్తుంది. ఆ సందర్భనకు భక్తులందరూకూడా సంప్రదాయవస్త్రధారణతో, నిరంతరదైవనామస్మరణతో స్వామివారిని సందర్శించి, స్వామివారి కరుణాకటాక్షసిద్ధిని పొందుతారని ఆశిద్దాం. అలాగే, తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారికి జరిగే నవరాత్రిఉత్సవాల్లో అమ్మవారిని కూడా సందర్శించి ధన్యులౌతారని ఆశిద్దాం.

**2024, అక్టోబరు 04 నుండి 12 వరకు**
**తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం సందర్భంగా..**



# బ్రహ్మోత్సవం

- శ్రీ కల్లూరు గురుప్రసాద్

తిరుమల వేంకటరమణుడికి జరిగే బ్రహ్మోత్సవం పెద్ద తిరునాళ్ళు. భక్తజనులకు కనులపండువుగా ఉండి వారిని తరింపజేయటానికి భగవంతుడు బ్రహ్మతో "ఓ బ్రహ్మ! నాకు ఉత్సవం ఏర్పాటు చేయించు. ధ్వజారోహణంతో ఆరంభమై అనేక వాహనాల ఊరేగింపులతో కొనసాగి రథోత్సవంతో ముగిసేలా అవి ఉండాలి" అని చెప్పాడు. భగవంతుడు అలా బ్రహ్మను ఆజ్ఞాపించి ఉత్సవం జరిపించుకోవడం ఒక అద్భుత సంఘటన. బ్రహ్మచే నిర్వహించబడే ఈ ఉత్సవానికి 'బ్రహ్మోత్సవం' అనే పేరు సార్థకమయ్యింది.



ఇందులో ధ్వజారోహణానికి ముందురోజు ఉత్సవాంగంగా అంకురార్పణ జరుగుతుంది. తర్వాత గరుడ ధ్వజపటం ఎగురవేసి అన్ని లోకాల్లో ఉన్న అందరినీ ఉత్సవాలకు రమ్మని ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. ఆ రోజునుండే వాహనసేవలు మొదలవుతాయి. ఆ వాహనసేవల వైభవాన్ని ఒకసారి స్మరించి తరించుదాం. వాహనసేవలు ఆదిశేషునిసేవతో ప్రారంభమవుతాయి.



### చిన్నశేషవాహన గోవిందా! చిన్మయరూపా గోవిందా!!
### పెద్దశేషవాహన గోవిందా! పాహి మురారే గోవిందా!!


శ్రీవేంకటేశ్వరుడు కొలువైఉన్న ఈ కొండపేరే శేషాద్రి. అంటే స్వామి నివాసార్థం ఆదిశేషుడు తానే స్వయంగా కొండ రూపం దాల్చాడన్న మాట. ప్రపంచమంతా దేవుడికి శేషభూతం. అంటే దాసభూతమే. అలా శేషవృత్తిచేసేవారిలో ఆదిశేషుడు అగ్రగణ్యుడు. శేషుడు భూధరుడు. శేషాద్రి భూధరమే. నిత్యం ఆ భగవంతునికే ఆసనంగా, శయనంగా ఉండే భాగ్యం పొందిన శేషుడు ఎంతో పుణ్యాత్ముడు, ధన్యుడు. కైంకర్యాభిలాష అతనిలో మెండు. అందుకే శేషుడనే పేరు ఆయనకు సార్థకమయ్యింది. అందువల్లనే కాబోలు ఈ ఉత్సవాల్లో శేషవాహనంపై స్వామి రెండురోజులు అంటే మొదటి రోజు రాత్రి, రెండో రోజు ఉదయమూ స్వామి తిరుమాడవీథుల్లో విహరిస్తూ భక్తుల్ని కటాక్షిస్తాడు.





### హంసవాహన గోవిందా! హింసనివారక గోవిందా!!

హంసశబ్దం అతి స్వచ్ఛం, శుద్ధపరమసత్త్వరూపం. అందుకే వేదాత్మకుడైన బ్రహ్మ హంసను తన వాహనంగా ఎంచుకున్నాడు. క్షీర నీర వివేకానికి ప్రసిద్ధిపొందింది హంస. అట్టి హంసను వాహనంగా చేసుకొని ఎంతో వైభవంగా ఊరేగుతాడు స్వామి.



### సింహవాహన గోవిందా! నరసింహరూపా గోవిందా!!




"మృగాల్లో నేను సింహాన్ని" అని శ్రీకృష్ణుని గీతా వచనం. సింహం గాంభీర్యపరాక్రమాలకు పుట్టినిల్లు. అడవికి రారాజు సింహం అంటే భగవంతునికి ఎంతో ఇష్టం. సింహ వాహనంపై విజయంచేసే శ్రీవారిశోభ వర్ణనాతీతం. సింహ వాహనంపై ఉన్న స్వామిని దర్శించిన భక్తుల ఆనందం అనంతం.

**కల్పవృక్షవాహన గోవిందా! కామితఫలదా గోవిందా!!**



కల్పవృక్షం అంటే కోరిన కోరికలు తీర్చే శక్తిగల మహామహిమాన్వితవృక్షం. భగవంతుడుకూడా భక్తుల కోరికలు తీరుస్తాడు. కాబట్టి భగవంతుడు భక్తుల పాలిట కల్పవృక్షం. ఒక కల్పవృక్షం ఒడిలో మరో కల్పవృక్షం కూర్చున్నట్లుండే ఈ కల్పవృక్షవాహనం ఒక అపురూపదృశ్యం. భగవంతుడు కామితఫలదాతయని తెలుపడమే ఈ కల్పవృక్షవాహనం లోని అంతరార్థం.



**సర్వభూపాలవాహన గోవిందా! సర్వాంతర్యామీ గోవిందా!!**



భూపాలకులందరూ భగవంతుని వాహనసేవకులే. విష్ణ్వంశ కలిగిన వారే పృథ్వీపాలకులవుతారని ఆర్యోక్తి. నారాయణుడు అంశ, భూపాలు రందరూ అంశభూతులు– అంశయొక్క అనుగ్రహంవల్లనే వారు ఏలుబడి సాగిస్తున్నారు. కాబట్టి భూపాలు రందరూ కృతజ్ఞతాసూచకంగా ఒక వాహనరూపంగా రూపొంది స్వామివాహనాన్ని మోసి జన్మ సాఫల్యం పొందుతారు.

**మోహినీఅవతార గోవిందా! ఇహపరదాయకా గోవిందా!!**

శ్రీవేంకటాచలపతికి ఈ వేష ధారణ బహుభావగర్భితం. మహా నందసంధాయకం. ఈ వేషంలో పరమాత్మను చూడ్డానికి వేయికన్నులైనా చాలవు. అమృతాన్ని దుష్టులైన రాక్షసులకు చెందనివ్వకుండా దేవతలకు మాత్రమే పంచడంకోసం విష్ణువు మాయామోహినీరూపం ధరించి లోకాలకు మహోపకారం చేశాడు. ఈ ఐతిహ్యానికి చిహ్నంగా స్వామి ఈ ఉత్సవాల్లో ఒకనాడు ఈ మోహినీరూపం ధరించి విహరిస్తాడు. స్వామివారి ఈ రూపాన్ని చూసినవారి జన్మే ధన్యం.



**గరుడవాహన గోవిందా! కరుణాసాగరా గోవిందా!!**



అన్ని వాహనాల్లోనూ గరుడ వాహనసేవకు చాలా ప్రత్యేకత, ప్రాముఖ్యత ఉన్నాయి. మూర్తీభవించిన వేదస్వరూపుడు గరుడుడు. విష్ణుమూర్తికి ధ్వజాధిదేవత గరుడుడే. ఇట్టి మహిమాతిశయంచే ఈ విహగరాజు స్వామికి మిక్కిలి అనుంగు సేవకుడయ్యాడు. కనుకనే ఈ ఉత్సవాల్లో గరుడవాహనసేవకు అంతటి ప్రాముఖ్యత కలిగింది.

**హనుమద్వాహన గోవిందా! అనాథరక్షకా గోవిందా!!**



త్రేతాయుగంలో తనను ఎంతో భక్తితో సేవించిన హనుమంతుణ్ణి తన సేవకునిగా ఎంచుకున్నాడు నారాయణస్వరూపమైన శ్రీవేంకటేశ్వరుడు. స్వామి శ్రీరామరూపంతో ధనుర్ధారియై హనుమద్వాహనమధిరోహించి విహరించే శోభ అపూర్వం. అది గాంచినవారి జన్మే ధన్యం.

**స్వర్ణరథాధిష్ఠాన గోవిందా!**
**ముక్తిప్రదాయకా గోవిందా!!**



అదే రోజు సాయంకాలం శ్రీదేవిభూదేవిసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారు బంగారు తేరులో సింహాసనాన్నధిష్ఠించి, ఆలయ నాలుగుమాడవీథుల్లో ఘనంగా ఊరేగి భక్తులను కటాక్షిస్తారు. ఈ ఉత్సవాన్ని దర్శించి భక్తులు పునీతులౌతారు.

**గజవాహన గోవిందా! నిజభక్తరక్షకా గోవిందా!!**

ఏనుగు సామవేదంనుండి పుట్టింది కనుక దీనిని సామజము అంటారు. సాగరమథనమప్పుడు శ్రీమహాలక్ష్మితో పాటు సాగరంనుండి ఉద్భవించింది గనుక ఐశ్వర్యానికి, ఠీవికి, గాంభీర్యానికి, ఘనతకు ప్రతీక అయ్యింది. నారాయణుణ్ణి ఆర్తితో



స్మరించి మొసలిపట్టునుండి విముక్తి పొందింది. పద్మావతీ శ్రీనివాసుల ప్రణయానికి నాంది పలికింది. ఇలా భగవంతునితో అవినాభావసంబంధం కలిగి ఉంది. కాబట్టి ఈ వాహనంపై స్వామి ఊరేగి భక్తులను కటాక్షిస్తాడు.

**సూర్యప్రభవాహన గోవిందా! స్వయంప్రకాశా గోవిందా!!**



సూర్యుడు సాక్షాత్ శ్రీమన్నారాయణస్వరూపుడు. అందుకే 'సూర్యనారాయణా' అని కీర్తించబడుతున్నాడు. అట్టి సూర్యుణ్ణి వాహనంగా స్వీకరించి సూర్యుని ఒడిలో కూర్చున్నట్టుగా సూర్యప్రభవాహనంపై ఆసీనుడై విహరించే స్వామివారి చిద్విలాసరూపాన్ని వీక్షించినవారి జన్మయే ధన్యం.

**చంద్రప్రభవాహన గోవిందా! శ్రీముద్రాంకిత గోవిందా!!**



సాగరమథనసమయంలో శ్రీమహాలక్ష్మితోపాటు ఉద్భవించి లక్ష్మీసోదరుడయ్యాడు చంద్రుడు. చంద్రుడు అమృతకిరణుడు. మనస్సుకు అధిదేవత. చల్లని వెన్నెలలు ప్రసరింపజేసి జీవులకు ఆహ్లాదకరమైన ఆరోగ్యాన్ని అందిస్తాడు. లక్ష్మీసహోదరుడైన చంద్రుణ్ణి వాహనంగా స్వీకరించి ఆ చంద్రప్రభమధ్యన ఆసీనుడై విహరించే స్వామివారి చిద్విలాసరూపాన్ని దర్శించినవారి జన్మే ధన్యం.



**రథోత్సవదేవా గోవిందా!**
**ఆద్యంతరహితా గోవిందా!!**

ఐశ్వర్యానికి, ఆధిపత్యానికి, వైభవానికి, ఘనతకు ప్రతీక రథం. రథంతోనే ఉత్సవానికి పూర్ణత్వం వస్తుంది. ఈ రథోత్సవంలో స్వామి శ్రీదేవిభూదేవిసమేతుడై దర్శనమిస్తాడు. దీనిని దర్శించినవారికి అష్టైశ్వర్యాలు, విజయాలూ సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

**అశ్వవాహన గోవిందా! విశ్వంభరాశ్రీ గోవిందా!!**



సేనాచతురంగబలాల్లో గుఱ్ఱం ప్రముఖమైంది. అశ్వంకూడా సాగరమథనసమయంలో సాగరంనుండి ఉద్భవించింది. అదే ఉచ్చైశ్శ్రవం. వీరత్వానికి, విజయానికి ప్రతీక ఇది. కాబట్టి ఇది స్వామికి వాహనమయ్యే భాగ్యం పొందింది. అశ్వారూఢుడైన అచ్యుతుణ్ణి కళ్ళారా గాంచి ఆనందించడం భక్తుల భాగ్యం.

**శ్రీచక్రధారి గోవిందా! శత్రుభంజకా గోవిందా!!**

'బ్రహ్మోత్సవాలు' అనే ఈ మహాయజ్ఞానంతరం స్వామికి జరిగే అవభృథస్నానమే చక్రస్నానం. బ్రహ్మోత్సవాల చివరిరోజు ఉదయం శ్రీదేవిభూదేవిసమేత శ్రీనివాసునికి, శ్రీవారి చక్రానికి స్వామిపుష్కరిణిలో స్నానం చేయించడం జరుగుతుంది. అప్పుడు





భక్తులందరూ స్వామివారి చక్రంతోపాటు పుష్కరిణిలో మునిగి పునీతులౌతారు. పాపవిమోచనం పొందుతారు. ఆ తర్వాత ధ్వజావరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

పై తెల్పిన వాహనసేవలను, వాటిలో విహరించే స్వామి సుందరరూపాన్ని దర్శించి ధన్యులమౌదాం.

# సందేహాలు సమాధానాలు



– శ్రీమతి యం.గీతాకుమారి

**ప్ర) సద్గతి, మోక్షం, కైవల్యం, పరమపద సోపానం అన్న నాలుగుమాటలకు అర్థము ఒకటేనా? వీనినిగురించి తెలియజేయండి?**

**జ)**ఈ నాలుగు సమానార్థకాలని చెప్పవచ్చు. కానీ వీటిలో స్వల్పభేదాలున్నాయి. అవి–

**సద్గతి–** సద్గతి అంటే ఉత్తమగతి అని అర్థం. ఎవరైనా కష్టాలు పడుతున్నప్పుడు వాడు దుర్గతులపాలైనాడని అంటారు. మంచి జరగటాన్ని సద్గతిని పొందాడని చెప్పొచ్చు. కానీ మనిషి మరణం తర్వాత పుణ్యం చేసినవాడు సద్గతులు పొందుతాడని పండితవాక్కు. దానినే ఉత్తమగతి అనికూడా వ్యవహరిస్తారు.

**మోక్షం–**ఇది సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములని నాలుగువిధాలు.

**సాలోక్యం–**అంటే.. మనిషి మరణించిన తర్వాత పరమాత్మ నివసించే గ్రహానికి చేరి పరమాత్మతో కలిసి నివసించటం.

**సామీప్యం–**అంటే.. భగవంతుని చేరుకొని ఆ పరమాత్మ సమీపంలోనే నివసిస్తూ భగవంతునికి సహచరుడుగా దగ్గరగా ఉండటం.

**సారూప్యం–**అంటే.. భగవంతుని చేరి ఆ స్వామివలె నాలుగుచేతుల్లో ఆయుధాలను ధరించి పరమాత్మరూపాన్ని పొందటమే సారూప్యం.

**సాయుజ్యం–**అంటే.. భగవంతుని తేజస్సులో కలిసిపోవటం. దీన్నే అద్వైత భావన అంటారు. భగవంతుడికి తనకు తేడా లేదన్నది అద్వైతభావం. తాదాత్మ్యతతో భగవంతుని సేవించి పరమాత్మలో లీనమైపోవటం.

ఈ నాలుగువిధాల భక్తే మోక్షానికి మార్గం. మోక్షమంటే జన్మరాహిత్యమని అర్థం.


**కైవల్యం–** "నానాటిబతుకు నాటకము కానక కన్నది కైవల్యము" అన్న కీర్తనలో అన్నమాచార్యులు వేంకటేశ్వరుని వేడుకున్నాడు. కైవల్యము అంటే పరమాత్మలో కలిసిపోవటం. మరుజన్మ లేకుండా ఆత్మ పరమాత్మలో లీనమవటం కైవల్యం. జనన మరణాలు అశాశ్వతములు. మధ్యన నడిచే జీవితం ఒక నాటకం మాత్రమే. ఆత్మ ఒక్కటే శాశ్వతమైనది. దేహం అశాశ్వతం. జీవితం ఒక నాటకం అన్న విషయం తెలుసుకున్న జీవుడు సదా కైవల్యాన్ని వాంఛిస్తూ పరమాత్మను సేవించాలి.

**పరమపదసోపానం–** పరమాత్ముని చేరే మార్గమని అర్థం. పరమపదసోపానపటం అని ధర్మబద్ధంగా ఒక ఆట ఉంది. ఇది కేవలం ఒక ఆటమాత్రమే కాదు. అనంతమైన అర్థం ఇందులో ఇమిడి ఉంది. ఈ ఆటలో 1నుండి 100దాకా గడులుంటాయి. ఈ గళ్ళలో దేవతలు, జంతువులు, పాములు, నిచ్చెనలు దాగి మనకు కనిపిస్తాయి. మనం వేసే గవ్వల ఆధారంగా వచ్చే సంఖ్యనుబట్టి నిచ్చెన ఎక్కటం, ఒక్కొక్కసారి పామునోట్లో పడటం జరుగుతుంది. నిచ్చెన ఎక్కినప్పుడు పైకి వెళతాం. పామునోట్లో పడినప్పుడు క్రిందికి వస్తాం. కష్టసుఖాల్లో మానవుడు తన ప్రయత్నాన్ని ఆపకూడదు అనేది ఈ ఆట సారాంశం. అన్ని అడ్డంకులు దాటి చివరకు భగవంతుని చేరుకోవడమే లక్ష్యంగా జీవుడు తన ప్రయాణాన్ని, పోరాటాన్ని సాగించాలన్నదే ఇందలి నిగూఢార్థం. పాములంటే కష్టాలు, నిచ్చెనలంటే సుఖాలు. కష్టానికి కుంగిపోక, సుఖానికి పొంగిపోక ఒకేరకమైన మానసికస్థితిలో జీవుడు పరమాత్మను చేరుకోవటానికి బతుకునాటకాన్ని పూర్తి చేయాలన్నదే ఈ పరమపదసోపాన పరమార్థం. ఏది ఏమైనా చివరకు పరమాత్మను చేరుకోవటమే జీవుని లక్ష్యం.

ఈ నాలుగుమార్గాల్లో జీవుడు మనోవాక్కాయ కర్మములచే నిగ్రహానుగ్రహాలను కలిగి జీవన్నాటకాన్ని ముగించుకొని పరమాత్మను చేరుకోవటమే లక్ష్యంగా చరించాలన్నది నిర్వివాదాంశం.

**ప్ర) కలియుగంలో ఏది పాపం? ఏది పుణ్యం? సద్గతి కలగాలంటే ఏమి చేయాలి?**

**జ)**కృతయుగంలో ధర్మం నాలుగుపాదాలు, త్రేతాయుగంలో మూడుపాదాలు, ద్వాపరయుగంలో రెండుపాదాలు, కలియుగంలో ఒకపాదంతో నడుస్తున్నదని అంటారు. కలియుగంలో పాపపుణ్యవిచక్షణ కనపడటం లేదు. స్వార్థపరుడైన మానవుడు విచక్షణారహితుడై తాను చేయదలచుకున్నదే ధర్మం అంటున్నాడు. ఇతరులు చెప్పే మంచిని సైతం లక్ష్యపెట్టటం లేదు. భగవంతుడు అన్నిజీవుల్లో కొలువై ఉన్నాడు. కలియుగంలో తోటివారిని బాధించటం పాపం. తోటిమనిషికి సాయపడటమే పుణ్యం. అంతకుమించిన సత్కార్యం, పుణ్యం మరొకటి లేదు. కలియుగంలో సద్గతిని పొందటానికి సాటి మనిషికి సాయపడటమే పుణ్యప్రదమైన మార్గం అని చెప్పొచ్చు.



# తిరుమల కొండ

– డా॥ మైలవరపు లలితకుమారి

పురాణాల్లో కాకుండా వేదాల్లో సైతం కొండల ప్రత్యేకతను, స్థైర్యమును, లోకోపకారకప్రవృత్తిని తెలిపే మంత్రాలు అనేకమున్నాయి. వేదయుగానికి పూర్వంనుండి కొండలను ఆరాధించినట్లుగా అనేక ఆధారాలున్నాయి. నిరాకారుడైన భగవంతునికి ప్రతిరూపంగా కొండలు, వృక్షాలు, నదులను పూజించినట్లుగా మన పురాణాల్లో కనిపిస్తుంది.

అనాదినుండి తిరుమలకొండ భక్తుల పూజలందుకుంటున్నది. “తిరు” అంటే “పెద్ద” అని, “శ్రీ” అనే రెండర్థాలు మనకు కనిపిస్తాయి. పర్వతానికి “వేంగడము” అన్నది మొదటి పేరు. దానినే వేంకటాచలం, వేంకటగిరి, వేంకటాద్రిగా పిలుస్తారు. వేదమంత్రాల్లో ఈ గిరి ప్రస్తావన ఉంది. ఋగ్వేదం పదవ మండలం 155వ సూక్తం “సిరించి భారద్వాజులు ఋషి” పేరుతో ఈ సూక్తం ఉంది. అందులోని ఒక మంత్రం ఈ కొండను పేర్కొన్నది.

తిరుమలకొండపై ఉన్న నారాయణగిరిశిఖరం సముద్రమట్టానికి దాదాపు 3600అడుగుల ఎత్తులో ఉందంటారు. 250కోట్ల సంవత్సరాలక్రితం ఈ గిరి సముద్రగర్భంలో ఉండేది. కాలక్రమేణా వచ్చిన మార్పులవల్ల భూగోళంపై శిలాతోరణాలు ఏర్పడ్డాయి. వాటిలో ఒకటి తిరుమలలోని శిలాతోరణం. తిరుమలలో ఉన్న శిలాతోరణం అత్యంత ప్రాచీనమైంది. ఈ తోరణం ఏర్పడటానికి పూర్వం ఏడు ఖండాలు, ఐదు సముద్రాలు ఏకంగా ఉండేవట. తిరుమల శిలాతోరణంవద్ద నేటికీ సముద్రపు అలల సవ్వడులను తనలో దాచుకోవటమేకాక, సముద్రగర్భంలో ఉండే మొక్కలుకూడా ఇక్కడ ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రళయకాలంలో జలగర్భంలో ఉన్న వేదాలను మహావిష్ణువు శ్వేతవరాహస్వామిరూపంలో భూమిని పైకి తెచ్చినట్లు అది తిరుమలే అని వరాహపురాణం పేర్కొంది. వరాహస్వామిని తమిళులు “జ్ఞానప్పిరాన్” అని కొలుస్తారు. అంటే జ్ఞానం కలిగిన దైవంగా భావించి పూజిస్తారు. తిరుమల కొండ జీవులకు తొలిస్థావరంగా చెబుతారు.

తిరుమలకొండ ఏడుశిఖరాలతో ఉన్న పర్వతం. తిరుపతినుండి తిరుమలకు వెళ్లేటపుడు మనకు క్రిందనుండి ఒకే కొండవలె కనిపిస్తుంది. ఈ ఏడుశిఖరాలకు శేషాచలం, వృషభాచలం, గరుడాచలం, అంజనాద్రి, నీలాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి అని పేర్లున్నాయి. ఐతే వీటిని కృతయుగంలో వృషాద్రి; త్రేతాయుగంలో అంజనాద్రి; ద్వాపరయుగంలో శేషాచలం; కలియుగంలో వేంకటాచలమని భవిష్యోత్తర పురాణంలో పేర్కొనబడింది. ఇది మిక్కిలి ప్రాచీనపర్వతం. దీనిని వైకుంతంనుండి తీసుకువచ్చినట్లుగా వరాహపురాణం చెప్తోంది. అంతేగాక ఏడుకొండలు మానవునిలోని ఏడుచక్రాలకు ప్రతీకలుగా చెప్పవచ్చు. ఈ ఏడుచక్రాలు దాటితే ఆనందానుభూతి కలుగుతుంది. అందుకే స్వామి ఏడుకొండలపైన ఆనంద నిలయాన నిలిచి భక్తులకు దర్శనమిచ్చి కాపాడుతున్నాడు. “అదివో అల్లదివో శ్రీహరివాసము, పదివేల శేషుల పడగల మయము” అయిన ఏడుకొండలను గోవిందనామంతో కాలినడకన ఎక్కుతారు. ఇదే ఏడుకొండలు ఎక్కడంలో దాగి ఉన్న తత్త్వం.

ఆళ్వారులు ఈ కొండను "వేంగడం" అని అన్నారే కానీ తిరుమల అని అనలేదు. నమ్మాళ్వారులు మాత్రం తిరుమల అనే పదం ప్రయోగించారు. 8-9 శతాబ్దాలవరకు ఈ కొండను వేంగడం అనియే పేర్కొన్నారు. ఐతే 1013వ సంవత్సరం నాటి శాసనాల్లో తిరుమల అనే పేరు కనిపిస్తుంది. చోళులరాజైన రాజేంద్రచోళుడు వేయించిన శాసనంలో తిరుమల భాండాగారం గురించిన ప్రసక్తి ఉంది. రాజు దేవుని నందాదీపారాధనకై 23బంగారునాణేలను భాండాగారానికి చెల్లించినట్లుగా ఈ శాసనంలో వ్రాయబడింది. తిరుమల అనే నామం విజయనగర రాజులకాలంలో వాడబడింది. 1359వ సంవత్సరకాలంనాటి శాసనంలో తిరుమలఆలయంపై బంగారుకలశాన్ని అలంకరించిన ప్రస్తావన ఉంది.


దిగువనున్న తిరుపతిపట్టణంగా ప్రఖ్యాతి పొందినదీ సందర్భంలోనే. దానికి సమీపంలో ఉన్న కొండకు తిరుమల అనే పేరు వాడుకలోనికి వచ్చి ఉండవచ్చు. శ్రీవైష్ణవులసంప్రదాయంలో 108తిరుపతులున్నను ఈ తిరుమలయే ప్రధాన తిరుపతి అని వారన్నారు. శ్రీవైష్ణవుల కోవెలలో శ్రీరంగం కోవెలయే ప్రధానకోవెల. 16వ శతాబ్దానికి చెందిన "తిరుమల రహస్యము" అను క్షేత్ర ఇతిహాసగ్రంథంలో "పాతవేంగడ మనియే" ఉన్న పేరుకు మారుగా రానురాను తిరుమల అన్న పేరు వాడుకలోకి వచ్చింది. కొండకు వేంగడం అను పేరు వాడుకలో ఉన్నది.

"ముమూలనార్" అను తమిళకవి "అహనాసూల్" అను తన గ్రంథంలో వేంగడము అను పర్వతమున వేడుకలు జరుగుతుండేవని తెలిపారు. "శిలప్పదిగారము" అను మరొక తమిళకావ్యంలో విష్ణునివాసమైన పర్వతానికి వేంగడం అని పేరుందని చెప్పబడింది. "తిరువేంగడ" మంటే ఉత్తరదిక్కున ఉన్న కొండ అని ప్రాచీనశాసనాల్లో కనిపిస్తుంది. తంజావూరును పాలించిన ఓబలనాథుడు అను యాదవకులరాజు వేయించిన శాసనంలో "వడవేంగడ వౌణక్కు" అని ఉన్నట్లుగా చెబుతారు. ఈ ప్రాంతాన్ని తొండమండలము అని పల్లవ చోళుల యుగంలో విభాగం చేసి ఈవైపు పర్వతాన్ని, పర్వతపు పరిసరప్రాంత గ్రామాలను "తిరువేంగడక్కోట" అని పిలిచేవారు. నేటి తిరుపతి చుట్టూ ఉన్న ప్రదేశాన్నికూడ "కుడవూరునాడు" అని చంద్రగిరి చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలను "వైకుంతవలనాడు" అని పిలిచేవారు. 10-12 శతాబ్దాలవరకు తిరుమలకొండమీద ఉన్న గుడికి కావలసిన పూజాసామాగ్రిని తిరుచానూరునుండి తీసుకు వెళ్లేవారు. ఒకప్పుడు జనులు నివసివస్తున్న ప్రదేశం తిరుచానూరే. దానికి ఉత్తరదిక్కునున్న కొండ కనుక దీనికి "వడవేంగడము" అనుపేరు వచ్చింది.

వేంగడము అను పదమును వేంకటము అని చెప్పవచ్చు. ఎందువల్లనంటే తమిళమున పరుషాక్షరములకు మారుగా సరళములను వాడతారు. కనుక తమిళంలో ఉన్న వేంగడము అను పదం సంస్కృతంలో వేంకటము అను పదమునుండి ఉద్భవించి ఉండవచ్చు. "వేం+కట" అనేది "వేం+గడ" గా రూపాంతరం చెంది ఉండవచ్చు. సంస్కృత విద్వాంసులు ఋగ్వేదము, పదవ మండలము, 12వ అనువాకము, 155వ సూక్తము నందు వచ్చే మంత్రము వేంకట శబ్దానికి మూలమంత్రంగా చెప్పారు. శిరించి భరద్వాజులు అను ఋషికి కనిపించిన ఈ మంత్రము "అరాయికాణే వికటే గిరింగచ్ఛ సదాన్వే" అను పదాలతో కూడి ఉంది. "వికటే" అను పదము వేంకట అను పదానికి మరోరూపం. వేంకట అంటే అమంగళములను దూరంగా పారద్రోలేది, పాపములను పరిహరించునది అని ఈ పదానికి అర్థం.

వేంకటాచలము అంటే పాపాలను దహించేసే కొండ అని భవిష్యోత్తరపురాణం, బ్రహ్మాండపురాణంనందు చెప్పబడింది. వేదాంతదేశికులవారు రెండురకాలైన పాపాలను తొలగించే పర్వతం (ఇరువినైయుం కడియుం వెర్పు) అని అధికార సంగ్రహంలో వేంగడము మహిమను కీర్తించారు.

"వ్యం హః" అంటే పాపసమూహం అని ఋగ్వేదం నందు చెప్పబడింది. "వైం" అను అక్షరానికి "కట" అను పదం చేరి "వైంకట" అని



ఏర్పడి క్రమక్రమంగా "వేంకట" అను ప్రాకృతరూపమేర్పడి ఉండ వచ్చని విద్వాంసుల వాదన. "వ్యః హః కటయతి" "వైంకటః" అని చెప్పారు. వేంగడము అను తమిళపదాన్ని వేంకట అను పదప్రయోగమును సూక్ష్మీకరిస్తే వేంగడము అను రూపమే ప్రాచీనమైందిగా తోస్తుంది. వేంగడము తెలుగులో వేంగళ అయింది.


తిరుమలగా పిలువబడే వేంకటగిరిగురించి చెప్పే కథలు అనేకం పురాణాల్లో ఉన్నాయి. ఆర్తత్రాణపరాయణుడైన విష్ణువు భక్తులను రక్షించటానికి ఉత్తమం, పరమానందం ఐన వైకుంఠాన్ని వీడి స్వామిపుష్కరిణివద్ద లక్ష్మీదేవితో కొండపై భాగాన నిలిచి ఉన్నాడు. వైకుంఠం అనేది విష్ణునివాసం. వేంకటం అనేది కొండకు కొండపై నిలిచి ఉన్న దేవతకు పేరయింది. లక్ష్మీదేవి మహావిష్ణువు వక్షఃస్థలమున నివసిస్తుంది.. అందుకే స్వామి లక్ష్మీసహితుడై ఈ గిరిపై వెలశాడు. కనుకనే దీనికి "శ్రీగిరి" అనే పేరొచ్చింది. శ్రీగిరిపైన నివసించేవాడు కనుక ఇక్కడి స్వామి శ్రీగిరివాసుడు. అతడే శ్రీనివాసుడుగా ఆపదమొక్కులవాడై కొలువుదీరాడు.


ఈ కొండ మేరుపర్వతంనందలి భాగమే. ఈ కొండయే క్రీడాద్రి. విష్ణువు భూదేవిని సముద్రంనుండి ఉద్ధరించి భూలోకమున నిలిపి దేవితోసహా వెలసినప్పుడు క్రీడాద్రిని భూలోకానికి తెమ్మన్నాడు. అప్పుడు గరుత్మంతుడు ఆ క్రీడాద్రిని భూలోకమున వేంకట గిరిపై నిలిపినట్లుగా వేంకటాచలమాహాత్మ్యం నందుంది. ఆదిశేషుడు తూర్పుకనుమలకు చెందిన ఈ పర్వతపంక్తిపై శయనించి ఉన్నాడను భావన ఇట్టిదే. ఏడుకొండలలోని ఆదిశేషువు శిరోభాగం తిరుమల ఐతే, తోక భాగం శ్రీశైలమని చెప్తారు. శేషుని తలవైపు పర్వతం శేషాచలం, మధ్యభాగం అహోబిలం, పుచ్ఛభాగం శ్రీశైలమని చెప్తారు.

కలియుగంలో భక్తులను కాపాడటానికై లక్ష్మీసహితంగా ఆపదమొక్కులవాడిగా భూలోకమున కొండలలో వెలసిన కోనేటి రాయడు మనలను అనునిత్యం కాపాడుతున్నాడు.


**కట్టెదుర వైకుంఠం కాణాచయిన కొండ**
**తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ**

–అని అన్నమయ్య కీర్తించినట్లుగా స్వామి కలి యుగాంతంవరకు తిరుమలకొండలపై నిలిచి శరణన్న భక్తుల పాపాలను పోగొట్టి కాపాడు వేంకటేశ్వరుడు కొలువైన తిరు మలగిరిదర్శనం మోక్షకారకం. శాంతిదాయకం. కైవల్య దాయకం.





ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

## రామనాథపురక్షేత్రం

నారద, గంధర్వాదులు తమ తరువాతి మజిలీ 'రామనాథపుర' క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయప్రవేశద్వారం ఇరుప్రక్కలా నారాయణుని వాహనాలు, అనుంగుసేవకులైన పెరియతిరువడి (గరుడ), సిరియతిరువడి (ఆంజనేయ) గంభీరంగా స్వామి ఆజ్ఞకోసం అప్రమత్తులై నిలబడి ఉన్నారు.

గర్భాలయంలో వయోవృద్ధులైన శ్రీవైష్ణవోత్తములు శ్రీమాన్ లక్ష్మీనరసింహభట్టర్, స్వామికి నిత్యకైంకర్యం నిర్వహిస్తూ తరిస్తున్నారు. ఈ రామనాథపురక్షేత్రంతోకూడా ఉడయవర్ (రామానుజాచార్యుల) సంబంధం ఉంది.

ఇంతలో సాలిగ్రామంలో దర్శనం చేసుకున్న యాత్రిక బృందంకూడా అక్కడికి వచ్చి చేరుకుంది. శ్రీభట్టర్ అందరికీ వివరించబోయే స్థలపురాణం తాముకూడా వినాలనే ఉత్సుకతతో నారద బృందం తమ అదృశ్యరూపాల్లో ఒకప్రక్కగా నిలబడి ఉన్నారు. లక్ష్మీనరసింహభట్టరులు తమ గంభీరకంఠంతో స్థలపురాణం చెప్పటం ప్రారంభించారు. ఇది కర్ణాటకరాష్ట్రం హస్సన్‌జిల్లా లోని 'రామనాథపుర' అనే పవిత్రక్షేత్రం. హొయసలకాలం నాటి అద్భుతమైన శిల్పకళావైభవంతో అలరారే ఈ గడ్డకు ఎంతో గొప్పదైన పుణ్యచరిత్ర ఉంది. రామనాథపురను సాక్షాత్ 'దక్షిణకాశీ'గా సమ్మానిస్తారు. ఇక్కడ ఉన్న నాలుగు ప్రముఖ దేవస్థానాల్లో ఒకటి పట్టాభిరామునిది, ఒకటి సుబ్రహ్మణ్యేశ్వరుడిది, రెండు పరమేశ్వరునివి.

స్థలపురాణం అనాదినుండి చెబుతున్న విషయమేమిటంటే శ్రీరామచంద్రుడు రావణసంహారం తరువాత అయోధ్యకు తిరిగివెళ్తూ కావేరీతీరాన విడిదిచేసి, పవిత్ర కావేరిలో బ్రహ్మహత్యాపాతకాన్ని పరిహరించికోదలచాడు. కావేరీజలాలు మహా పవిత్రమైనవి. తాను దైవమైనా మానుష రూపంలో అవలంబించవలసిన నియమనిష్ఠలన్నీ ఆ పురుషోత్తముడు ఆచరించాడు.

కావేరీనదీమధ్యంలో ఒక దీవిలాంటి చోట చిన్నగుహ ఏర్పడి ఉంది. అందులో ఒక విగ్రహం ఉంది. అన్ని యుగాలలోనూ ఆ విగ్రహం సువర్ణప్రభలు వెదజల్లేది. అధర్మయుగమైన కలియుగంలో మాత్రం ఆ విగ్రహం బంగారువిగ్రహంలా కంటికి కనబడదు. రామచంద్రప్రభువు నదీమధ్యంలో కొలువైన ఆ స్వర్ణవిగ్రహం సమీపంలో బ్రహ్మహత్యాదోషం పరిహారం చేసుకునేందుకు పవిత్రస్నానం ఆచరించాడు.

ఇక్కడ భట్టర్‌గారు మరొకవిశేషం చెప్పారు. తన తండ్రికాలంలో స్వర్ణవిగ్రహం దరిదాపుల్లో విలువైన ముత్యాలు, రత్నాలు మొదలైనవి దొరికేవట. అవన్నీ రామచంద్రప్రభువు కిరీటంనుండి రాలినవని ప్రతీతి.

ఆ విధంగా శుద్ధిస్నానం చేసి సీతాలక్ష్మణసమేతుడై రామచంద్రుడు హీరేమగళూర్ దిశగా నడిచి వెళ్లాడట. ఆ ప్రదేశం రామనాథపుర దరిదాపుల్లోనే ఉంది. ఐతే కారణాంతరాలవల్ల అక్కడికి చేరుకోలేక వెనుదిరిగి వచ్చి రామనాథపుర చేరుకున్నారు. రామచంద్రుడు ఆ ప్రదేశం దాటి వెళ్ళలేదు కాబట్టి కూర్గ్‌జిల్లా హీరేమగళూర్‌లో తప్ప ఎక్కడా రామాలయం లేదు. ఆ ప్రదేశంలో విష్ణ్వాలయాలుకాక శివాలయాలు ఎక్కువగా కనిపిస్తాయి.

సోగ్సూర్ ఋషి ఆర్తితో చేసిన ప్రార్థనలననుసరించి శ్రీరామచంద్రుడు ఆయనకు సీతా, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, హనుమంతులతో కూడి పట్టాభిరామునిగా స్వప్నంలో సాక్షాత్కరించాడు. అటుపైన పురుషోత్తముడు అయోధ్యకు పయనమై, చేరుకొని అక్కడ అత్యంతవైభవంగా పట్టాభిషేకం జరుపుకుని రాజారాముడైనాడు. పట్టాభిషేకం కాకమునుపే ఋషివర్యుడికి పట్టాభిరాముడిగా రామనాథపురలో దర్శనమిచ్చి అనుగ్రహించాడు శ్రీరామప్రభువు.

ఇప్పటికీ శ్రీరామనవమిఉత్సవాలు రామనాథపురలో బ్రహ్మాండంగా జరుగుతాయి. సమీపంలోని రుద్రపట్టణ అనే ఊరు విద్వాంసులకు పుట్టినిల్లని పేరు. ఎక్కడెక్కడి విద్వాంసులు రామనవమికి అక్కడికి చేరుకొని, సంగీతోత్సవంలో సామగానలోలునికి సంగీతకైంకర్యం చేస్తారు. పదిహేనురోజులపాటు రామనవమివేడుకలు జరుగుతాయి. భాగవతతదీయారాధన అన్నిరోజులపాటు జరుగుతుంది. దూరాభారాలు లెక్కచేయక ఆస్తికజనులందరూ రాముని నీడలోకి చేరుకుంటారు.'

వారికి యాత్రికులు 'తొండనూర్' వెళ్తున్నట్లు వారి మాటలవల్ల తెలిసింది. ఇప్పుడా ప్రదేశంపేరు 'కేరే తొండనూర్'. భగవద్ రామానుజులు మేల్నాడు (కర్ణాటక)లో దర్శించిన పవిత్ర ప్రదేశాల 'అనుయాత్ర'ను ఆ బృందం చేస్తున్నట్లు నారదుడు తన బృందంతో చెప్పాడు. భూలోకంలో మహానుభావులైన ఉభయవేదాంత విద్వాంసులు శ్రీమాన్ వేలుక్కుడికృష్ణన్‌స్వామి, శ్రీకృష్ణప్రేమిస్వామి, ఉభ.వేదా. అనంత పద్మనాభాచార్‌వంటి సత్పురుషులు వందలాది ఆస్తికజనులను ఇలాంటియాత్రలు చేయించి ఆయా ప్రదేశాల్లో ప్రవచిస్తారు. 'శ్రీరామ అనుయాత్ర', 'శ్రీకృష్ణ అనుయాత్ర', 'అయోధ్యాయాత్ర' వంటివి ఈ మహాపురుషులు జరిపి ఉన్నారు. ఇటువంటి మహానుభావుల ఉనికివల్ల ధర్మం ప్రవర్తిల్లుతున్నదంటే అతిశయోక్తి కాదు. ఇప్పుడు శ్రీకరస్వామి ఈ భక్తబృందాన్ని 'రామానుజ అనుయాత్ర' కోసం మేల్నాడు తీసుకువచ్చాడు.

## తొండనూర్ క్షేత్రదర్శనం

నారదగంధర్వాదులు తమ భూలోకయాత్రలో భాగంగా ఇతర భక్తబృందం వెనుకనే బయలుదేరి 'తొండనూర్' చేరుకున్నారు.

భక్తబృందం వెనుకనే నారదాదులు తొండనూర్ 'నంబి నారాయణ' స్వామి ఆలయానికి చేరుకున్నారు. అదొక విశాలమైన గొప్ప ప్రాంగణం. భారతీయ పురాతత్త్వ సర్వేక్షణ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) పరిరక్షణలోని కట్టడం అది. అక్కడి వాచ్‌మాన్ యాత్రికబృందాన్ని శేషాద్రిభట్టర్ ఇంటికి వెళ్లి ఆయనను నంబి నారాయణస్వామి దర్శనం చేయించండని అర్థించమని సలహా చెప్పాడు. దాని తరువాత రఘురాం భట్టర్‌ను కలుసుకుని పార్థసారథి, యోగనరసింహసన్నిధుల దర్శనం చేసుకొమ్మని చెప్పాడు. భక్తులు వెళ్లి అడిగిన తక్షణమే శేషాద్రి భట్టర్ తాళాలు తీసుకువచ్చి ఆలయద్వారాలు తెరిచాడు.

## తొండనూర్ 'నంబి నారాయణుడు'

బస్సు దిగిన యావన్మందిభక్తులతో శేషాద్రిభట్టర్, నంబి నారాయణస్వామి ఆలయంలోకి ప్రవేశించాడు. లోపలికి అడుగు పెట్టకమునుపే ఏకశిలలో మలిచిన గొప్ప దీపస్తంభం సేవార్థులకు స్వాగతం చెబుతుంది. బయటిప్రాకారంలో జగన్మాత అరవిందనాయకి(అంబుజవల్లి) సన్నిధి కనిపిస్తుంది. పద్మపీఠంపై ఆసీనురాలైన ఆ తల్లిదర్శనం తాపత్రయాలను హరింపజేస్తుంది. కిరీటం, తిలకం ధరించిన అమ్మవారు మేల్నాడు సంప్రదాయం అనుసరించి ముక్కుకు ఎడమప్రక్క నాసాభరణం ధరించి ఉంటుంది. నాలుగుచేతుల్లో రెంటిలో పద్మాలను ధరించిన తల్లి రెండుచేతులతో ఆశీర్వదిస్తుంది. ఆమెకు పుష్పాలంకరణ లేకపోవటం ఆశ్చర్యకరం.

భట్టర్‌గారు జగన్మాతకు కర్పూరహారతి నివ్వగా ఆ కరుణామూర్తికి నారద గంధర్వాదులుకూడా ప్రార్థనానమస్కారాలు సమర్పిస్తారు. అంతా ప్రదక్షిణ ముగించి గర్భాలయంలోకి ప్రవేశిస్తారు. లోపల అంతటా దట్టమైన చీకటి. వాచ్‌మాన్ అందరినీ సహనంతో ఉండమని చెబుతూ పెద్ద అద్దం పుచ్చుకుని బయటకు వెళ్లాడు.

సూర్యునికి అభిముఖంగా అద్దం పట్టగానే సూర్యకాంతి నంబినారాయణ భగవానుని మూలవిగ్రహాన్ని ప్రకాశవంతం చేస్తుంది. నంబినారాయణుని ఉజ్జ్వలసౌందర్యశోభ అందరిని సమ్మోహనపరుస్తుంది. నారదాదులు మూలవిరాట్‌సమీపానికి చేరుకొని స్వామిదర్శనాన్ని తనివితీరా ఆస్వాదించారు. శేషాద్రి భట్టర్ లోపలికి వచ్చి చిన్న విద్యుద్దీపాన్ని వెలిగించి దీపారాధన చేసి, అష్టోత్తరాలతో భగవానునికి కర్పూరహారతి నిస్తాడు. యాత్రికులంతా యథాశక్తి దక్షిణ సమర్పిస్తారు.

భట్టర్ నంబినారాయణ స్వామిగురించి వివరంగా చెప్పాడు.'ఈ ఆలయ అధిష్ఠానదైవం నంబి నారాయణుడు. ఈ భగవానుని 'యదుపురీశ్వరుడ'ని కూడా వ్యవహరిస్తారు. ఆలయ

విమానం పేరు 'చతుర్ముఖ'. భగవానుడు తూర్పుదిశగా నిలబడి సేవ ప్రసాదిస్తాడు. పై రెండుహస్తాల్లో గదాపద్మాలు, క్రింది చేతుల్లో శంఖ, చక్రాలు ధరిస్తాడు.

నీల అనే రాక్షసిని సంహరించి, సిద్ధగిరిలో తపమాచరించిన నీలలోహితరుద్రునికి, తొండనూర్‌నంబికికూడా ఈ భగవానుడు ప్రత్యక్షదైవం. నంబికి సమాశ్రయణం చేసింది కూడా సాక్షాత్తు భగవానుడే. అందుకే ఈ మూర్తి కుడిచేతిలో శంఖం, ఎడమచేత చక్రం ధరించి ఉంటాడు. అదే నిదర్శనం. అలా ధరిస్తేనే సమాశ్రయణం చేసే వీలుంటుంది.

మిథునమాస, హస్తానక్షత్ర ముహూర్తంలో వేదపురుషుడు నంబి నారాయణుని ప్రతిష్ఠించాడు. విష్ణువర్ధనమహారాజు తరువాతికాలంలో తొళప్పాచార్యులు ఆలయ జీర్ణోద్ధరణ గావించారు.

నంబినారాయణ గర్భగుడి బయటకు రాగానే తిరుమంగైఆళ్వార్, నమ్మాళ్వార్, విష్వక్సేనులు, ముదలియాణ్డాన్, తొండనూర్‌నంబి, పిళ్ళైలోకాచార్యులు, మనవాళమహామునుల దివ్యమూర్తులు దర్శనమిస్తాయి.

ప్రదక్షిణ ముగించగానే భగవద్రామానుజులు, ప్రక్కనే ముకుళితహస్తాలతో గురుదేవుని చూస్తున్న శిష్యుడు 'తొండనూర్ నంబి' మూర్తులు దర్శనమిచ్చాయి. ఆ పరిసరాలలోనే అత్యద్భుతమైన 'రామానుజ విజయపీఠం' ఉంది. ఆ ఆసనంమీద వేంచేసి రామానుజులు సత్కాలక్షేపాలు నిర్వహించేవారు. పురాతత్త్వ శాఖ అధీనంలో ఉన్న ఆ పీఠం చక్కగా, శుభ్రంగా పరిరక్షింపబడుతున్నది. ఆ పీఠంపై రామానుజుల తిరువడి అనగా శ్రీపాద చిహ్నాలు చెక్కి ఉన్నాయి. భక్తబృందం శేషాద్రిభట్టర్‌కి దక్షిణ సమర్పించి, వాచ్‌మాన్‌కి కానుకగా కొంత రుసుము ఇచ్చారు.

తొండనూర్‌లోని మరి రెండు దేవాలయాల దర్శనం ముగిసినతరువాత నంబినారాయణ సన్నిధికి చేరుకొని ఆ విశాల ప్రాంగణంలో తొండనూర్‌క్షేత్రచరిత్ర, ఆ ప్రదేశానికి కల రామానుజసంబంధం గురించి చెబుతానని శ్రీకరస్వామి ప్రకటించాడు.

## పార్థసారథికోవెల- తొండనూర్

రామానుజ మేల్నాడు అనుయాత్ర భక్తబృందానికి పార్థసారథి కోవెల అర్చకులు రఘురామ్‌భట్టర్ చిరునవ్వుతో సాదరంగా స్వాగతం పలికారు. తమిళనాడు సంప్రదాయ దేవాలయాలకు మోస్తరుగానే ఈ కోవెలకుకూడా ఒక పెద్ద సింహద్వారం ఉంది. రాజగోపురం శోభాయమానంగా ఉంది.

నారదాదులు సూక్ష్మశరీరాలతో భక్తబృందం వెనకాలే నడుస్తూ బయటిప్రాకారం చుట్టి ఈశాన్యమూలన కొలువైన తల్లి 'యాదవనాయకి'ని దర్శించి ఆ జగన్మాతదీవెనలు అందుకున్నారు. రఘురామ్‌భట్టర్ ప్రధానసన్నిధి తలుపులు తెరవగానే క్షేత్రదైవం పార్థసారథిస్వామి రుక్మిణీసత్యభామాసహితుడై పరివేష్ఠించి దర్శనమిచ్చాడు. మూలవిగ్రహాలు నయనానందకరమై శోభిల్లుతున్నాయి. సన్నిధి ప్రకాశవంతంగా, దేదీప్యమానమై ఉండటం అందరూ గమనించారు. ఉత్సవమూర్తి 'ముద్దు వేణుగోపాలుడు' చేత మురళిని ధరించి రుక్మిణీ సత్యభామలతో భక్తజనులను బ్రోవటానికి అక్కడే నెలకొని ఉన్నాడు.

ఇంతలో కరెంటు పోయింది. ఐతే దర్శనభాగ్యానికి అంతరాయం కలుగకుండా సోలార్‌లైటు తక్షణమే వెలిగింది.

శ్రీకరస్వామి తరచూ తొండనూర్‌యాత్ర చేస్తూ ఉంటాడు. ఆయనకు భట్టర్ సుపరిచితుడు. పార్థసారథికోవెల, యోగనరసింహసన్నిధి, ఈ రెండూ రాష్ట్రప్రభుత్వం ముజ్రాయి శాఖ పరిధిలోనివి. రఘురామ్‌భట్టర్ ప్రయత్నాలవల్ల ఒక భక్తుడు గర్భాలయంలో అత్యవసర వినియోగందృష్ట్యా సోలార్ లైట్లు సమర్పించాడు.

మంగళహారతినిస్తూ భట్టర్ మూలవరులకు 'పార్థసారథి, గోపాలకృష్ణ, యాదవనాయక, యాదవపురీశ్వర' అనే వివిధ నామాలున్నాయని చెప్పాడు. రుక్మిణి, సత్యభామ, యాదవ నాయకి అనేవి తాయార్ నామధేయాలు. ఈ క్షేత్రవిమానం 'వైజయంత'. మూలవరులు తూర్పుదిశ సేవ. భృగుమహర్షి ప్రతిష్ఠించిన అర్చామూర్తి, ఉత్సవమూర్తి పాదాలను పరిశీలిస్తే కుడికాలుకు బదులుగా ఎడమకాలు ముందుకు ఉన్నది. ఈ భంగిమను 'త్రిభంగి నటనముద్ర' అంటారట. భక్తులతోపాటు నారదాదులుకూడా భగవానుని మూర్తులను దర్శించి ఎంతో ఆనందాన్ని పొందారు. సన్నిధి బయటకు రాగానే లోపలి ప్రాకారంలో ఆళ్వార్, ఆచార్యుల సన్నిధి ఎదురైంది. ఈ సన్నిధిలో వేదాంతదేశికులు అరుదైన అంజలిముద్రతో దర్శనమిచ్చారు. ఈ విశేషం ప్రభుత్వ ముజ్రాయి దస్తావేజుల్లోకూడా లిఖించి ఉన్నదని భట్టర్ చెప్పారు. రాజగోపురం బయటికి నడుస్తుండగా గొప్ప శిలాకట్టడానికి అమర్చిఉన్న ఉయ్యాల (ఊంజల్) కనిపించింది.

(ఇంకా ఉంది)

యువత

# గురు శ్లోకం

– శ్రీ యం.రవితేజ

గురువు అంటే జ్ఞానాన్ని ప్రసాదించేవాడు అని అర్థం. గురువు అన్న పదం వినగానే–

“గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీగురవే నమః”

అన్న శ్లోకం స్ఫురణకు వస్తుంది. లోకంలో ఏ మహానుభావుడు ఎప్పుడు చెప్పాడో కానీ ఈ శ్లోకం వేదమంత్రం కన్నా గొప్పదయింది. దీనిని గురించిన ఒక కథ ప్రచారంలో ఉంది.

పూర్వకాలంలో గురుకులాలు ఉండేవి. ఆనాడు గురుకులంలో దాదాపు వెయ్యిమందిదాకా శిష్యులు ఆశ్రమంలో ఉండి విద్యాభ్యాసం చేసేవారు. రాజునుండి సామాన్యుడిదాకా తరతమభేదాలు లేక అందరూ గురుశుశ్రూష చేస్తూ విద్య నేర్చుకునేవారు. అలా వేదధర్ముని గురుకులంలో ఎందరో శిష్యులు విద్య నేర్చుకునేవారు.

వేదధర్ముడు సర్వశాస్త్రకోవిదుడు. జ్యోతిష్యశాస్త్రంలో అపారమైన పాండిత్యం కలవాడు. శిష్యులను చేరదీసి తనవద్దనే ఉంచుకొని విద్య నేర్పేవాడు. అలా ఆయన శిష్యుల్లో ఒకడు కౌత్సుడు. ఆతడు ఏకసంథాగ్రాహి. గురువుగారు చెప్పింది చెప్పినట్లుగా నేర్చుకునే ప్రతిభ అతని స్వంతం. క్షణకాలంకూడా వృథా కానీయక శ్రద్ధాభక్తులతో సకలశాస్త్రాలను, విద్యలను నేర్చుకున్నాడు. గురువుగారివద్ద జ్యోతిష్యశాస్త్రపరిశీలనలోగల మెళకువలను తెలుసుకున్నాడు. ఆనాడు గురుకులాల్లో శాస్త్రవిద్య అంతా పూర్తయినతర్వాత స్నాతకోత్సవసభ జరుపబడేది. శిష్యులంతా గురువుగారితో తమకున్న అనుబంధాన్ని, అనుభవాలను తెలియజేసి గురుదక్షిణ సమర్పించుకుని వారి వారి ఇళ్లకు వెళ్లేవారు.

కౌత్సుడి విద్యకూడా పూర్తికావచ్చింది. వేదధర్ముడు ఒకసారి గ్రామాంతరం వెళుతూ ఆశ్రమబాధ్యతలను వహించమని కౌత్సుడికి అప్పజెప్పి వెళ్లాడు. ఆ తర్వాత మూడురోజులకు ఆశ్రమానికి తిరిగివచ్చిన వేదధర్ముడు శిష్యుడు ఆశ్రమ బాధ్యతలను నిర్వహించిన తీరు చూసి ఎంతగానో ఆనందించాడు. తర్వాత కొన్నిరోజులకు విద్య పూర్తై శిష్యులందరు వారి వారి ఇళ్లకు బయలుదేరారు. కానీ కౌత్సుడుమాత్రం గురువుని వదిలి వెళ్లనని పట్టుబట్టాడు. అపుడు గురువుగారు నువ్వు ఇంటికి వెళ్లకపోవటానికి కారణం ఏమిటని అడిగాడు. అప్పుడు కౌత్సుడు గురువుగారి పాదాలపై పడి రోదిస్తూ ఇలా అన్నాడు.

స్వామీ! మీరు గ్రామాంతరం వెళ్ళినప్పుడు మీరు నేర్పిన జ్యోతిష్యవిద్యగురించి తెలుసుకుందామన్న కుతూహలంతో మీ జాతకాన్ని పరిశీలించాను. ఈ కార్తికమాసంలో తమరికి అతి భయంకరమైన కుష్ఠవ్యాధి రాబోతోందని మీ గ్రహస్థితిలో కనిపించింది. నాకు తిండిపెట్టి, జ్ఞానాన్ని ప్రసాదించి, జీవితాన్నిచ్చిన మిమ్మల్ని ఇంతటి కష్టసమయంలో విడిచి వెళ్ళను. మీకు సేవలుచేస్తూ మీరు ఆరోగ్యవంతులైనతర్వాతే నేను వెళతాను అన్నాడు.

అప్పటినుండి గురువుగారు ఆరోగ్యంగా ఉండాలంటే ఏం చేయాలని ఆలోచించి పూజలు, జపాలు, యాగాలు ఏమైనా చేద్దాం. ఆ మంత్రాల ప్రభావంవల్ల వ్యాధి రాదు కదా అన్నాడు కౌత్సుడు. అందుకు... “ప్రారబ్ధం భోగతో నశ్యేత్” ప్రారబ్ధాన్ని ఎంతటివారైనా, ఎప్పుడైనా అనుభవించాల్సిందే అన్నారు గురువు. ఆ ప్రారబ్ధకర్మను నేను ఈ వ్యాధిరూపంగా అనుభవించి విముక్తుడనవుతాను అన్న ఆనందంతో ఉన్నాను. నీవు బాధపడకు అన్నారు. కౌత్సుడు కాశీలో పాపంచేసినా, పుణ్యంచేసినా రెట్టింపు ఫలితం వస్తుందంటారు. కాబట్టి మనం కాశీకి వెళ్లి యాగాలు చేద్దాం. అప్పుడు మీరు కోలుకుంటారన్నాడు కౌత్సుడు. ఆ మాటప్రకారం ఇద్దరూ కాశీకి వెళ్లారు. అక్కడ శివపంచాక్షరీమంత్రజపం చేయటం, విద్యాదానం చేయటం, ఇతరులకు సహాయసహకారాలు అందించటం లాంటి సత్కార్యాలు చేయసాగాడు కౌత్సుడు. మిట్టమధ్యాహ్న సమయంలో కాళ్లకు చెప్పులు లేకుండా జోలె పట్టుకొని భిక్షాటనద్వారా వచ్చిన అన్నాన్ని ముందుగా గురువుగారికి పెట్టి తరువాత తాను తినేవాడు. ఒక్కొక్కసమయంలో తాను తినక శిష్యుణ్ణి తిననీయక అన్నాన్ని విసిరి నేలకేసి కొట్టడం, అతణ్ణి తిట్టడంలాంటిపనులు చేసేవారు గురువు. ఐనాకూడా ఎప్పుడూ గురువుగారిని విసుక్కోకుండా వారికి వ్యాధి ముదిరి బాధపెడుతోంది కాబోలు. ఎప్పుడూ చిన్నమాటకూడా అనని వారు ఇలా ప్రవర్తించడానికి కారణం వ్యాధిబాధే అనుకుంటాను అని మరింతగా సేవలు చేసేవాడు కౌత్సుడు.

కౌత్సుడి గురుభక్తిని పరీక్షింపదలచి త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురు ఒక పందెం వేసుకున్నారు. మన ముగ్గురిలో ఎవరు కౌత్సుడిని గురువుగారి వద్దనుండి పంపుతారో వారే మనలో గొప్పవారు అని. కౌత్సుని గురుభక్తి భగవంతుడు పరీక్షలు పెట్టేస్థాయికి చేరుకున్నది అన్నమాట.

ముందుగా బ్రహ్మ మారువేషంలో వచ్చి నువ్వు కాశీ వచ్చినప్పటినుండి చూస్తున్నాను. ఎందుకు ఆయనదగ్గర అన్ని మాటలు పడుతున్నావు. పెద్దవాడిగా చెప్తున్నాను. నా మాట విని నీవు వేరే గురువును చూసుకొని వెళ్ళిపో అన్నాడు. వ్యాధితో ఇంతగా బాధపడుతున్న ఆయనని వదిలేసి వెళ్ళమని చెప్తున్న మీరు పెద్దవారెలా ఔతారు. మీరే మా గురువుగారి పరిస్థితుల్లో ఉంటే మీ శిష్యుడు మిమ్మల్ని వదిలి వెళ్లిపోవాలని మీరు కోరు కుంటారా? అన్న కౌత్సుడి మాటలను విన్న బ్రహ్మ తలవంచు కుని అక్కడినుండి వెళ్ళిపోయాడు.

తరువాత విష్ణువు మారువేషంలో వచ్చి రోగంతో వ్యాధిగ్రస్తుడైన గురువుగారికి సేవ చేస్తున్నందుకు నిన్ను మన స్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కాని చేసినమేలు మరిచే కృతఘ్నునికి సేవచేస్తే పాపం వస్తుంది. నిన్ను ఇంతగా బాధి





స్తున్న అతణ్ణి వదిలి వెళ్ళిపో అన్నాడు. దానికి కౌత్సుడు ఇంత కాలం అన్నంపెట్టి నానుండి ఏమీ ఆశించకుండా నాకు తన విద్యనంతా ధారపోసిన ఆయనది కాదు కృతఘ్నత. ఇప్పుడు ఆయనను వదలి వెళితే నాది కృతఘ్నత అనేసరికి విష్ణువుకూడా మారుమాట్లాడక వెనుదిరిగిపోయాడు.

ఆ తరువాత ఈశ్వరుడుకూడా మారువేషంలో వచ్చి “మానవసేవే మాధవసేవ” అన్నమాట సత్యమే. కానీ ఛీత్కారాలు పొందుతూ, తాను తినకుండా, నిన్ను తిననీయకుండా అన్నాన్ని నేలపాలు చేయటం తప్పు కదా! నువ్వు కొన్నాళ్ళు దూరంగా వెళితే ఆయనకు నీ విలువ తెలిసివస్తుంది అన్నాడు. అందుకు కౌత్సుడు సాష్టాంగపడి తిండిలేక బాధపడే నాకు అన్నంపెట్టాడు. అంతేకాక ఆ తిండిని పొందగల విలువైన విద్యని బోధించారు. ఎన్నో సంవత్సరాలపాటు ఉచితంగా భోజనం పెట్టి విద్యను ప్రసాదించిన ఆయనకు నన్ను ఉపవశింపచేసే హక్కుకూడా ఉంది. ఓ మహానుభావా! మీముందు మరో ఇద్దరుకూడా వచ్చారు. మీరు ఇక్కడే కాపలాగా ఉండి ఇలాంటి అనవసరమైన నీతులు ఇంకెవరూ చెప్పకుండా చూడండి చాలు అన్నాడు. అప్పుడు ఆ త్రిమూర్తులు ముగ్గురు ఆతని గురుభక్తికి మెచ్చి ఓ కౌత్సుడా! మేము త్రిమూర్తులం. నీ గురుభక్తిని పరీక్షించాలని వచ్చాం. నీ అపారమైన గురుభక్తికి మెచ్చాం. మేము పెట్టిన పరీక్షల్లో నెగ్గి నీ గురుభక్తిని చాటుకున్నావు. మేము నీకు మోక్షాన్ని ప్రసాదిస్తున్నాం అన్నారు. దానికి ఆనందించిన కౌత్సుడు మీ దర్శనభాగ్యమే నా అదృష్టం. ఇప్పుడు మీ దర్శనభాగ్యం కలిగించిందికూడా మా గురుదేవులే. కనుక నాకు బ్రహ్మ విష్ణువు ఈశ్వరుడు ఈ ముగ్గురిని సృష్టించిన ఆ పరబ్రహ్మ సైతం నాకు నా గురువే అన్న సందర్భంలోనిదే పై తెల్పిన శ్లోకం. నాకు మోక్షానికి అర్హత కలిగిందంటే విద్యలను నేర్పించి నన్ను తీర్చిదిద్దిన మా గురువుగారికికూడా ఆ అర్హత ఉంది. కనుక ముందుగా ఆయనకివ్వండి అన్నాడు కౌత్సుడు.

గురుభక్తి గల గొప్ప శిష్యుడికి, అటువంటి గొప్ప శిష్యుణ్ణి తయారుచేసినందుకు గురువైన వేదధర్మునికి త్రిమూర్తులు మోక్షాన్ని ప్రసాదించారు. గురుశిష్యసంబంధాన్ని గురించి చెప్పిన అద్భుతమైన కథ ఇది.

అలా ప్రస్తుత యువతకూడా గురుశుశ్రూష చేసి విద్యను అభ్యసించి, తద్వారా మంచి జీవనయాత్రను సాగించి, ఆ పై మోక్షం పొందడానికి అర్హులౌతారని ఆశిద్దాం.

2024, అక్టోబరు 08న
తిరుమల శ్రీవారి
'మోహినీ అవతారసేవ' సందర్భంగా...

# ర్యాలీ

- డా॥ యస్.పద్మావతి,
96762 69300

తిరుమల తిరుపతి దేవస్థానమునకు సంబంధించి తిరుమల ఆలయంలోనూ, ఇతర అనుబంధఆలయాల్లోనూ అక్కడ కొలువై ఉన్న దేవతాగణానికి ప్రతిసంవత్సరం అఖండంగా బ్రహ్మోత్సవంపేరిట అత్యంతవైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. అందులో "మోహినీ అవతారం' అనే వాహనసేవ ప్రత్యేకమైన ప్రాముఖ్యతను సంతరించుకొంది. ఆ కోవలో తిరుమలస్వామి బ్రహ్మోత్సవంలో మోహినీసేవ సందర్భంగా 'శ్రీజగన్మోహినీ కేశవస్వామి' ఆలయం గురించి తెలుసుకుందాం.

ఆంధ్రదేశంలో తూర్పుగోదావరిజిల్లా కొత్తపేట తాలూకా రావులపాలెంకు 6 కి.మీ.దూరంలో ర్యాలీగ్రామం ఉంది. అందు భక్తులకు ముక్తిప్రధానక్షేత్రంగా ఒక దేవాలయం అలరారుతూంది. అదే 'శ్రీజగన్మోహిని కేశవస్వామి ఆలయం'. ఇటువంటి ఆలయం ఆంధ్రదేశంలోనే కాదు ప్రపంచంలోనే ఎక్కడా లేదనే చెప్పవచ్చు.

## స్థలపురాణం

పూర్వం దేవతలు, దానవులు పాలసముద్రాన్ని మథించగా అమృతం పుట్టింది. దానికోసం దేవతలు, దానవులు కయ్యానికి కాలుదువ్వారు. అప్పుడు విష్ణువు మాయామోహినీ రూపాన్ని దాల్చి అమృతభాండాన్ని తీసుకున్నాడు. అమృతాన్నంతా దేవతలకే పంచిపెట్టి దానవులకు ఏమీలేకుండా చేసేశాడు. ఆ సమయంలో సుందరసుకుమార ముగ్ధమోహినీ రూపాన్ని చూశాడు ఈశ్వరుడు. ఆమె రూపలావణ్యాలకు, హావభావచేష్టలకు ముగ్ధుడయ్యాడు. ఆమెను కౌగిలించుకోబోయాడు. అందుకు మోహిని భయపడి పరుగెత్తనారంభించింది. ఈశ్వరుడు ఎలాగైనా మోహినిని ఒక్కసారి ఆలింగనం చేసుకోవాలనే పట్టుదలతో ఆమెను వెంబడించాడు. ఇద్దరూ లోకాలన్నీ తిరిగి తిరిగి అలసి చివరికి రత్నపురప్రాంతాన్ని చేరుకున్నారు. అక్కడికి చేరగానే మోహిని జడలోని ఒకపువ్వు రాలి క్రిందపడిందట. వెంటనే ఈశ్వరుడు ఆ పువ్వును అందుకొని, దాని సువాసనను పీల్చి తన్మయుడై మోహనీరూపాన్ని చూశాడు. ఎదురుగా విష్ణువు ప్రత్యక్షమయ్యాడు. అలా విష్ణువును చూడగానే ఈశ్వరుడు ఎంతగానో సిగ్గుపడ్డాడు. అవమానభారంతో తలవంచుకున్నాడు. "కైలాసానికి ఎలా వెళ్ళేది?" అంటూ అక్కడే లింగస్వరూపుడై ఆవిర్భవించబోయాడు. అప్పుడు బ్రహ్మ తన కమండలం ఆధారంగా 'ఉమాకమండలేశ్వరస్వామి' అనుపేరుతో శివలింగాన్ని ప్రతిష్ఠింపజేశాడు. అదే నేటి ర్యాలీగ్రామంలోని శివాలయంగా ప్రసిద్ధికెక్కింది.



## చారిత్రకనేపథ్యం

పూర్వం దంతచోళుడనే చక్రవర్తి వేటకై అడవికి వెళ్ళాడట. అలా అలసిపోయి ఒక చెట్టునీడలో విశ్రమించాడట. అప్పుడు ఏవేవో వింతవింతశబ్దాలు వినిపించాయట. లేచి చూడగా ఏమీ కనిపించలేదట. అతడు తిరిగీ విశ్రమించగా కలలో విష్ణువు కనిపించి "ఓ రాజా! నీవు ఒక రథాన్ని తయారు చేయించు. ఆ రథాన్ని ఈ ఊర్లో ఊరేగించు. ఆ సమయంలో రథానికున్న ఒక చీల ఊడి ఏ ప్రాంతంలో ఐతే పడుతుందో అక్కడ త్రవ్వించు. అక్కడ నా విగ్రహం నీకు కనిపిస్తుంది. ఆ విగ్రహాన్ని అక్కడే ప్రతిష్ఠించి, గుడి కట్టించు" అని చెప్పాడట. ఆ ప్రకారమే రాజు అక్కడ త్రవ్వించి చూడగా విగ్రహం కనిపించిందట. దాన్ని అలాగే అక్కడే ప్రతిష్ఠించి, అక్కడ ఆలయం నిర్మించాడట. ఆ ఆలయమే 'శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయం'గా ప్రసిద్ధికెక్కింది.



## ఆలయనిర్మాణరీతి

ఈ ఆలయం ఎత్తైన రాజగోపురంతో, అంతరాలయంతో, గర్భగుడి మున్నగువాటితో అలరారే ఈ దేవాలయంలో వెన్న వలె నునుపుగా, మృదువుగా చెయ్యివేస్తే జారిపోయే సాలగ్రామ శిలతోనూ, అద్భుతమైన శిల్పసంపదతోనూ విరాజిల్లుతూ, చూడ ముచ్చటగా చూపరులను ఆశ్చర్యచకితులను చేసేలా ఉంటుంది. ఇంతటి నునుపైన శిల్పం ఆంధ్రలో మరెక్కడా కనిపించదు. ఈ ఆలయంలోని విష్ణుమూర్తి శంఖ, చక్ర, గదా, పద్మములతో నిలిచి ఉన్నాడు. విగ్రహశిల్పరీతినిబట్టి ఇది కాకతీయుల కాలంనాటిదని చెప్పొచ్చు. ఈ విగ్రహం చక్కని నల్లరాతిపై చెక్కబడింది. ఈ శిలనే సాలగ్రామశిల అంటారు. ఇటువంటి శిల ఈ ప్రాంతంలో దొరకదు. కాబట్టి దీనిని ఎక్కడినుండో తెచ్చి ఇక్కడ చెక్కించి ఉంటారు.

విగ్రహం వెనుకవైపు స్త్రీమూర్తి కనిపిస్తుంది. ఆమెయే జగన్మోహిని. దేశంలోని ఇతర కాకతీయశిల్పాలతో పోల్చి చూసినట్లయితే ఈ విగ్రహశిల్పచాతుర్యం అత్యున్నతస్థాయికి చెందిందని చెప్పవచ్చు. అన్నిభాగాలు 'మానసార' ప్రమాణాన్ని అనుసరించి ఉన్నాయి. ఈ ఆలయం ఎదురుగా ర్యాలీగ్రామం లోనే ఒక శివాలయం ఉంది. ఇదికూడా చాలా పురాతనమైనదే. ఇది చోళులకాలంనాటిదని కొన్ని ఆధారాలవల్ల తెలుస్తోంది.

ఈ దేవాలయం రాజగోపురమంతా సుందరశిల్ప మయంగా ఉంది! అంతరాలయంతోనూ, గర్భగుడితోనూ, ప్రహరీ గోడతోనూ అందంగా తీర్చిదిద్దబడి ఉంది ఆలయం. రాజద్వారం నుండి లోపలికి ప్రవేశించగానే ముఖమండపంలో ఎడమవైపున శ్రీదేవిప్రతిమ, కుడివైపున భూదేవిప్రతిమ వెండితొడుగులతో పాటు మకరతోరణాలతో ఉత్తరంవైపు శ్రీరమాసత్య నారాయణస్వామి ప్రతిమలు చక్కగా అలంకరించ బడి ఉన్నాయి. ముఖమండపంనుండి లోనికి వెళ్ళే ద్వారానికి ఇరువైపులా జయవిజయులు అనే ద్వారపాలకుల విగ్రహాలు చూడముచ్చటగా ఉన్నాయి. ఈ మండపంలో నాలుగు భూగర్భగృహాలు ఉండటం గమనార్హం. ముఖమండపద్వారానికి పైభాగాన శేషపాన్పుపై లక్ష్మీనారాయణులు చెక్కబడి ఉన్నారు. అంతరాలయంనుండి లోనికి వెళ్ళగానే గర్భగుడి సాక్షాత్కరిస్తుంది. అందులోనే శ్రీజగన్మోహినీ కేశవ స్వామివారి దివ్యమూర్తి ప్రతిష్ఠించబడి ఉంది.

ఈ దివ్యమూర్తి విగ్రహం 5అడుగుల ఎత్తు, 3అడుగుల వెడల్పుతో జీవకళ ఉట్టిపడేలా ఉంది. ఇది ఏకశిలావిగ్రహం. సాలగ్రామశిల. ఈ విగ్రహం ముందు భాగాన పురుషరూపం, వెనుకవైపున స్త్రీరూపంతో ప్రకాశిస్తుంది. విష్ణువు శిరస్సున కిరీటం, నుదుట ఎరుపు తెలుపుల నామం, చెవులకు మకరకుండలాలు, మెడలో కౌస్తుభమణిహారం, వనమాల, రత్నహారాలు ఉన్నాయి. స్వామివారి చతుర్బాహువుల యందు ఒకప్పుడు శంఖం, చక్రం, గద, పద్మం ఉండేవి. ఎడమచేతిలోని చక్రం, అభయహస్తంలోని పద్మం ప్రస్తుతం లేవు. అలాగే ఇక్కడ విష్ణువు ముక్కుకూడా కొంచెం దెబ్బ తగిలి ఉంది. నాభిస్థానంలో ధోవతికట్టు, ఉత్తరీయం, భుజముల యందు అంగద, కేయూర, కంకణ, రత్నాంగుళీయకములు నిగనిగలాడే పట్టుబట్టలపై చిరుగంటల మొలత్రాడు మనో హరంగా చెక్కబడి ఉన్నాయి. అభయహస్తంలో రేఖలు స్పష్టంగా కనిపిస్తూండటం ఒకవిశేషం. ఎడమచెయ్యి క్రిందిభాగంలో గద, నాలుగువ్రేళ్ళకు నాలుగు ఉంగరాలు, స్పష్టంగా మానవుని బోలిన గోళ్ళు అద్భుతంగా చెక్కబడి ఉన్నాయి. హస్తమందలి ప్రతిభాగం సజీవకళ ఉట్టిపడుతూ విశ్వమందలి లావణ్యమంతా అందులో ఇముడ్చుకున్నదేమో అన్న సందేహం కలిగిస్తుంది.

ఇక్కడ కొలువై ఉన్న విష్ణువుకు కుడివైపు క్రింది భాగంలో శ్రీదేవి, ఎడమవైపున భూదేవి, శ్రీదేవిప్రక్కన కుడి వైపున రుక్మిణీదేవి, భూదేవిప్రక్కన సత్యభామ, పాదాలవద్ద గరుత్మంతుడు చేతులు జోడించి నమస్కరిస్తున్నభంగిమలో స్పష్టంగా కనిపిస్తారు. రెండుపాదాలమధ్యన ఎప్పుడూ నీరు

స్రవించడం ఇక్కడి మహాద్భుతం. మరి ఈ నీరు ఎలా వస్తుందో ఆ మాహాత్మ్యమేమిటో ఎవరికీ తెలీదు. విష్ణుపాదోద్భవిగా గంగ పుట్టిందని ప్రతీతి. పాదాల క్రిందిభాగంలో భక్తులు పాదసేవ చేస్తున్నట్లుగా, ఉభయ పార్శ్వములయందు దేవాలయం, శిఖరం పొన్నవృక్షంమీద ఉన్నట్లు, గోవర్ధనపర్వతం ఎత్తుతూ ఉన్నట్లు, వాటి పైభాగంలో తోరణంవలె మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, కల్కి మూర్తులు, దశావతారాలు అద్భుతంగా మలచబడ్డాయి. పైభాగాన తుంబురుడు, నారదుడు వీణాగానం చేస్తున్నట్లుగా, కిన్నెర, కింపురుషులు స్వామికి పూలమాల వేస్తున్నట్లుగా, ఆదిశేషుడు పడగవిప్పి స్వామిని సేవిస్తున్నట్లుగా అతి చక్కగా, ముద్దుగా, అందంగా మలచబడ్డాయి.



ఇక స్వామి వెనుకవైపున మోహినీరూపంతో స్త్రీరూపం ఎంతో సహజంగా, సుందరంగా కన్నులు చెదిరేవిధంగా ఉంది. వయ్యారంగా చీరకట్టు, రవిక, పవిటచెంగు వెనుకభాగాన వ్రేలాడుతున్నట్లు, చేతులకు దండపట్టీలు, శిఖ చుట్టి పారిజాతపువ్వును అలంకరించుకున్నట్లు ఉన్నాయి. ఈ విగ్రహం కుడికాలు తొడమీద పుట్టుమచ్చ స్పష్టంగా చూపరులను కించిత్ సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తేవిధంగా ఉంది. ఇది పద్మినీజాతిస్త్రీల శుభలక్షణమని శాస్త్రాలు చెప్తున్నాయి. పాదాలకు అందెలు అలంకారయుతంగా ఉన్నాయి. ఏది ఏమైనా ఇందలి శిల్ప చాతుర్యం అద్వితీయం. అతి రమ్యం. సుందరపూరితమైన ఈ శిల్పకౌశలం ఆంధ్రదేశంలోనేకాక భారతదేశచరిత్రలోనే అపూర్వమైందిగా భావించవచ్చు.

ఇకపోతే ఈ ఆలయానికి ఎదురుగా కొద్దిదూరంలో శివాలయం ఉంది. దీనిని ఉమాకమండలేశ్వరస్వామివారి ఆలయం అనికూడా అంటారు. ఈ ఆలయం గర్భగుడి అంతరాలయం, ముఖమండపం, రాజద్వారాలతో చూడచక్కగా ఉంది. ద్వారముఖానికి ఇరువైపులా ద్వారపాలకులు విజయేశ్వరుడు, భృంగీశ్వరుడు ఉన్నారు. అంతరాలయం, కుడివైపున అర్ధనారీశ్వరునిశిల, గణపతిప్రతిమ మనోహరంగా ఉన్నాయి. ఎడమవైపున శంకరాచార్యుడు, కాలభైరవుడు, గణపతి, లక్ష్మీగణపతి విగ్రహాలు ఉన్నాయి. గర్భగుడిలో ఒకమీటరు ఎత్తు ఉన్న శివలింగం ప్రతిష్ఠించబడి ఉంది.

దీనికి పైభాగాన పొక్కులు ఉన్నాయి. ఎందుకంటే చోళరాజులకాలంలో కందకం త్రవ్విస్తుండగా శివలింగం బయట పడిందనీ, తవ్వేటప్పుడు గునపాలు, పారలదెబ్బలు తగలగా పడిన దెబ్బలవల్ల ఈ శివలింగం అలా పొక్కులు కట్టిందని అక్కడి పూజారులు చెప్తారు. ఈ ఆలయానికి సోమసూత్రం లేదు. లింగాన్ని ఎంత అభిషేకించినా అది మునగదు. నీరంతా గర్భాలయంలోనికి ఇంకిపోతుంది. ఇలా సోమసూత్రం లేని ఈశ్వరాలయం భారతదేశంలో మరెక్కడా లేదు. అంతేగాకుండా జగన్మోహినీదేవాలయం ఎదురుగా శివాలయంకూడా భారతదేశంలో మరెక్కడా లేదు. గర్భగుడికి కుడివైపున నవగ్రహాలయం, శనీశ్వరాలయం ఉన్నాయి. వీరికెదురుగా కుమారస్వామి ఆలయం ఉంది.

ఇలా ఈ రెండు దేవాలయాలు చరిత్రలో ఎంతో ప్రసిద్ధికెక్కాయి. ఇక్కడికి వచ్చే భక్తులకు సమస్తమైన కోరికలను అనుగ్రహించే ముక్తిదాయకక్షేత్రంగా ప్రసిద్ధిపొందింది. ర్యాలీ గ్రామంలోని శ్రీజగన్మోహినీకేశవస్వామిని దర్శిద్దాం. ఆ స్వామి అనుగ్రహం పొందుదాం. ఆనందంగా జీవిద్దాం.



# వినా వేంకటేశం...!

(నమూనా ఆలయం)

- శ్రీ మల్లాది హనుమంతరావు

ప్రతిరోజు తెల్లవారకముందే అర్చకస్వాములు వేంకటేశ్వరస్వామికి వినిపించే సుప్రభాతస్తోత్రం సరళసుందరంగా, మధురమంజులంగా, కర్ణపేయంగా ఉంటుందన్నది జగమెరిగిన సత్యం. అటు స్వామివారికీ, ఇటు భక్తులకూ అది వీనులవిందే. ప్రభాతసమయంలో ఈ సుప్రభాతస్తోత్రం శ్రోతలహృదయాలలో ఎంతో ప్రశాంతతనూ, పవిత్రతనూ నింపుతుందని అందరికీ అనుభవైకవేద్యమే. సుప్రభాతస్తోత్రంలో మొత్తం నాలుగుభాగాలు, డెబ్బై శ్లోకాలున్నాయి.

మొదటిభాగం 'కౌసల్యా సుప్రజా రామ...' అనే వాల్మీకి రామాయణశ్లోకంతో ప్రారంభమయ్యే 'సుప్రభాతస్తోత్రం'. దాని తరవాత, 'కమలా కుచ చూచుక కుంకుమతో...' అంటూ ఆరంభమయ్యే 'వేంకటేశ్వరస్తోత్రం'. ఆ తరవాత పదహారు శ్లోకాల్లో శ్రీవేంకటేశ్వర చరణాల శరణు వేడుతూ సాగే 'వేంకటేశ్వరప్రపత్తి'. ప్రపత్తి అంటేనే శరణాగతి. ఆఖరి పద్నాలుగు శ్లోకాలూ శ్రీవేంకటేశ్వరుడికి శుభం పలికే 'మంగళాశాసనం' శ్లోకాలు. ఇందు కొన్ని పద్యసుమాలతో స్వామిని అర్చించి వేడుకుందాం. అవి–

1) వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి
హరే వేంకటేశ ప్రసీద ప్రసీద
ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ

వేంకటేశ్వరుడు తప్ప నాకు మరొక నాథుడు లేడు గాక లేడు. అందుకే ఎప్పుడూ ఆ స్వామిని స్మరిస్తూనే ఉంటాను. ఓ వేంకటేశ్వరస్వామీ! నాపట్ల ప్రసన్నుడవై అనుగ్రహం చూపించు. ఓ వేంకటేశా! నాకు ప్రియాన్నీ, శుభాన్నీ ప్రసాదించు. నువ్వుతప్ప నాకు మరో దిక్కులేదు. నిన్నే నమ్ముకొని ఉన్నాను. నన్ను గట్టెక్కించు.

**తెలుగు అనువాదపద్యమిది:**

తిరుమల వేంకటేశ్వరుడే దిక్కగు నాథుడు నాకు నింక నెవ్వరి శరణమ్ము కోరుకొనువాడను గానహో సంతతమ్ము శ్రీహరి! కమలేశ! కేశవ! దయాజలధీ! నను కావుమయ్య నీ కరుణను చూపి నాకిడుము కామితసిద్ధి యటంచు వేడెదన్!

2) అహం దూరతస్తే పదాంభోజ యుగ్మ
ప్రణామేచ్ఛయా(అ)గత్య సేవాం కరోమి
సకృత్సేవయా నిత్యసేవాఫలం త్వం
ప్రయచ్ఛ ప్రయచ్ఛ ప్రభో వేంకటేశ

"ప్రభో! వేంకటేశ్వరా! నేను ఎంతో దూరప్రాంతం నుంచి నీ పాదపంకజద్వయానికి ప్రణామం చేసుకోవాలన్న ఆశతో వచ్చి సేవచేస్తున్నాను. ఈ ఒక్కసారి చేస్తున్న కొద్దిపాటి సేవవల్లే నీకు నిత్యమూ సేవ చేసినంతఫలాన్ని నువ్వు నాకు ప్రసాదించు స్వామీ! ఇచ్ఛ కలిగినప్పుడో, ఆపద వచ్చినప్పుడో ఉన్నచోటే ఉండి మానసికంగా మాత్రం స్వామిసన్నిధిలో నిలిచి ఆయనమీద చిత్తం నిలిపిన సందర్భాలలోకూడా ఈ ప్రార్థన వర్తిస్తుంది.

**తెలుగు అనువాదపద్యమిది:**

నీ పద పంకజమ్ములను నెమ్మి భజించి తరించుకోర్కెతో శ్రీపతి! నేను నీ నెలవు జేరితి దూరమునెంతొ దాటి నీ కాపద మ్రొక్కు నొక్కపరి అర్పణ చేయుదు స్వీకరింపు మో యీ! పలు నిత్యసేవలుగ నెంచుము దానిని వేంకటేశ్వరా!

3) అజ్ఞానినా మయా దోషాన్
అశేషాన్ విహితాన్ హరే
క్షమస్వ త్వం క్షమస్వ త్వం
శేషశైలశిఖామణే

"స్వామీ! నేను అజ్ఞానంలో ఎన్నో అపరాధాలు చేశాను. అవి తెలియక చేసిన తప్పులుగా క్షమించి కాపాడవయ్యా!" శ్రీహరీ! మూర్ఖుడినైన నావల్ల చెప్పలేనన్ని అపరాధాలు జరిగాయి. ఈ శేషాద్రిశిఖరానికి శిరోభూషణమై నిలిచిన పరమ పురుషా! నువ్వు ఆ అపరాధాలను క్షమించు.

**తెలుగు అనువాదపద్యమిది:**

చేసితినెన్నో నేను మును చేయగ రాని మహాపరాధముల్
దోస మటంచెరింగియును దుష్టుడనై కడు జ్ఞాన శూన్యతన్
చేసిన నాదు పాపములు చెచ్చెర బాపవె శేషశైల సం
వాసా! ననున్ క్షమింపవె భవత్పద సేవకుడన్ క్షమింపవే!!



# దసరా

- శ్రీమతి యస్. రమ్య

హైందవపర్వదినాల్లో విజయదశమి అగ్రగణ్యమైంది. ఆశ్వయుజశుక్లదశమినాటి నక్షత్రోదయవేళకు విజయం అని వ్యవహారం. కనుక ఆ దశమి **'విజయదశమి'**గా రూపొందింది.

విజయాంబ అనే నామాంతరమున్న 'దుర్గ' ఆశ్వయుజ శుద్ధపాడ్యమినుండి నవమివరకు పోరాడి దశమినాడు రాక్షస నిర్మూలనం గావించి, లోకానికి సుఖశాంతుల్ని ప్రసాదించింది. కాబట్టి విజయాంబకు విజయం సిద్ధించిన దశమి "విజయ దశమి"గా గణనకెక్కింది.

విజయదశమినే 'దసరా' అనికూడా అంటారు. దసరా అంటే 'పది' దినాలపర్వమనీ, పదిరకాల పాతకాలను (దశహరా) హరించే పర్వమనీ అర్థం.

నవరాత్రులు అంటే తొమ్మిదిరాత్రులు అని అర్థం. నవరాత్రి పదంలో రాత్రి శబ్దానికి జ్ఞానం అనీ, నవ అంటే నూతనం అనీ అర్థం. కాబట్టి నూతనజ్ఞానాన్ని అనుగ్రహించేది నవరాత్రి అని తెలుస్తోంది. నూతనజ్ఞానోదయం కలుగనిదే మనోమాలిన్యం హరించబడదు. కనుక నవరాత్రమనేది నవ జ్ఞానోదయంకొరకే నిర్దేశించబడిందని చెప్పొచ్చు.

త్రిలోకాలను కల్లోలితం చేసిన మహిషునితో ఆశ్వయుజశుద్ధపాడ్యమినుండి నవమివరకు యుద్ధంచేసి దానవత్వంను సంహరించి దుర్గాదేవి లోకకల్యాణార్థం విజృంభించిన నవరాత్రులు దేవీనవరాత్రులయ్యాయి.

ప్రళయానంతరం అంధకారాన్ని చీలుస్తూ దేవి చల్లని చూపులు వెన్నెలకాంతుల్లా ప్రసరించి ఆమె మందహాసంలో శరచ్చంద్రికలు వెల్లివిరియజేసిన ఈ పర్వదినాలు శరన్నవ రాత్రులుగా పేరొందాయి. దేవి రాత్రిసమయంలోనే రాక్షస సంహారం గావించింది. కనుక దేవీపూజకు రాత్రిసమయమే సముచితమైంది.

## పూజావిధానం

దేవి కన్యాత్వంలో నవాంశాలు ధరించింది కనుక పాడ్యమినుండి నవమివరకు నవదుర్గలను పూజించాలి. అంటే రెండేళ్లబాలికతో మొదలై పదేళ్లబాలికవరకు అనగా కౌమారి- త్రిమూర్తి- కల్యాణి- రోహిణి- కాళిక- చండిక- శాంభవి- దుర్గ- సుభద్ర అనే తొమ్మిదిపేర్లతో దేవిని తలచుకొని కన్నె పిల్లలను నూతనవస్త్రాభరణాదులతో సత్కరించి షోడశోపచారాలతో పూజించాలి. నవరాత్రుల్లో దేవిని త్రికాలాల్లో వేద మంత్రోక్తంగాగాని, గురుముఖంగాగాని నవాక్షరీమంత్రాన్ని పఠించాలి. దేవి త్రికళ. అంటే లక్ష్మి, పార్వతి, సరస్వతికళలను ఆవహించి అవతరించింది. కనుక నవరాత్రుల్లో లక్ష్మీపూజ, మూలానక్షత్రంనుంచి సరస్వతీపూజ విధిగా జరుపుతారు. దుర్గ వీరత్వాన్ని స్ఫురింపచేసే శక్తిస్వరూపిణి కనుక నవరాత్రుల్లో ఆయుధపూజ గావించడంకూడ ఆచారమైంది.

వేదకాలంనుండి శక్తి ఉపాసనకు పేరుగాంచిన మన దేశంలో 'విజయదశమి' ఆదిశక్తి ఆరాధనాపర్వదినంగానే ప్రణుతికెక్కింది. ఆబాలగోపాలం అచంచలభక్తివిశ్వాసాలతో దుర్గాదేవిని ఆరాధించి, స్తుతించి తరిస్తారు.

*2024, అక్టోబరు 12న విజయదశమి సందర్భంగా...*

వ్యక్తిత్వ వికాసం

# మానవజన్మ

- శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్, 98490 13002

భగవంతుణ్ణి చేరుకోవడానికి లభించే అరుదైన, అత్యంత దుర్లభమైన అవకాశం మానవజన్మ పొందడం. మానవజన్మ పొందిన వ్యక్తి ఆ సువర్ణావకాశాన్ని, విషయ భోగాలయందు ఆసక్తితో దుర్వినియోగం చేసుకొని చేతులారా వినాశనాన్ని తెచ్చుకోకూడదు. మనం స్వల్పంగా ప్రమత్తంగా ఉన్నా అనుకున్న లక్ష్యం చేరుకోలేం. అధోగతిపాలయ్యే ప్రమాదం మెండుగా ఉంటుంది.

పూర్వం పురూరవుడనే చక్రవర్తి భూమండలాన్ని పరి పాలించేవాడు. తన సద్గుణసంపన్నతతో ఎనలేని కీర్తిప్రతిష్ఠలు సంపాదించాడు. ఆయన ఒకానొకసమయంలో ఊర్వశి అనే



అప్సరస సౌందర్యానికి సమ్మోహితుడయ్యాడు. దాదాపు మతిని కూడా కోల్పోయినంతగా ఆమెని మోహించాడు. ఆపై వివాహమాడాడు. తర్వాతకూడా తెలియనంతగా ఊర్వశితో కాలం గడచింది. అలా ఉండగా ఒకరోజు ఊర్వశి, పురూ రవుడు తనకు ఏదో నియమభంగం చేశాడనే సాకుతో ఆయనని వదలి ఇంద్రలోకం వెళ్ళిపోయింది. అలా ఊర్వశి తనను వదిలేసి వెళ్ళిపోయిందని పురూరవుడు పిచ్చివాడిలా తిరగ సాగాడు. కొన్నిసంవత్సరాలతర్వాత గంధర్వులు చెప్పిన ఒక యాగాన్ని చేసి, ఊర్వశి ఉన్న లోకాన్ని చేరుకొని, తిరిగి ఊర్వశితో హాయిగా కాలం గడపసాగాడు.

తర్వాత కొంతకాలానికి ఆ భోగలాలసతకు ముఖం మొత్తి, విసుగెత్తింది. సర్వనాశనం అయిన తన జీవితంపట్ల రోత పుట్టింది. 'అయ్యో! సకలశాస్త్రాలు ఔపోసన పట్టి, ధరణికి సార్వభౌముడనైన నేను, కాముకుడినై, స్త్రీవ్యామోహంలో పడి, ఎంతటి నీచస్థితికి దిగజారిపోయాను? నా విలువైన ఆయుర్దా యంలో ఎంతో సమయం వృథా చేసుకున్నాను. నా సకల విద్యలు, సార్వభౌమత్వం ఎందుకూ కొరగాకుండాపోయాయి కదా. నా ఈ దేహం నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులదా? జీవితం పంచుకున్న భాగస్వామినిదా? మిత్రులు, బిడ్డలు, దహించివేసే అగ్ని, నక్కలు, కుక్కలు, క్రిమికీటకాదులు.. వీరిలో ఎవ్వరిది? ఇలాంటి జుగుప్సాకరమైన దేహంపై వ్యామోహం పెంచుకున్నానే. స్త్రీమోహం, స్త్రీసాంగత్యంలో పడి, ఎంతటి నీచమైన రొంపిలోకి దిగజారిపోయానే అని అనుకుని పురూరవుడు అన్ని శారీరకసౌఖ్యాలపై విముఖత పెంచు కున్నాడు. అప్పుడు భగవంతుని చేరుకోవాలనే తీవ్రతపన మొదలయ్యింది. ఆ తపనలో శ్రీహరి పాదపద్మాలను ఆశ్ర యించి, ఆ తర్వాత ముక్తి పొందాడు.

మానవజన్మ అనేది మనకి మరలా ఎప్పటికి వస్తుందో? అసలు వస్తుందో రాదో? ఈ జన్మలోనే మనం నిర్వి రామంగా కృషిచేసి, ఆయనపై భక్తి, విశ్వాసాలతో పరమాత్మని చేరుకునే విశ్వప్రయత్నం చేయాలి. మనం దేహాభిమానం పెంచుకుని వక్రమార్గంలో పయనిస్తే జీవితం అధోగతిపాలై పోతుంది. మరుక్షణం మనది కాదు. తత్క్షణం మేలుకోవాలి. మన జీవనాన్ని సరియైనబాటలో నడిపించాలి. అదే మానవ జన్మకు అర్థం. పరమార్థం.

108 దివ్యదేశాలు

# తిరుమణిక్కూడమ్

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

శ్రీర్కాళినుండి 8కి.మీ.దూరంలో తిరునాంగూర్ నుండి మంగైమడం వెళ్ళేదారిలో ఒకేప్రాకారంతో తూర్పు దిక్కున అర్ధమండపం, మహామండపాల్లో ఈ తిరుమణిక్కూడం అనే దివ్యదేశం అద్భుతమైన ప్రకృతిరామణీయకతతో విలసిల్లు తోంది.

ఈ దివ్యదేశంలో మూలమూర్తి పూర్వాభిముఖంగా పద్మపీఠంపై నిలుచున్నభంగిమలో తిరుమణిక్కూడనాయకునిగా, గజేంద్రవరదుడిగా, వరదరాజునిగా భక్తులచే కొనియాడబడు తూన్నాడు. అట్లే అమ్మవార్లు నిలుచున్న మూర్తిస్వరూపాలుగా అందరిచేత సేవింపబడుతున్నారు. ఆలయతీర్థం చంద్రపుష్కరిణి. విమానం కనకవిమానం, ప్రసన్నవిమానం అనికూడా పిలువ బడుతోంది. మూలమూర్తివలె శ్రీదేవి-భూదేవీ సమేతుడై వరద రాజన్ అను తిరునామంతో ఉత్సవమూర్తులు అలరారుతున్నారు. "తిరుమామహళ్ నాచ్చియార్" అనుపేరుతో అమ్మవారు ఈ క్షేత్రంలో ప్రత్యేకసన్నిధిలో వెలసి ఉన్నారు. ఇక్కడ పాంచ రాత్రాగమోక్తంగా ఆరాధనలు, ఉత్సవాలు జరుపబడుతున్నాయి.

| | | |
|---|---|---|
| భగవంతుడు | : | తిరుమణిక్కూడనాయగన్, వరదరాజన్, గజేంద్రవరదన్ |
| అమ్మవారు | : | తిరుమామహళ్‌నాచ్చియార్, ఇందిరాదేవి, భూదేవి, |
| తీర్థం | : | చంద్రపుష్కరిణి |
| విమానం | : | కనకవిమానం, ప్రసన్నవిమానం |
| ప్రత్యక్షం | : | గరుడుడు, చంద్రుడు |
| మంగళాశాసనం | : | తిరుమంగైఆళ్వార్ |
| ఆగమం | : | పాంచరాత్రమ్ |

కొలిచిన భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్న ఈ స్వామికి కంచి వరదరాజస్వామివలె వరదరాజ అను నామం సార్థకమైందిగా భావిస్తారు. చంద్రునికి కూడా అను గ్రహించిన స్వామి ఈ వరదరాజుడే. తిరుమంగైఆళ్వార్లు ఈ దివ్యదేశాన్ని మంగళాశాసనం చేశారు.

## స్థలపురాణం

తిరుఇందళూర్, తలైచ్చంగనాన్ మదియమ్... మొద లైన దివ్యదేశాలవలె ఈ తిరుమణిక్కూడమ్ దివ్యదేశంలో దేవ దేవుడు చంద్రుణ్ణి అనుగ్రహించారు అన్న అంశమే ఈ దివ్య దేశంయొక్క చరిత్రమౌతుంది. ఈ లోకంలో అందానికీ,







ఆహ్లాదానికీ చంద్రుని ఉదహరిస్తారు. చంద్రదేవుని చూచి మోహించనివారు లేరు. ఆ చంద్రునియొక్క ఆహ్లాదకత్వాన్ని, సౌందరాన్ని, స్వరూపాన్ని చూచి దక్షప్రజాపతితో తనయొక్క 27మందిపుత్రికలు అందరూ వివాహం చేసుకోవాలనే అభిప్రాయంను తండ్రికి తెలియజేశారు. దక్షుడు వారికోర్కెకు అనుగుణంగా 27మందికుమార్తెలను చంద్రునికిచ్చి వివాహం చేశారు. ఆ 27మంది పుత్రికలే అశ్వని, భరణి మొదలైన 27 నక్షత్రాలుగా ఆకాశంలో భాసిల్లుతూన్నారు. ఈ 27మంది కుమార్తెల్లో రోహిణియందు మాత్రమే చంద్రుడు అమితప్రీతిని చూపేవాడు. మిగిలిన 26మందిని అలక్ష్యం చేసేవాడు. ఈ 26 మంది తమ దుఃస్థితిని తండ్రికి విన్నవించుకున్నారు. అందుకు దక్షుడు కోపోద్రిక్తుడై ఏ అందంచేత ఈ 27మందికన్యలను నీవు ఆకర్షించావో ఆ సౌందర్యం నీకు లేకపోవుగాక అని శపించాడు. దక్షుని శాపవశాత్తు చంద్రుడు తనయొక్క సౌందర్యం కోల్పోయి,





కాంతివిహీనుడై రాత్రి ప్రకాశంలేకపోవటంచేత రాత్రి అంధకారమైంది. చంద్రునితో ఆకాశంలో ప్రకాశించే 27 నక్షత్రాలు కూడా కాంతిని కోల్పోయాయి. చంద్రునికి జరిగిన శాపఫలం అతను మాత్రమే అనుభవించక లోకమంతాకూడా అనుభవించ సాగింది.

శాపకారణంచేత తన భార్యలు, దేవలోకం, భూలోకం, సమస్తలోకం కష్టపడటం చూచి తనయొక్క శాపనిర్మూలనకై భూలోకంలో అనేక స్థలాలకు వెళ్ళి పూజలు చేస్తూ చివరిగా ఈ తిరుమణిక్కూడ దివ్యదేశానికి వచ్చి చేరి, అక్కడ ఒక పుష్కరిణిని త్రవ్వి, అచట స్నానంగావించి ఈ దివ్యక్షేత్ర భగవంతుడైన వరదరాజస్వామిని కన్నీటితో ప్రార్థించాడు. వరదరాజస్వామి చంద్రునియొక్క ప్రార్థనను మన్నించి అతనికి సాక్షాత్కరించి శాపవిమోచనం కావించాడు. కాని దక్షునియొక్క శాపానికి గౌరవమిచ్చి, ప్రజాపతియొక్క శాపం వమ్ము గానివ్వక నెలలో 15రోజులు ప్రకాశవంతంగా, 15రోజులు కాంతిహీనంగా ఉండేట్లు గావించగా శుక్లపక్ష, కృష్ణపక్షాలు ఏర్పడ్డాయి. ఇలా చంద్రదేవుణ్ణి అనుగ్రహించిన ఈ వరదరాజస్వామిని ఎవరైతే దర్శిస్తారో వారికి సకలవిధాలైన మంగళములు ఎల్లప్పుడూ సిద్ధిస్తాయి. కావున భక్తులెల్లరూ ఈ తిరుమణిక్కూడం దివ్యదేశానికి విచ్చేసి వరదరాజస్వామిని కొలిచి ఇహపరసౌఖ్యాలను పొందుతారు.

## వైకుంఠపాళి

### :: 105 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 వ | కు | ళ | 2 మా | లి | | 3 దు | | 4 ఆ |
| రా | | | లి | | | ర్గ | | కా |
| హ | | | | 5 ల | త | | | శ |
| 6 స్వా | యం | 7 భు | వు | | | 8 ద | స | రా |
| మి | | మ | | | 9 నృ | | | జు |
| | | న్యు | | 10 భృ | గు | వు | | |
| 11 పు | ష్య | డు | | | డు | | | 12 శే |
| లో | | | 13 కా | | | | | షా |
| 14 మ | హి | షా | సు | రు | డు | | 15 అ | ద్రి |

# సప్తర్షుల కవితల్లో సప్తగిరీశుడు

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

సప్తర్షులు ఏడుగురు. వాళ్లే కశ్యపుడు, అత్రిమహర్షి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, జమదగ్ని, వశిష్ఠమహర్షి. ఈ ఏడుమంది మహర్షులు ఒకటీ, రెండూ కాదు. కొన్నివేలయుగాలు తపస్సులు చేశారు. ఆ తపోబలంతో నక్షత్రమండలంలో నక్షత్రాలుగా ఇప్పటికీ ప్రకాశిస్తూనే ఉన్నారు. ఆకాశంలో రాత్రిపూట, ఉత్తరదిక్కున ఈ సప్తర్షిమండలాన్ని కన్నులారా దర్శించవచ్చు.

ఈ ఏడుగురు మహర్షులు ఒకజట్టు. ఎక్కడికి వెళ్లినా అందరూ కలిసే వెళ్తారు. తీర్థయాత్రలకైనా సరే! లేదా ఏ లోకాలకైనా సరే! కలిసికట్టుగా వెళ్తుంటారు. వింతలు, విశేషాలు చూస్తూ పరస్పరం చెప్పకొంటూ, చర్చించుకొంటూ ఆనందిస్తుంటారు. వారి సంచారంలో, వారి యాత్రల్లో, వారిచర్చల్లో లోకకల్యాణకారకాలైనవి ఎన్నో ఉంటాయి.

నక్షత్రమండలంలో ముక్కుమూసుకొని తపస్సుల్లో మునిగి ఉన్న వీళ్లకు, కాలచక్రం ఎంత తిరిగిందో తెలియదు. ఏ యుగం గడుస్తున్నదో కూడా వారికి తెలియదంటే ఆశ్చర్యం లేదు. కొన్నివేలఏండ్లతర్వాత తపస్సులనుంచి తేరుకొన్న ఈ సప్తర్షులు, కొన్నిరోజులు అలా తిరిగొద్దాం అనుకొన్నారు. ఎక్కడో ఎందుకు? ముందు వైకుంఠానికి వెళ్దాం. ఆ తర్వాత కైలాసం వెళ్లాలి అనుకొన్నారు. అనుకొన్నదే తడవు అందరూ సరే అంటే సరే అని కూడబలుక్కున్నారు. ఇంకేం తపోబలం ఉన్నవారు కదా! ఋషులందరూ నక్షత్రలోకంనుండి నేరుగా శ్రీవైకుంఠంలోని బంగారు వాకిళ్లముందర వాలారు.

లోపలికి వెళ్దాం అనుకొన్నంతలో వారికి ఒకదృశ్యం కంటబడింది. అందరూ ఆశ్చర్యపడ్డారు. అదేమంటే....

ద్వారపాలకులైన జయవిజయులు తమ గదల్ని వైకుంఠద్వారంవద్ద ఇరుప్రక్కలా గడపకు ఆనించి, వాకిలిముందర కూర్చొని తీరిగ్గా గవ్వలాట ఆడుకొంటున్నారు. వాళ్లు పరిసరాల్నే మరచిపోయి ఆటలో నిమగ్నమయ్యారు.

అదీ! ఆ ఋషుల ఆశ్చర్యానికి కారణం.


ఏమైతే ఏం? ఆ ఋషుల్లో ఒకరు దగ్గారు. ఒకరు తుమ్మారు. ఒకరేమో గోవిందా! అన్నారు. మరొకరు నారాయణా! అన్నారు. ఇంకొకరు వైకుంఠవాసా! లక్ష్మీపతీ! ఇలా అందరూ ఎవరికిష్టమైనరీతుల్లో వారు గట్టిగానే అన్నారు.

ఈ శబ్దాలన్నీ చెవుల్లోపడ్డ జయవిజయులు తిన్నగా తలలు పైకెత్తి ఋషులను చూశారు.

మీరంతా ఎవరు స్వామీ? కొన్నివేలఏండ్లుగా మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదే! చూచినట్లుకూడ గుర్తుకు రావడం లేదే! సరే! మీరు ఎవరైతే మాకేంగాని, లోపల మా స్వామి లేడు. కొన్నివేల ఏండ్లైంది. ఏ లోకానికి వెళ్లాడో? మాకైతే తెలియదు, నిజమే చెబుతున్నాం. తొందరపడి శాపనార్థం పెట్టకండి. ఐనా మీరు సర్వజ్ఞులు కదా! మీకు చెప్పేదేముంది అన్నారు.

తెల్లబోయిన ఋషులందరూ అక్కడనుంచి కదిలి కైలాసం వెళ్లారు. కైలాసంలో పరిస్థితి వైకుంఠంకంటే అయోమయంగా ఉంది. నిశ్శబ్దంగా ఉంది. చుట్టూరా పరికించి చూశారు. ఇంతలో ఇద్దరు శివకింకరులు పరిగెత్తుకొంటూ వచ్చారు. నల్లగానే కాక కొంచెం వింతగానే ఉన్నారు. ఒళ్లంతా బూడిద పూసుకున్నారు. ఇంచుమించు దిగంబరంగా ఉన్నారు.

ఎవరు మీరు? ఋషుల్లాగే ఉన్నారే! మా సాంబశివయ్య వెళ్లి కొన్ని యుగాలైంది. యాడికి పోయుండారో మాకైతే తెలవదు. శివయ్యతోపాటు బసవణ్ణ, గణపయ్య, కుమారయ్య అందరూ పోయిండ్రు. అన్నీ తెలిసినోళ్ల లాగే ఉన్నారే! మీ బుద్ధితో కనుక్కొని అక్కడికే ఎళ్లండి మరి - అని అన్నారు.



ముక్కున వేలేసుకొన్న మునులందరూ, ఇంతకూ హరి హరులిద్దరూ ఎక్కడికెళ్లినట్లు? ఆ బ్రహ్మకైనా తెలుసేమో! చూద్దా మనుకొంటూ అందరూ కట్టకట్టుకొని సత్యలోకంలో వాలారు.

ఇక్కడ మరీ విచిత్రం! అటు వైకుంఠంలోను, ఇటు కైలాసం లోను ఒకరిద్దరైనా కనపడ్డారు. మరి బ్రహ్మగారి సత్యలోకంలో, ఒక్కరంటే ఒక్కరైనా కన్పడితేగా, మాట్లాడటానికి. చుట్టూ పరికించి చూశారు. ఆ స్థలం ఆహ్లాదంగా ఉన్నా నిశ్శబ్దగంభీరంగా ఉంది. ఆ వాతావరణాన్ని ఎంతమాత్రం భరించలేక ఉసూరుమంటూ బయట పడ్డారు సప్తఋషులు.

ఇంతలో వారికి ఎదురుపడ్డాడు నారదమహర్షి. సప్తర్షులు, దేవర్షి నారదుడు పరస్పరం అభివాదం చేసుకున్నారు.

ఋషివరేణ్యులారా! వేలఏండ్లతర్వాత తమరి అందరి దర్శన భాగ్యం ఒక్కచోటే కలిగింది. ఐనా, మీరందరూ ఇక్కడ కనబడటంలో విశేషమేంటో! - అన్నట్లుగా ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు ఆత్రం పట్టలేక దేవర్షి.

అయ్యా నారదమునీ! నిజమే! మా నక్షత్రలోకంలో మేం తపోనిమగ్నులమై ఎన్నోవేలఏండ్లు అయ్యింది. త్రిమూర్తుల్ని దర్శిద్దా మని మూడులోకాలకీ వెళ్లాం... కానీ! అని సప్తర్షులు అంటుండగానే నారదుడు బిగ్గరగా నవ్వుతూ..

"మీకు త్రిమూర్తులదర్శనం అయ్యుండదు. ఎలా అవు తుంది. వాళ్లు అక్కడ ఉంటేగా? వాళ్లే కాదు. మీరు ఏ లోకాలకి వెళ్లినా, అన్ని లోకాల్లోను ఎవరూ ఉండరు గాక ఉండరు. ఎందు కని అంటారేమో! దానికి కారణం చెబుతాను. సావధానంగా వినండి.

భూలోకంలో భరతఖండానికి దక్షిణభాగంలో 'వేంకటా చలం' అనే పరమాద్భుతపర్వతం ఉంది. ముల్లోకాల్లోనూ దాని మహిమలు అనంతం, అప్రమేయం. అక్కడ ఆ దివ్యశిఖరాలపైన శ్రీవైకుంఠపతి శ్రీమన్నారాయణుడు "వేంకటపతి"గా వేంచేసి ఉన్న విషయం మీకందరికీ తెలిసినసంగతే! ఆ భక్తవత్సలుడికి బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా, ఘనంగా బ్రహ్మోత్సవాల పేరిట పదినాళ్లపాటు వేడుకలు జరుగుతున్నై. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవసంబరాలను చూడటానికి, పాల్గొనడానికి సకల లోకాలవాండ్లు భూలోకవైకుంఠానికి వెళ్లారు. ఇంకా వెళ్తూనే ఉన్నారు. అందులోను సాంబశివుడేమో వేంకటాచలక్షేత్రపాలకుడు! ఇక బ్రహ్మదేవుడేమో ఆ ఉత్సవాల నిర్వాహకుడు. అందువల్లే సమస్తలోకాలు ఖాళీగా ఉన్నాయి, ఉంటాయి కూడ.

ఐనా, మీ పరిసరాల్లో ఏం జరుగుతోందో ఏమాత్రం తెలుసుకోకుండా, ముక్కు మూసుకొని మీ లోకంలో మీరుంటే ఎలా?

అది సరే. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవా లకు రమ్మని ఈ వేళకే మీకూ ఆహ్వానం అంది ఉండాలే!

సరేలే! మనం మళ్లీ త్వరలో సప్తగిరిశిఖరాల్లో బ్రహ్మ తిరునాళ్ల సంబరాల్లో కలుసుకుందాం. నారాయణ! నారాయణ!! అంటూ అదృశ్యమయ్యాడు నారదమహర్షి.

అలాగా! అనుకొంటూ నాలుగడుగులు వేశారో లేదో సప్తర్షుల ఎదుట గరుడభగవానుడు ప్రత్యక్షమయ్యాడు, తిరుమ లేశుని బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రంతో!

"మహర్షులారా! మీకోసం నక్షత్రమండలంలో వెతికాను. ఆ తర్వాత ముల్లోకాలూ తిరిగాను. ఇక్కడ మీ దర్శనభాగ్యం కలి గింది. ధన్యుణ్ణి. బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలకు ఇదే మా ఆహ్వానం! అందరూ విచ్చేయండి"-అంటూ ఎంత వేగంగా వచ్చాడో, అంత వడిగా రివ్వున ఎగిరిపోయాడు గరుత్మంతుడు.

పక్షిరాజుపలికిన స్వాగతానికి సంబరపడ్డారు సప్తర్షులు. ఇక ఎందుకు ఆలస్యం? వేంకటాచలం వెళితే, బ్రహ్మోత్సవాల వైభవాన్ని తిలకించవచ్చు. ముక్కోటిదేవతలందర్నీ, వాళ్ల మొక్కు లందుకుంటున్న ఆపదమొక్కులవాణ్ణి దర్శించవచ్చు అనుకొంటూ భూలోకవైకుంఠానికి ప్రయాణం కట్టారు. వాళ్లకి ఏ వాహనాలూ అక్కర్లేదుగా! వారి సంకల్పమే 'సప్తగిరుల' దరికి చేర్చింది.

## సప్తగిరుల శోభ!

అంతరిక్షంనుండే ఏడుకొండల అద్భుతతేజస్సును వీక్షిస్తూ చేతులెత్తి మొక్కారు. ఆ కొండలమధ్యలో వింతవింతకాంతులతో మహాద్భుతంగా మిరుమిట్లుగొలుపుతున్న 'బంగారుమేడ' ఆనంద నిలయ విమానశిఖరాన్ని ఆశ్చర్యంగా, ఆనందంగా కన్నులారా చూస్తూ, ఇన్నాళ్లకు, కాదు కాదు, ఇన్నివేలఏండ్లకు ఈ అవకాశం కలగడం తమ అదృష్టంగా భావించారు ఆ మునులందరూ. ఏడు కొండలలో ఎటు చూసినా, ఏవైపు పరికించినా సందడే! సంబరమే. కొండలంతటా కోలాహలమే! ఏమి ఈ క్షేత్రవైభవం. ఏ కొద్దిమంది మాత్రమే వెళ్లగలిగే, ఎప్పుడూ నిశ్శబ్దగంభీరంగా, నిరామయంగా ఉండే శ్రీవైకుంఠలోకం ఎక్కడ? దేవ దానవ మానవ యక్ష కిన్నర గంధర్వాది సర్వలోకాలవాండ్లకు వారూ, వీరూ అనకుండా భక్తుల ఆనందసందోహంతో, నిత్యమూ సందడిగా ఉండే భూలోక వైకుంఠం వేంకటాచలవైభవం ఎక్కడ! అహో! అదిగో! బ్రహ్మ చారులు, యతీశ్వరులు, యోగులు, మంత్రవేత్తలు, అవధూతలు, సన్యాసులు, గృహస్థులు, వానప్రస్థులు, బాలబాలికలు, కన్యలు, పుణ్యాంగనలు, పూర్వసువాసినులు, బధిరులు, అధికారులు, పండితులు, పామరులు, చక్రవర్తులు, రాజ్యాధికారులు.... ఇలా ఒక్కరా! ఇద్దరా! లక్షలాదిమంది భక్తవరేణ్యుల గోవిందనామ ఘోష లతో, భజనలతో, నృత్యాలతో, ఆటపాటలతో, సంగీతనీరా

జనాలతో, ఉపాసనలతో, దీపారాధనలతో, వింతవింతశోభలతో ప్రకాశిస్తున్న సప్తగిరుల సౌందర్యం ఏమని చెప్పేది? ఎంతని వర్ణించేది? ఇలా సప్తర్షులు అనుభవిస్తూ, ఎవరికివారు తమలో తాము శ్రీవేంకటపర్వతశోభను, వైభవాన్ని పరిపరివిధాలుగా ఆనందంతో అనుభూతులను పొందారు.

## బ్రహ్మోత్సవాల వైభవం!

శ్లో॥ శ్రీవేంకటేశ మతి సుందర మోహనాంగం
శ్రీభూమికాంత మరవింద దళాయతాక్షమ్
ప్రాణప్రియం ప్రవిమల సత్కరుణాంబురాశిం
బ్రహ్మేశవంద్య మమృతం వరదం భజామి

అంటూ మునులు ప్రార్థిస్తూ, సాక్షాత్తు సాంబశివుని క్షేత్ర పాలకపర్యవేక్షణలో, చతుర్ముఖ బ్రహ్మదేవుని ఆధ్వర్యంలో సకల లోకవాసుల సమక్షంలో జరుగుతున్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవ తిరునాళ్లను మొదటినుంచి చివరివరకు కన్నులారా వీక్షిస్తూ, కొండలరాయని కమ్మనైన దివ్యప్రసాదాలను ఆస్వాదిస్తూ సంతృప్తిని పొందారు.

శ్రీనివాసభగవానుని బ్రహ్మోత్సవాలను ధ్వజారోహణం మొదలుకొని, ప్రతిరోజు ఉదయం, రాత్రి వరుసగా జరిగే పెద్దశేష, చిన్నశేష, హంస, సింహ, ముత్యపుపందిరి, కల్పవృక్షం, సర్వ భూపాల, మోహినీఅవతారం, గరుడ, హనుమ, గజ, సూర్యప్రభ, చంద్రప్రభ, స్వర్ణరథోత్సవాల్లో చివరగా అశ్వవాహనం... ఇలా కన్నులారా దర్శించారు సప్తర్షులు. ఆ మరునాడు ఉదయం శ్రీస్వామి పుష్కరిణిలో జరిగే "చక్రస్నానం"లో కూడ పాల్గొన్నారు.

స్వామిపుష్కరణీస్నానం వేంకటేశ్వరదర్శనం
మహాప్రసాదస్వీకారత్రయం త్రైలోక్య దుర్లభమ్

శ్రీస్వామిపుష్కరిణీ పుణ్యజలాలు దివ్యమైన ఔషధాలు! ఇక వేంకటేశ్వరుడేమో మృత్యు, రోగాదులను పోగొట్టే అద్భుతవైద్యుడు! శ్రీస్వామిపుష్కరిణీస్నానం, శ్రీవేంకటభగవానునిదర్శనం, శ్రీస్వామి వారిప్రసాదం స్వీకరించడం అనే ఈ మూడుకార్యాలు పరమాద్భుత మైనవి. ఇవి ముల్లోకాల్లో ఎవరికీ ఒనగూడవు. అదృష్టంకొద్దీ మనకు సిద్ధించాయి అంటూ సప్తర్షులు, శ్రీస్వామిపుష్కరిణీతీర్థంలో శ్రీసుదర్శన చక్రభగవానునితోపాటు మునకలిడినారు.

తదుపరి ఆనందనిలయ గర్భాలయంలో ఘనవేంకటేశుని దివ్యమంగళమూర్తిని నిలువెల్ల కన్నులు చేసికొని కన్నులార్పకుండా దర్శనం చేసికొన్నారు.

బ్రహ్మోత్సవాలు ఘనంగా మంగళప్రదంగా పూర్తైన తర్వాత శ్రీవారి మహామణిమండపంలో ఆస్థానం జరిగింది. ఉత్సవాలకు వచ్చిన భక్తులందరినీ అనుగ్రహించి వరాలను ఇచ్చాడు వేంకటపతి. ఆ సందర్భంలో సాంబసదాశివుడు, బ్రహ్మదేవుడు సప్తర్షులను ఒక మాట అడిగారు. అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ సంరంభాన్ని దర్శించారు కదా! శ్రీకల్యాణవేంకటేశ్వరుని దర్శనం మీకందరికీ ఏ ఏ అనుభూతులను కలిగించింది? శ్రీనివాసభగవానుడు ఒక్కడే ఐనా, ఒక్కొక్కరికి ఒక్కొక్కరకంగా దర్శనమిస్తాడు. దివ్యానుభూతులను అనుగ్రహిస్తాడు. ఎవరి దర్శనం వారిదే! ఎవరి అనుభూతి వారిదే! ఇది శ్రీవేంకటేశ్వరుని భక్తులందరి అనుభవంలో ఉన్నదే. అందువల్ల ఓ సప్తర్షులారా! స్వామివారి దర్శనంలో మీ అనుభవాలను, అనుభూతుల్ని ఒక్కొక్కరు ఒక్కొక్క శ్లోకంలో మాత్రమే చెప్పాలి. ఐతే, అందరూ ఒక నియమం తప్పక పాటించాలి. అదేమంటే తమ తమ పేర్లలోని తొలి అక్షరంతో మాత్రమే శ్లోకాన్ని చెప్పాలి. చాల సంక్షిప్తంగాను ఉండాలి అని బ్రహ్మదేవుడు చెప్పి కూర్చొన్నాడు.

ఆనందనిలయుని ఆనాటికొలువులో ముక్కోటిదేవతలు ఉన్నారు. అంతేకాదు. దేవ, దానవ, యక్ష, కిన్నర, కింపురుష, మానవులు ఇలా ఎందరెందరో చెవులు రిక్కించి ఆత్రంగా ఆ ఋషులు ఏం చెబుతారో, అని నిక్కి నిక్కి చూస్తున్నారు.

## సప్తర్షుల కవితాగానం

సప్తర్షులు లేచి నిలబడ్డారు. సప్తగిరీశునికి సాష్టాంగ దండ ప్రణామాలను సమర్పించారు. శ్రీనివాసభగవానుడు లక్ష్మీసమేతంగా చిన్మయహాసం చేస్తూ, ప్రారంభించుమని తలపంకించాడు.

తొలిగా కశ్యపమహర్షి ఇలా పలికారు :

శ్లో॥ కాది హ్రీమంతవిద్యాయాః, ప్రాప్త్యైవ పరదేవతా
కలౌ శ్రీవేంకటేశాఖ్యా, తామహం శరణం భజే.

'క' తో మొదలై 'హ్రీం'తో ముగిసే 16 అక్షరాల రహస్యమైన మంత్రానికి ప్రధాన పరదేవత, ప్రస్తుతం ఈ కలియుగంలో "శ్రీవేంకటేశ్వరుని"గా దర్శనమిస్తున్నది. ఆ పరదేవతను ఇప్పటి శ్రీవేంకటేశ్వరుడిగా దర్శనభాగ్యం పొందిన కశ్యపుడను నేను శరణం పొందుతున్నాను.

పిదప అత్రిమహర్షి చేతులెత్తి నమస్కరిస్తూ ఇలా చెప్పారు.

శ్లో॥ అకారాది క్ష కారాంత, వర్ణై యః ప్రతిపాద్యతే
కలౌ స వేంకటేశాఖ్యః, శరణం మే రమాపతిః

అ కారం మొదలుగా క్ష కారాంతంవరకు ఉన్న అన్ని అక్షరాల్లో ప్రతిపాదింపబడిన రమాపతి ఈ కలియుగంలో శ్రీవేంకటేశ్వరునిగా



దర్శనమిస్తున్నాడు. నేను అత్రిమహర్షిని ఆ స్వామివారిని శరణం అంటున్నాను.

ఇంతలో భరద్వాజుని వంతు వచ్చింది. లేచి నిలబడి ఇలా కీర్తించారు.

శ్లో॥ భగవాన్ భార్గవీకాంతో భక్తాభీప్సితదాయకః
భక్తస్య వేంకటేశాఖ్యో భరద్వాజస్య మే గతిః

భార్గవి అనగా లక్ష్మి. సాక్షాత్తు భార్గవీకాంతుడు శ్రీనివాసుడు. భక్తుల కోరికలన్నింటిని తీరుస్తున్నాడు. అలాంటి వేంకటేశ్వరుణ్ణి భరద్వాజుడను నేను శరణాగతి వేడుతున్నాను. నాకు ఆయన తప్ప వేరే గతి లేదు.

తదుపరి విశ్వామిత్రుడు వేంకటేశ్వరుణ్ణి కన్నులారా దర్శిస్తూ, ఇలా అన్నారు.

శ్లో॥ విరాట్ విష్ణుః విధాతా చ విశ్వం విజ్ఞానవిగ్రహః
విశ్వామిత్రస్య శరణం వేంకటేశవిభుస్సదా

విరాట్‌పురుషుడైన శ్రీమహావిష్ణువే ఇప్పటి ఈ శ్రీవేంకటేశ్వరుడు. ఆయనే విధాత. విజ్ఞానవిగ్రహుడైన ఆ శ్రీనివాసుని స్వరూపమే ఈ విశ్వమంతా కూడ. అలాంటి జగత్ప్రభువును, శ్రీవేంకటేశ్వరుణ్ణి ఈ విశ్వామిత్రమహర్షి శరణం అంటున్నాడు.

ఆ తర్వాత గౌతమమహర్షి వంతు వచ్చింది.

శ్లో॥ గౌః గౌరీశప్రియో నిత్యం, గోవిందో గోపతిర్విభుః
శరణం గౌతమస్యాస్తు వేంకటాద్రిశిరోమణిః

గౌరీప్రియుడు పరమేశ్వరుడు. ఆయనకు అత్యంత ప్రియుడు ఈ గోవిందుడు. గోవులకు పాలకుడు. గోపికలకు పతి. సమస్తజీవులకు విభుడు! ఇన్నివిధాలుగా భాసిస్తూ ప్రస్తుతం వేంకటాద్రిశిరోమణిగా దర్శనమిస్తున్న శ్రీనివాసభగవానుణ్ణి, ఇదిగో! ఈ గౌతముడు శరణం వేడుతున్నాడు.

ఆ తర్వాతివంతు జమదగ్నికి రాగా ఇలా స్తుతించారు.

శ్లో॥ జగత్కర్తా జగద్భర్తా జగద్ధర్తా జగన్మయః
జమదగ్నేః ప్రపన్నస్య జీవేశో వేంకటేశ్వరః

సమస్తజగాలను నడిపిస్తున్న కర్త! భరిస్తున్న భారకుడు! ధరిస్తున్నవాడుకూడా ఆ స్వామే. ఇన్నిరకాలుగా భాసిస్తూ విశ్వవ్యాపకుడైన జగన్మయుడు, సకలజీవేశుడు ఐన వేంకటేశ్వరుణ్ణి శరణం అంటున్నాడు ఈ జమదగ్ని.

చివరగా వశిష్ఠమహర్షి ఇలా పలికారు.

శ్లో॥ వస్తువిజ్ఞానమాత్రం యన్నిర్విశేషం శుభం చ సత్
తత్ బ్రహ్మైవాహ మన్వీతి వేంకటేశం భజే సదా॥

ఆశ్రితులైన భక్తులకు సంపూర్ణంగా సర్వశుభాలను అనుగ్రహిస్తూ సాక్షాత్తు పరబ్రహ్మతత్త్వంగా ప్రకాశిస్తున్న శ్రీవేంకటేశ్వర భగవానుణ్ణి ఈ వశిష్ఠమహర్షి నిత్యమూ భజిస్తున్నాడు. ఈ శ్లోకాల శ్రవణంతో సభలోని బ్రహ్మాదిదేవతలందరూ చప్పట్లు చరిచారు. చాలా మెచ్చుకొన్నారు.

వెంటనే శ్రీవేంకటభగవానుడు మందస్మితవదనారవిందంతో భక్తులందరినీ చూస్తూ, సప్తర్షులతో ఇలా అన్నాడు. మహర్షులారా! మీరు చేసిన ఈ స్తోత్రాలు చాల మహిమాన్వితాలు. వీటిని ఎవరు పఠించినా, పారాయణం చేసినా సకలభయాలు పోతాయి. దోషాలు నశిస్తాయి. అంతమాత్రమే కాదు. సర్వశ్రేయస్సులు, సర్వశుభాలు కలుగుతాయి. సర్వసంపదలతో వర్ధిల్లుతారు అంటూ రత్నశాలువలతో సప్తర్షులను సత్కరిస్తూ దివ్యాశీస్సులతో అనుగ్రహించాడు.

ఇలా సప్తర్షులు సప్తగిరీశునిమీద చెప్పిన స్తోత్రాలు శ్రీవేంకటేశ్వరునికి ప్రీతికారకాలయ్యాయి. అంతేకాదు భక్తులకు కలిసంతారకములై వరలినాయి.

ఈ సప్తర్షులు ఆశువుగా చెప్పిన స్తోత్రాలను విన్నా, పఠించినా భయం పోతుంది. సర్వదా విజయం సిద్ధిస్తుంది అని బ్రహ్మాదిదేవతలు ఇలా అన్నారు.

శ్లో॥ సప్తర్షిరచితం స్తోత్రం సర్వదా యః పఠేన్నరః
సోఽభయం ప్రాప్నుయాత్ సత్యం సర్వత్ర విజయీ భవేత్.

ఇలాగ సప్తర్షులు తమయాత్రను భూలోకవైకుంఠంలో సిద్ధిప్రదం చేసుకొని ఆ వైకుంఠదివ్యధామంలో తామనుభవించిన, అనుభూతిచెందిన ఆధ్యాత్మికరసానందాన్ని నెమరువేసుకొంటూ, నక్షత్రమండలం చేరుకొన్నారు. ఇలా సప్తర్షులు చేసిన సప్తగిరీశునిస్తోత్రాలు నాటినుంచి నేటికీ అటు వేంకటభగవానునికీ, ఇటు వేంకటేశుని భక్తులకు ప్రీతికారకములై వరలుతున్నాయి.

శ్లో॥ నమః శ్రీవేంకటేశాయ। శుద్ధజ్ఞానస్వరూపిణే
వాసుదేవాయ శాంతాయ । శ్రీనివాసాయ మంగళమ్.

గృహలక్ష్మి

# దీపావళి

- శ్రీ ఐనవోలు మోహనాచార్యులు,
80741 31537

భారతీయసంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి మన పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్యదీప్తుల దీపావళి. జగతిని జాగృతంచేసే చైతన్యదీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుణ్ణి సంహరించిన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెప్తున్నాయి. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీపమాలికలశోభతో వెలుగొందే గృహాంగణాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతనవస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమ ఘుమలు, బాణసంచాచప్పుళ్ళు ఈ దివ్యదీపావళి సోయగాలు. ఈ పండుగ ప్రతిఏటా ఆశ్వయుజ అమావాస్యరోజున వస్తుంది.

## నరకచతుర్దశి

దీపాలపండుగకు ముందురోజు వచ్చేది ఆశ్వయుజ బహుళ చతుర్దశి. దీన్ని నరకచతుర్దశిగా జరుపుకుంటారు. నరకాసురుడనే రాక్షసుడు చెలరేగి సాధుజనాలను పీడిస్తూ దేవ, మానవలోకాల్లో సంక్షోభాన్ని కలిగిస్తున్నాడు. కృతయుగంలో హిరణ్యాక్షుని వధించిన వరాహస్వామికి, భూదేవికి అసురసంధ్యా సమయంలో జన్మించాడు నరకుడు. అతడు లోకకంటకుడైనా మహావిష్ణువు వధించకూడదని, తల్లియైన తనచేతిలోనే మరణించేలా వరం పొందింది భూదేవి. మహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణభగవానుడిగా అవతరించినప్పుడు భూదేవి సత్యభామగా జన్మించింది. అప్పటికి నరకాసురుడు లోకకంటకుడై చేస్తున్న అధర్మకృత్యాలను అరికట్టడానికి సత్యభామాసమేతంగా తరలివెళ్లాడు శ్రీకృష్ణుడు. వారిమధ్య జరిగిన భీకరసంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ శరాఘాతాలకు మరణించాడు నరకుడు. తన పుత్రునిపేరైనా కలకాలం నిలిచిఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరకచతుర్దశిగా పిలువబడుతుందని వరం ప్రసాదించాడు శ్రీకృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు, పదహారువేలమంది రాజకన్యలు విడిపించబడ్డారు. ధర్మం సుప్రతిష్ఠితమైంది.



2024, అక్టోబరు 31న
దీపావళి పండుగ సందర్భంగా...

నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటిరోజు ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబరాలు జరుపుకునేరోజు అమావాస్య కావడంతో, చీకటిని పారద్రోలుతూ ప్రజలు దీపాలతో తోరణాలు వెలిగించి, బాణసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది.


అజ్ఞానులు, మూర్ఖులే గొంతుచించుకొని మాట్లాడుతారు. జ్ఞానులు మౌనంగానే ఉంటారు

## దీపావళి

**దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం సర్వతమోపహం।**
**దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమోఽస్తుతే॥**

దీపజ్యోతిని పరబ్రహ్మస్వరూపంగా; మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణసంపత్తికి నిదర్శనంగా భావిస్తారు. మహిళామణులంతా ఆశ్వీయుజ బహుళచతుర్దశినుండి కార్తికమాసమంతా సంధ్యాసమయంలో మట్టిప్రమిదలలో దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయిదువులు కార్తికపౌర్ణమికి సముద్రస్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. పైగా ఈ దీపావళి శరదృతువులో రావటం విశేషం. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది.

దీపాల పండుగ దీపావళిరోజున మహాలక్ష్మీపూజను జరుపుకోవడానికి ఓ విశిష్టత ఉంది. పూర్వం దుర్వాసమహర్షి ఒకమారు దేవేంద్రుని ఆతిథ్యానికి సంతసించి, ఒక మహిమాన్వితమైనహారాన్ని ప్రసాదించాడు. ఇంద్రుడు దానిని తిరస్కార భావంతో తన వద్దనున్న ఐరావతం అనే ఏనుగుమెడలో వేశాడు. అది ఆ హారాన్ని క్రింద పడేసి కాలితో తొక్కేసింది. అది చూచిన దుర్వాసుడు ఆగ్రహం చెంది దేవేంద్రుణ్ణి శపించాడు. తత్ఫలితంగా దేవేంద్రుడు రాజ్యం కోల్పోయి, సర్వసంపదలు పోగొట్టుకుని దిక్కుతోచక శ్రీహరిని ప్రార్థించాడు. ఈ పరిస్థితిని గమనించిన శ్రీ మహావిష్ణువు దేవేంద్రుణ్ణి ఒక జ్యోతిని వెలిగించి దానిని శ్రీ మహాలక్ష్మీస్వరూపంగా పూజించుమని సూచించాడు. దానికి తృప్తిచెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో తిరిగి త్రిలోకాధిపత్యాన్ని, సర్వసంపదలను పొందాడని పురాణాలు చెప్తున్నాయి.



అంధతమస్సు అనేది ఒక నరకం. దక్షిణాయన పాప కాలంనుండి తప్పించుకొని తరించడానికి ఉత్తరాయణ పుణ్య కాలంలో జ్యోతిని దానం చేయటం ఉత్తమోత్తమమైన కార్యంగా భావిస్తారు హైందవులు. ఆశ్వయుజమాసంలో వచ్చే బహుళ చతుర్దశి, అమావాస్యలు పరమపవిత్ర పర్వదినాలు. భక్తి విశ్వాసాలతో, ఆనందోత్సాహాలతో దేశమంతటా పిల్లలూ, పెద్దలూ అందరూ కలసి జరుపుకునే పండుగ రోజులివి.

### దీపావళిరోజున ఏ యే పూజలను చేయాలి?

ఈ దీపావళిపండుగరోజున ప్రతీఇంట మహాలక్ష్మి పూజను చేసుకోవాలి. కూర్చున్నట్లున్నమూర్తి లక్ష్మీదేవికి ఎర్రటి పద్మాలతో లేదా తెల్లకలువలతో పూజను చేయాలి. అమ్మవారి అలంకరణకు ఎర్రటిగులాబీలు వాడాలి. మహాలక్ష్మి అష్టకం, కనకధారాస్తోత్రాలు పారాయణ చేయాలి. దేవాలయంలో లక్ష్మీ అష్టోత్తరపూజను చేయించుకుంటే మంచిశుభం. కొందరు స్త్రీలు ఈ రోజున లక్ష్మీకుబేరహోమాలు, కేదారేశ్వరవ్రతపూజ, సత్యనారాయణవ్రతపూజ, వైభవలక్ష్మీవ్రతాలను ఆచరిస్తారు. సాయంత్రం 6గం॥లు దాటిన తరువాత రెండు వెండి దీపారాధనలో 5+5 తామరవత్తులను ఆవునేతితో వెలిగించి, ఎర్రటికుంకుమతో 108మార్లు **'ఓం మహాలక్ష్మీదేవ్యైనమః'** అని కుంకుమపూజను చేయాలి.

రాక్షసనాశనానికి, ధర్మప్రతిష్ఠాపనకు గుర్తుగా అమావాస్యనాడు జరుపుకునే దీపావళిపండుగనాడు లక్ష్మీదేవికి ప్రతీకగా వెలుగులు విరజిమ్మే దీపలక్ష్మిని పూజించడం వల్ల సర్వశుభాలు కల్గుతాయి.


గట్టిగా అరచి మాట్లాడినంత మాత్రాన తెలివైనోళ్లని కాదు

కళలు

# మంగళవాద్యం

– డా॥ దేవులపల్లి పద్మజ,
98496 92414



భారతీయసంప్రదాయవేడుకల్లో, భగవత్సంబరాల్లో, గృహ శుభకార్యాల్లో, ఉత్సవసందర్భాల్లో మంగళప్రదంగా వినిపించే వాద్యసంగీతం మంగళవాద్యసంగీతం. తరచుగా డోలు, సన్నాయి, దేవాలయాల్లో ఐతే ఈ రెండింటితో కేరళవాద్య సంగీతమేళంకూడా ఏర్పాటు చేయడం జరుగుతోంది. అందులో ప్రధానంగా నాదస్వర వాద్యం. పలికే కృతులకు అను కూలంగా వినిపించే లయవాద్యం డోలు. రెండునాదస్వరాలు, రెండుడోళ్ళు, ఒకశృతి, ఒకతాళం కలిపి ఒక మంగళవాద్యబృందంగా లేక మేళం అని చెప్ప బడుతుంది.

వాద్యము, స్వరము రెండు సంగీతానికి ప్రధాన అంశాలు. సంగీతప్రపంచంలో వాద్యం ఎంత గౌరవ స్థానం పొందిందో తెలిసిందే! నాదోపాసనలో మిగిలిన తంత్రీ, సుపిర, ఘనవాద్యాలకన్నా ఉన్నతప్రమాణాలు కలిగి ఉంది. మిగిలిన వాద్యాలకన్నా నాదపోషణవిషయంలో ఎక్కువ సాధన అవసరం. సన్నాయివాద్యంవల్ల వచ్చే లయబద్ధస్వరమే నాదస్వరం అంటారు.

మన ప్రముఖదేవతల బ్రహ్మోత్సవాలు, కల్యాణవేడుకల సమయంలోనూ డోలు, సన్నాయి తప్పనిసరి. ఐతే మన దక్షిణ భారతదేశ దేవాలయాల్లో కేరళవాద్యం అనే దాన్నికూడా కలిపి ఈ మూడింటితో విశేషంగా వాద్యసేవ చేయడం చూస్తూంటాం. అసలు ఈ వాద్యసేవచేయడంలోని ఆంతర్యం ఏమిటంటే– ఆలయంలోపల వేంచేసిఉన్న భగవంతుడు ఉత్సవమూర్తిగా వెలుపలికొచ్చి భక్తులకు దర్శనమిచ్చి, వారి మధ్యలో, వారితో కలసి భక్తులచే సేవలు చేయించుకొని, తమను అనుగ్రహించి కరుణకటాక్షాలతో కాపాడాలని వేడుకొంటూ మంగళకరమగు నీకు స్వాగతం పలుకుతున్నాం అనే విషయానికి మంగళవాద్య సంగీతంతో మా విన్నపాలు విని మాకు మంగళమును చేకూర్చుము అని భక్తుల మనోభావన.

డోలువాద్యంతో ప్రారంభమయ్యే నాదస్వరసభలో మొదట 'తోం తోం తోం' అని వినిపిస్తే అందులో పరమేశ్వరుని డమరుకవిన్యాసంలో పలికే ఓంకారం ధ్వనిస్తుంది. హిందూ ధర్మంలో ఓంకారం శుభసూచకం. సృష్టికి మూలం అనాహత జన్యం. జగద్గురువులు శంకరాచార్యులవారి అద్వైత సిద్ధాంతానుసారం విష్ణువు, శివుడు ఒకరే. భావన మాత్రమే ద్వైతము. ఓంకారశబ్దంతో, మంగళవాద్య సంగీతంతో అంగరంగవైభవంగా బ్రహ్మోత్సవాలు శ్రీకారం చుట్టు కుంటాయి.

**ఓంకారం చ పరబ్రహ్మం యావదోంకార సంభవః!**

సంగీతం సామవేదసారం. సంగీతం నాదమయం. సామం అంటే మధురమైనది. వేదం అనగా జ్ఞానం. సంగీతం ఉత్తేజాన్ని అందించి మనోచైతన్యాన్ని కలిగిస్తుంది. వేదాన్ని మంత్రోచ్చారణతో పలికేవారు వేదబ్రాహ్మణులు. నాదాన్ని సంగీతోచ్చారణతో పలికించేవారు నాదబ్రాహ్మణులు. తిరుమల, శ్రీశైలం, భద్రాచలంవంటి పుణ్యక్షేత్రాల్లో విశేషవేడుకల్లో, స్వామి దేవేరులను మంగళవాద్యంతో స్వాగతం పలకడం మన హిందూసంప్రదాయంలో మిళితమైన భగవత్సేవ.

మరి "నాదం" అంటే ఏమిటంటే... 'న' కారానికి ప్రాణమని, 'ద' కారానికి అగ్ని అని, ప్రాణాగ్నుల సంయోగంతో ఉద్భవించేదే నాదమని శాస్త్రవచనం.

నాదం అనగా బ్రహ్మం! నాదం పరబ్రహ్మస్వరూపం! వేదం మహావిష్ణుస్వరూపం! నాదస్వరసంగీతం హిందువుల సంబరాల్లో, ఆలయవేడుకల్లో మంగళవాద్యం మ్రోగవలసిందే. సందర్భాన్నిబట్టి అన్నమయ్య, త్యాగయ్య, పురందరుడువంటి మహాభక్తులు రచించి స్వామి అనుగ్రహం పొందిన కీర్తనలు వాయిస్తూ స్వామికి దగ్గరయ్యారు. ఆ మంగళవాద్యంలో నాద స్వరసంగీతంలో సుదీర్ఘ రాగాలాపన ప్రధానాంశం. రెండు నాదస్వరాలు పంచుకునే అనేకగతుల్లో స్వరప్రస్తారం చేస్తుంటే పరవశించని హృదయం ఉండదు.

'డోలు' వాద్యంలో కూడా విశేషమైన గణనసామర్థ్యం పెరిగింది. నాదస్వరసభలో రెండుడోళ్ళు, ఇద్దరువాద్యకారుల మధ్య పోటీవలె ఉంటుంది. డోలు నాదస్వరసమ్మేళనం ఉన్న దేవాలయాలే శోభాయమానమౌతున్నాయి. పవిత్రమైన నాదస్వర నాదానికి కేరళవాద్యం సహచరి ఐతే కొండమీది వేంకటేశ్వరుడు భక్తులకొరకు మంగళవాద్యం వినగానే తరలివచ్చి వారి మనోభీష్టాన్ని నెరవేరుస్తాడు కదా.

ఆ నాదానికి డోలు తోడైతే వచ్చే సంగీతం ఆ తిరుమల వాసుని మది చేరి మనలను కరుణించకుండా ఉండలేడు కదా. మలయప్పస్వామి మన మదిలోని చీకు చింతలను పోగొట్టి శుభమంగళములను ప్రసాదిస్తాడు కదా!

డోలు, సన్నాయిలకు కేరళవాద్యసంగీతం చెండాకూడా జతగా చేరితే అక్కడ ఆ మలయప్పస్వామి ప్రత్యక్ష అనుగ్రహం కలగకపోదు. ఆ త్రివాద్యసంగీతశబ్దానికి వైకుంఠద్వారం తెరుచుకుని మూలవిరాట్ భూలోకభక్తులకు అన్నిచింతలనూ పోగొట్టి సుఖసంతోష ఐశ్వర్యాలు కలిగిస్తాడని విశ్వాసం. ఐతే ఆ చెండావాద్యం ఎలా ఉంటుందంటే... చెండా ఒక బహుముఖ వాయిద్యం. ఆచారబద్ధమైన మరియూ వినోదం పంచేవిధంగా సాగే స్థూపాకార పెర్కషన్ పరికరంతో వాయించే సంగీతం.

కేరళలోని సంప్రదాయపండుగలకు పంచారీమేళం చంపా, చెంపడా, అడంత, ధృవం మరియు పాండిమేళం అనే ఏడురకాల "మెలంగల్" ఉన్నాయి. ఈ వాయిద్యం ఉత్తరాదిలో అసురవాద్యంగా భావిస్తారు. అంటే సామరస్యధోరణిలో సాగకుండా భీకరశబ్దంతో శ్రవణానందంగా ఉంటుంది. అనివార్యమైన వాయిద్యంగా దక్షిణకేరళలో అన్ని దైవసంబంధ,



సాంస్కృతికకార్యక్రమాల్లో వినిపిస్తారు. ఈ ధ్వని తిరుమల బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఆస్వాదిస్తూ అలౌకిక ఆనందం పొందుతుంటారు.

ఈ చెండావాద్యపరికరం స్థూపాకారంలో ఉండి రెండు వైపులా, కుడి ఎడమచేతులతో వాయించేవిధంగా పనసచెక్కతో తయారుచేయబడుతుంది. దీనినుంచి వచ్చే వాద్యం భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవటానికి ప్రధానమూలం. ఇపుడు కేరళలో పెరువెంబు, నెమ్మర, లక్కిడి, వెల్లర్కాడ్ మరియూ వలప్పాయ గ్రామాల్లో చెండాపరికరాన్ని తయారుచేసే నైపుణ్యం ముడిపడి ఉంది. ఇది ఒక ప్రత్యేక మంగళవాద్య సంగీత పరికరం.

హైందవసంప్రదాయంలో త్రిమూర్తులను నాద స్వరూపులుగా భావిస్తారు. అద్వైతభావం కలిగి నాదంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు మూడురూపాల్లో ఒకరుగా నాదం చెప్పబడుతోంది.

అంతరాలయంలో నిత్యసేవలందుకుంటున్న భగవానుడు పుణ్యదిన వేడుకలకు భక్తజనంమధ్యకు వేంచేసి ఆ యా సందర్భాలను అనుసరించి జరిగే బ్రహ్మోత్సవాలసమయం, వసంతోత్సవవేడుకలు, ముక్కోటిఏకాదశివంటిదినాల్లో దినమునకు ఒక అలంకారంలో దర్శనమిస్తారు. ఆ వేడుకలకు మంగళ వాద్యాలే ప్రధానం. అయ్యవారికి జరిపించే పూజాక్రతువులకు సమన్వయంగా మంగళవాద్యం వినిపిస్తారు నాదబ్రహ్మలు. ఆ మహోన్నతమైన కార్యక్రమం వీక్షించటం నేత్రవైభోగమే. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప భక్తులకు దర్శనభాగ్యం లభించదు.

మరి మనఇండ్లలో జరిగే కల్యాణకార్యక్రమాలకు కూడా మంగళవాద్యాలు ఏర్పాటుచేసుకుంటాం. దానికి కారణం వధూవరులను హిందూవివాహంలో మహాలక్ష్మి, విష్ణు మూర్తులుగా భావిస్తాం. ఆ సమయంలో చెప్పే మంత్రార్థాలు కూడా అవే తెలియజేస్తాయి. కన్యాదాత శ్రీమహావిష్ణువు మా జామాత రూపంలో, మహాలక్ష్మి మా కుమార్తెరూపంలో ఉండడం వల్ల ఆ వరుసకు నా కుమార్తెను కన్యాదానం చేస్తున్నాను. పాణిగ్రహణంతో భార్యగా స్వీకరించుమని వేడుకుంటున్నాను అని చెప్తారు. ఇక్కడకూడా మంగళవాద్యసంగీతం తప్పనిసరి. సాధారణంగా సీతారామకల్యాణగీతాలనే మంగళవాద్యసంగీతంతో వినిపిస్తారు.



మంగళమని మంగళమని
మంగళమనరే!
మంగళమని మంగళమని
మంగళమనరే!
చెలులారా! మంగళమనరే!

జీవనప్రగతి

# ఉద్యోగం

- శ్రీ డి.భాస్కరరామశర్మ,
92907 30792

మహాభారతంలో పాండవులు కౌరవులతో జూదమాడి ఓడిపోయారు. అందుకు ప్రతిఫలంగా పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక్క సంవత్సరం అజ్ఞాతవాసం చేయాలనే షరతులు అనుభవించాల్సి వచ్చింది. అందుకు కట్టుబడి పాండవులు పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం పూర్తి చేశారు. ఆ తరువాత అజ్ఞాతవాసానికి సంకల్పించారు. ఈ వాసంలో వీరెవరో ఎవరికీ తెలియకుండ కాలం గడపాలి. అలా గడపాలంటే తమకు విరాటనగరంలోని విరాటరాజు కొలువే సరైనదని భావించారు. అలా ఆ నగరానికి బయలుదేరుతూ మార్గమధ్యంలో తమ ఆయుధాలను ఒక జమ్మిచెట్టుపై భద్ర పరచి, దుర్గాదేవిని ప్రార్థించారు. ఆ తరువాత యమధర్మరాజును ప్రార్థించారు. అందుకు యముడు ప్రత్యక్షమై ధర్మరాజుకు సన్యాసివేషం, భీముడికి వంటలవాడివేషం, అర్జునునికి పేడి వేషం, నకులునికి అశ్వరక్షకునివేషం, సహదేవునికి పశు పాలకుడివేషం, ద్రౌపదికి సైరంధ్రివేషం అనుగ్రహించాడు.

ఇప్పుడు వారు విరాటనగరంలోకి ఎలా ప్రవేశించారు? ఎలా కొలువులో చేరారు? అవేంటో సంభాషణరూపంలో తెలుసు కుందాం.....



విరాటరాజు సభలో కొలువుదీరి ఉన్నాడు. అప్పుడు కంకుభట్టు అనే పేరుతో సన్యాసివేషంలో సభలోకి వస్తున్న ధర్మరాజును చూశాడు.

**విరాటుడు–** అయ్యా! నమస్కారం. మీరెవరు? మీదేవూరు? మా నగరానికి ఎందుకొచ్చారు? చెప్పండి.

**కంకుభట్టు–** అయ్యా! నా పేరు కంకుభట్టు. నేను ద్విజుణ్ణి. కురుదేశంలో పుట్టాను. సన్యాసం స్వీకరించాను. నేను జూదం బాగా ఆడతాను. శత్రువులతో జూదమాడి అంతా పోగొట్టుకున్నాను. ఆ అవమానం భరించలేక రాజ్యం వదలి వచ్చేశాను. మీరెంతో మంచివారని విని మీ దగ్గరకు వచ్చాను. ఒక్క సంవత్సరంపాటు మాత్రమే మీ కొలువులో ఉంటాను. అంతవరకు మీకు రాజ్యనిర్వహణలో ఉత్తమ సలహాలిస్తుంటాను మరియు జూదక్రీడలో మిమ్మల్ని ఆనంద పరుస్తుంటాను. నాకు అనుమతివ్వండి.

**విరాటుడు–** అయ్యా! చాలా సంతోషం. నిరభ్యంతరంగా ఉండండి. మీరు మా రాజ్యంలో ఉంటే చాలు. అదే మహా భాగ్యం మాకు. మీకు ఏ కొరత రానివ్వం. సరేనా!

**కంకుభట్టు–** చాలా సంతోషం. ధన్యవాదాలు.

ఆ తరువాత వలలుడనే పేరుతో భీమసేనుడు వంటల వాడిగా చేతిలో గరిటెతో కొలువులోకి ప్రవేశించాడు. అదెలా గంటే.....

**విరాటుడు–**(భీముణ్ణి చూచి)అయ్యా! మీరెవరు? తమరి పేరేంటి? ఎక్కడినుండి వచ్చారు? వివరాలు తెల్పండి.

**వలలుడు–** అయ్యా! నమస్కారమండి. నా పేరు వలలుడు. వంటలవాణ్ణి. వంటలు బాగా చేస్తానండి. అలాగే మల్ల

యుద్ధం కూడా బాగా వచ్చండి. ఎవరైనా మల్లయుద్ధవీరు లుంటే మీముందే మల్లయుద్ధప్రదర్శన చేసి మిమ్మల్ని ఆనందపరుస్తానండి.

**విరాటుడు–** ఇంతకీ మీరింతకుముందు ఎక్కడైనా పనిచేశారా?

**వలలుడు–** అయ్యా! హస్తినాపురంలో ధర్మరాజుకొలువులో ఉండే వాడినండి. పాపం వారికి కష్టాలొచ్చాయండి. అందుకే అక్కడినుండి ఇలా రావాల్సివచ్చిందండి.

**విరాటుడు–** ఓహో! అలాగా! ఐతే మా వంటగదిలోకి వెళ్ళండి. మీ వంటలతో, మల్లయుద్ధకౌశలంతో మమ్మల్ని ఆనంద పరవశుల్ని చెయ్యండి. మీరు మా కొలువులోకి రావటం మా అదృష్టంగా భావిస్తున్నామండి.

**వలలుడు–** అయ్యా! తమరు ధర్మప్రభువులండి. మా మొర ఆలకించి, మాకు ఉద్యోగం ఇచ్చినందుకు ధన్యవాదాలండి.

ఆ తరువాత అర్జునుడు పేడివానిరూపంలో బృహన్నల అనే పేరుతో విరాటరాజు కొలువులోకి ప్రవేశించాడు.

**విరాటుడు–** అయ్యా! ఓ కంకుభట్టుస్వామీ! ఆ వచ్చేదెవరు? అంత వయ్యారంగా నడుస్తూ వస్తున్నారు?

**కంకుభట్టు–** ఎవరో మీరే అడిగి తెలుసుకోండి మహాప్రభూ!






**విరాటుడు–** అమ్మా! ఎవరు మీరు? ఎక్కడినుండి వస్తున్నారు? మీ పేరేంటి? చెప్పండి.

**బృహన్నల–** అయ్యా! నా పేరు బృహన్నల. పేడిదాన్ని. నేను నాట్యకళలో ప్రావీణ్యమున్నదాన్ని. అలాగే ఇతర అన్ని కళల్లోకూడా ప్రావీణ్యమున్నదండి. మీ కొలువులో ఎవరి కైనా సరే నాట్యాన్ని నేర్పగలను. నాకు అవకాశమిప్పించండి.

**విరాటుడు–** ఓహో! అలాగా! చాలా సంతోషమమ్మా. నాకు ఓ కుమార్తె ఉంది. అమ్మాయి పేరు ఉత్తర. ఆమెకు అన్ని కళలనూ నేర్పించు. ఆ కోవలోనే మా కొలువులో నీకు అవకాశమిస్తున్నాను. సరేనా!

**బృహన్నల–** అలాగేనండి. చాలా సంతోషం. మీరు కొలువు ఇప్పించినందుకు ధన్యవాదాలు.

**విరాటుడు–** (ఉత్తరను కొలువుకు రప్పించాడు. ఆమెను చూసి..) అమ్మాయ్ ఉత్తరా! ఇకమీదట ఈమె నీకు గురువులాంటిది. ఈమె శిక్షణలో అన్ని కళలకు సంబంధించిన విద్యలను నేర్చుకో.

**ఉత్తర–** అలాగే నాన్నగారండి. నమస్కారమండి గురువుగారు. రండి. లోపలికి వెళ్దాం!

**బృహన్నల–** చిరంజీవ! చిరంజీవ! అలాగే పదమ్మా! (ఇద్దరూ మందిరంలోనికి ప్రవేశించారు)

ఆ తరువాత నకులుడు దామగ్రంథి అనే పేరుతో అశ్వ పాలకునివేషంలో విరాటరాజు కొలువులోకి ప్రవేశించాడు.

**విరాటుడు–** అయ్యా! మీరెవరు? ఎక్కడినుండి వచ్చారు? వివరాలు తెల్పండి మరి.

**దామగ్రంథి–** అయ్యా! నా పేరు దామగ్రంథి. నేను అశ్వ పాలకుడను. ఇంతకుముందు ధర్మరాజుకొలువులో పని చేశాను. ఇప్పుడు కాలం కలిసిరాక అక్కడినుండి బయటకి రావాల్సి వచ్చింది. మీ రాజ్యంలో అశ్వాలకు సంబంధించిన పరిపాలకుడుగా పనిచేద్దామని ఇక్కడికొచ్చాను. పనుంటే ఇప్పించండి.

**విరాటుడు–** అలాగే! నీవు ధర్మరాజు కొలువునుండి వచ్చావు గాబట్టి నీకు మా అశ్వశాలలో కొలువిప్పిస్తాను. మా గుర్రాలను సంరక్షించే బాధ్యతను తీసుకో.

**దామగ్రంథి–** అయ్యా! చాలా సంతోషం. ధన్యవాదాలు.

ఆ తరువాత సహదేవుడు తంత్రీపాలుడనే పేరుతో తాళ్ళ మూటతో పశుగోపాలకుడివేషంలో విరాటరాజు కొలువులోకి వచ్చాడు.

**విరాటుడు–** అయ్యా! తమరెవరు? తమరి నామధేయమేంటి? ఎక్కడినుండి తమరిరాక? వివరాలు తెల్పండి.

**తంత్రీపాలుడు–** అయ్యా! నా పేరు తంత్రీపాలుడు. గోవులను మేపుతాను. అలాగే వాటిని సంరక్షిస్తానుకూడా. ఇంతకు ముందు ధర్మరాజుకొలువులో ఉండేవాణ్ణి. ఇప్పుడిక్కడికి వచ్చాను.

**విరాటుడు–** అలాగా! చాలా సంతోషం. మా రాజ్యంలో మాకున్న గొప్ప సంపద గోసంపదయే! దానిని బాగా కాపాడుతావని ఆశిస్తున్నాం. మిమ్మల్ని పశుపాలకుడిగా నియమిస్తున్నాం. గోగణాన్ని సంరక్షించే బాధ్యత నీదే సుమా!

**తంత్రీపాలుడు–** అలాగే మహాప్రభూ! ధన్యవాదాలు.

ఆ తరువాత ద్రౌపదీదేవి మాలిని అనే పేరుతో సైరంధ్రి వేషంలో విరాటనగరంలోనికి అడుగుపెట్టింది. ఆ పురవీథుల్లో మధురంగా పాట పాడుతూ వెళ్తోంది. ఆమెను చూసింది విరాట రాజు భార్య సుధేష్ణాదేవి.



**సుధేష్ణ–** ఓ చెలికత్తెలారా! ఎవరామె? ఎంతమధురంగా పాడుతోంది. మీరెళ్ళి ఆమెను నా దగ్గరకు తీసుకురండి.

**చెలికత్తెలు–** (అందరూ సైరంధ్రిదగ్గరకి వెళ్ళారు). అమ్మా! మీరెవరు? మా అమ్మగారు మిమ్మల్ని తీసుకుని రమ్మన్నారు.

**మాలిని–** ఓ అలాగా! వెళ్దాం పదండి.

**సుధేష్ణ–** అమ్మా! ఎవరు మీరు? మీ పేరేమి? ఎక్కడినుండి వచ్చారు?

**మాలిని–** అమ్మా! నా పేరు మాలిని. సైరంధ్రిజాతి స్త్రీని. పాండవుల భార్య ద్రౌపదివద్ద పనిచేశాను. కొన్ని కారణాల వల్ల బయటకి ఇలా రావాల్సివచ్చింది. మీరనుమతిస్తే మీ దగ్గర కొలువు ఇప్పించండి. మీకు సపర్యలు చేసుకుంటాను.

**సుధేష్ణ–** అలాగే! నాదగ్గరుండి నాకు సపర్యలు చేసేలా నీకు కొలువిస్తున్నాను. నావద్ద నిరభ్యంతరంగా ఉండొచ్చు. సరేనా!

**మాలిని–** అలాగే అమ్మా! ధన్యవాదాలు.

అలా అందరూ విరాటరాజు కొలువులోకి చేరుకుని వారి వారి విధ్యుక్తధర్మాలను చక్కగా నిర్వర్తిస్తూ ఎవరికీ తమ ఉనికి తెలీకుండా కాలం గడిపారు.

ఆ కాలంలో కౌరవులు వారి జాడకోసం ఎంతగానో ప్రయత్నించారు. అలా పాండవులు వారి భార్య ద్రౌపది ఎన్నో కష్టనష్టాలకోర్చి, భగవత్ధ్యానంతో విరాటరాజుకొలువులో చేరి, దిగ్విజయంగా అజ్ఞాతవాసం పూర్తిచేశారు.

అలా అజ్ఞాతవాహం చివరిఘడియల్లో విరాటరాజు నగరంలో గోవులను అపహరించుకు వెళ్ళిన కౌరవులను యుద్ధంలో ఓడించి, ఉత్తరగోగ్రహణాన్ని విజయవంతం చేసి తమ అజ్ఞాతవాసాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. ఆ సమయంలోనే వారు జమ్మిచెట్టుపై ఉన్న తమ ఆయుధాలను తీసుకున్నారు. అది విజయదశమిరోజు. కాబట్టి విజయదశమిరోజున పాండవుల అజ్ఞాతవాసకాలాన్ని మనం పఠించినట్లైతే మనకు సర్వసంపదలు సమకూరుతాయని, అన్నింటా విజయం సమకూరుతుందని, అన్నింటా విజయం సాధిస్తామని మహాభారతవాక్కు.

అలాగే, మహాభారతంలోని విరాటపర్వం కావ్యాన్ని విన్నా లేక పఠించినా ఉద్యోగప్రాభవంతో వెలుగొందుతారని మహాభారతం చెప్తోంది. కాబట్టి మనమూ దానిని పఠించి విజేతలవుదాం.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



### గత సంచిక తరువాయి..

జ్వాలాపతుడు రాజాజ్ఞమేరకు సమరానికి బయలుదేరాడు. చిత్రవిచిత్రమైన ఆయుధాలను సన్నద్ధం చేసుకొన్నాడు. ఒంటెలు కట్టిన రథం ఎక్కి క్రోధంతో కదిలాడు. చక్రరాజు సైన్యాన్ని చీకాకుపరిచాడు. ఈ దృశ్యాన్ని చూస్తున్న చక్రరాజు-

“బాడబాముఖీ, జ్వాలాపతుని వీర విహారం చూస్తున్నావుగా. నీవు శూరవీరుడివి. వెంటనే కదలు. కిరాతవిభునిపై దండెత్తు. అతణ్ణి బంధించు. మరొక్క సంగతి- నాలాంటివానికి కిరాతసైన్యంతో పోరా? అని సంశయించకు. నాకు తెలుసు. వారు మనతో సరితూగెడి వీరులు కారు. అయినా వారు సామాన్యులు కారు. పాపమతులు. వారిని చంపడం ఏ మాత్రం తప్పుకాదు’ అని కర్తవ్యముపదేశించాడు.

చక్రరాజు అనుమతితో బడబాముఖుడు కిరాతసైన్యవధకు వ్యూహం నిర్ణయించుకొంటూ జ్వాలాపతునిపై సాహససమరం చేశాడు. ముందుగా జ్వాలాపతుని రథాన్ని ముక్కలు ముక్కలు చేశాడు. విష్ణుచక్రం అనే పేరుగల చక్రాయుధం ప్రయోగించి జ్వాలాపతుని శిరస్సుని ఖండించాడు. జ్వాలాపతుని దేహం నేలపడింది.

సుదర్శనరాజు సైన్యాధిపతిని ప్రశంసలతో ముంచెత్తాడు.

చోరులను, చోరరాజులను సర్వనాశనం చేయడంలో తనపని పూర్తి అయిందని చక్రరాజు వెనుదిరుగలేదు. శేషాచలానికి వచ్చే యాత్రికులు శ్రమపడకుండా ప్రకృతి రామణీయకతకు పరవశిస్తూ గుంపులు గుంపులుగా రావడానికి వీలుగ అరణ్యంలో చక్కటిమార్గం వేయించాడు. అంతేకాదు యాత్రికుల ప్రయాణానికి అనువుగా రక్షణగా ఉండడానికోసం పుణ్యాత్ములైన వారికి అక్కడక్కడ ఆవాసం కల్పించాడు. ఈ వ్యవస్థ కట్టుదిట్టంగా సాగడానికి ఒక రాజునుకూడా నియమించాడు. ధర్మపరిపాలనం నీ కర్తవ్యమని పాలకునకు హితబోధ చేశాడు.

అంతటితో సుదర్శనరాజు కర్తవ్యం పూర్తికాలేదు. వాయువ్యదిశవైపు అడుగులు వేశాడు. అక్కడి చోరులను నిర్మూలనం చేశాడు. తదనంతరం ఉత్తరంవైపు సైన్యాన్ని కదలనిచ్చాడు.

ఉత్తరదిగ్భాగం ఇందాక జయించిన దిశలవంటిది కాదు. కాకులు దూరని కారడవి. చీమలు దూరని చిట్టడవి. అలాంటి ప్రదేశాలలో ధైర్యంగా చక్రరాజు రెండవ మార్తాండునిలాగా చొరబడ్డాడు. తమప్రాంతంలో అడుగుపెట్టిన సైన్యాన్ని సూర్యునిలా మెరిసే సుదర్శన రాజును చూసిన రాక్షసులు జడుసుకొన్నారు. ఏదో తమకు, తమ ప్రదేశానికి, తమ (పౌరులకు) పాలకులకు ముప్పు వాటిల్లబోతుందని వెనువెంటనే భేరుండను తమ రాజు దగ్గరికి వెళ్లి..

‘చండప్రతాప! భేరుండప్రభుస్వామి! ఎవరో ఒక అద్భుతవీరుడు ససైన్యంతో మన ప్రాంతాలలో అడుగుపెట్టాడు. అతడు సామాన్యుడుగా కనబడడం లేదు. కాలాగ్ని రుద్రునిగా కనిపిస్తున్నాడు. అంతేకాదు వేయిచేతులవాని, ఎర్రరంగువస్త్రం కట్టినవానిని హారకిరీటకేయూరాది ఆభరణాలు ధరించినవానిని, గంభీరమైన రథం ఎక్కినవానిని చూస్తుంటే మాకు దడ పుట్టుకొస్తుంది. మీకు విన్నవించాలని వచ్చాం అన్నాడు.

### 2024, నవంబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

- 01 కేదారగౌరివ్రతం
- 05 నాగులచవితి
- 09 తిరుమల శ్రీవారి పుష్పయాగం
- 13 కైశికద్వాదశి
- 14 బాలలదినోత్సవం
- 15 కార్తికపూర్ణిమ
- 28 ధన్వంతరిజయంతి
- 28నుండి డిసెంబరు 06వరకు తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవం

భేరుండుడు రాక్షసవీరులను చూశాడు. వారి మాటలుబట్టి ఎదిరి సామాన్యుడు కాడని అర్థం చేసుకొన్నాడు. అయినా, తమాయించుకొని రాక్షసవీరులారా! నన్ను సంహరించాలని వీరాటోపంతో ఎదిరి వచ్చినట్లున్నారు. అయినా నేను భయ పడను. నా ప్రతాపంతో, యుక్తితో, ససైన్యంతో ఆ రాజును ఎదుర్కొంటాను. నా విక్రమ విజృంభణంతో అతణ్ణి నామ రూపాలు లేకుండా చేసి మన ప్రభువైన రావణునికి నివేదిస్తాను. ఈ చర్యతో ఈ లోకంలో భేరుండుడు అంటే సర్వజనులకు తెలియవస్తుందని వీరోక్తులాడి సుదర్శన రాజున్నవైపుకు కదిలాడు.

వీరిరువురిమధ్య భీకరరణం సాగింది. దక్షిణదిక్కులోని సముద్రఘోషలా హాహా కారాలతో ఆ ప్రదేశం నిండిపోయింది. ఎక్కడచూసినా రక్తప్రవాహమే. వీరుల చేతులు చేపల్లా, కాళ్లు తాబేళ్ళలాగా, పగిలిన పుఱ్ఱెలు, కాలిన ఆకారాలు, చెల్లా చెదురుగ పడిన శరీరభాగాలు కప్పల్లాగా, నేలకూలిన విమానాలు, ఏనుగులు, గుర్రాలు ద్వీపాలులాగా, చామరాలు జల పక్షులలాగా, తెల్లని గొడుగులు నురుగుల మొత్తంలాగా, రక్తప్రవాహంలో తేలే శిరోజాలు పేరుకొన్న గుంపుల్లాగా కనిపి స్తుంటే, గద్దలు వరుసకట్టి వాలుతుంటే భూతప్రేతపిశాచాలు ఎగసి గంతేశాయి.

ఆహా! ఎన్నాళ్లకెన్నాళ్లకు ఈ సమా రాధన. అయాచితంగా చక్రరాజు మన కోసం సిద్ధాన్నం చేసిన సమారాధన. రండి రండి అంటూ తమ సహచరుల్ని పేరు పేరునపేరులుపెట్టి ఆహ్వానించసాగారు. యుద్ధం భీకరంగా సాగుతున్నా భేరుండుడు భయపడలేదు. సమరంలో చావగా మిగిలిన వీరులతో సుదర్శనుని ఢీకొన్నాడు.

చక్రరాజు భేరుండుని చూచి హూంక రించాడు. దిక్కులు గడగడవణుకుతుంటే సూర్యచంద్రాదులు చక్రరాజు తన అను చరుడైన పావకుని ప్రేరేపించాడు.

పావకుడు చక్రరాజు ఆనతో బయలు దేరి విరోధిపై సమ్మోహనాస్త్రం ప్రయోగిం చాడు. ఆ సమయంలో రాక్షసులు మైకం కమ్మినవారై తమవారెవరో, ఎదుటి వారెవరో గుర్తుపట్టలేక తమవారినే పెర వారుగా భావించి తలలు నరుక్కొన్నారు.

ఇవన్నీ చూసిన చక్రరాజు కాసేపు ఆలోచించాడు. ఇది అధర్మయుద్ధమని పావకునికి హుకుం జారీచేశాడు. పావ కుడు అలాగే సమ్మోహనాస్త్రం ఉపసంహ రించాడు.

ఆపై పావకుడు క్రౌంచాస్త్రం ప్రయో గించాడు. ఆ అస్త్రం రాక్షసుల ముక్కుల్ని చెవుల్ని ఖండించింది. ఇవ్వన్నీ చూచిన భేరుండుడు విజృంభిస్తుంటే పావకుడు మారుతాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్రం భేరుండుని బృహదాకారాన్ని వేంకటనగరం చుట్టూ ముమ్మార్లు తప్పించి కుళ్లిన గుమ్మడికాయ నేలపడ్డట్టు నేలపడవేసింది. సమరాన్ని చూస్తున్న దేవతలు పరవశిం చారు. వేనోళ్ళా పొగుడుతూ..

చక్రరాజా! స్వామిఆనతో నీవు సకల దుర్మార్గులను సంహరించావు. సాధుజను లకు విశ్వాసం కల్పించావు. నీ చేతలకు పురుషోత్తమస్వామి ఎంతో సంతోషిం చాడు. ఇక చాలు చాలు. నీవు వీరుడవు. కరణాస్వభావుడివి. నీ ప్రతాపం అనన్య సామాన్యం. నిన్ను బ్రహ్మాదులుకూడ పొగడలేరు. ఇక కదనకుతూహలానికి స్వస్తి చెప్పి శాంతిని కల్గి శ్రీవేంకటేశ స్వామి సన్నిధానం చేరుకో అని బోధించి దేవతలు తమ స్థానాలకు కదలివెళ్లారు.

## ఆగష్టు నెల క్విజ్-25 సమాధానాలు

01) చాణూర ముష్టికులు
02) ఎదగడం
03) ఇంద్రజిత్తు
04) మయుడు
05) ఓ ఆయుధ విశేషం
06) స్నేహం
07) శ్రీహయగ్రీవుడు
08) దక్షుడు
09) బసవరగడ
10) కృష్ణస్వామిరాజు
11) మట్టి
12) సర్పరూపం
13) మూర్ఖుడి
14) అప్పుచేయడం
15) శ్రీసుదర్శనచక్రం

సరైన సమాధానాలు వ్రాసినవారు– సుంకరి సాత్విక, మెదక్

సుదర్శనుడు దేవతల సలహాలకు తల ఒగ్గకపోవడం మంచిది కాదనుకొన్నాడు. అయినా ఆ స్వామికి ఒక కొరత. శత్రు నిర్మూలనకార్యంలో నాతో వచ్చిన వారెందరో మరణించారు. వీరందరు మర ణించగా నేను మాత్రం వేంకటగిరికి మరలడం బాగుకాదని విజయయోగ ప్రభావంతో సమరంలో నిహతులైన తన చతురంగబలాలను, సైనికులను పునరు జ్జీవితులను చేశాడు.

ఆ పై సకలబలంతో వేంకటాద్రి చేరు కొన్నాడు. పూర్వరూపంతో స్వామి దక్షిణ కరంతో పునఃప్రతిష్ఠితుడయ్యాడని సూతుడు చెప్పగా శౌనకాదులు

స్వామి! కృతత్రేతాద్వాపరయుగాలలో స్వామిలీలలను వర్ణించారు. కలియుగంలో స్వామి ఎలా తమ లీలలను ప్రదర్శించి నాడో ఆ కథలను చెప్పవలసినదిగా కోరారు. *(ఇంకా ఉంది)*

2024,
అక్టోబరు 11న
అశ్వవాహనసేవ
సందర్భంగా...

# అశ్వం

- డా॥ ఎన్.సి.హెచ్.సుధామైథిలి

మనిషి మనసుకు, అశ్వానికి (గుఱ్ఱము) సామ్యం ఉంది. మనసులా అశ్వం వేగంగా కదిలేది, చంచలస్వభావం కలది, విసుగు విరామం లేనిది, సుదూరాలను సులువుగా చేరగలిగేది.


అశ్వం అంటే ఇంద్రియాలు. మన అన్ని ఇంద్రియాల్లో భగవంతుడే ఉండి ఈ అశ్వాలను అదుపులో పెట్టాలి. పగ్గాలు మనస్సుబట్టి మనసులో స్వామి ఉంటే ఇంద్రియాలు ఆయన చెప్పినట్టే వింటాయి. సారథి బుద్ధి కాబట్టి బుద్ధిలోనూ పరమాత్మే, ఇంద్రియాల్లోనూ పరమాత్మే ఉండాలి. ఇంద్రియాలు నడిపించేవాడుకూడ ఆ పరమాత్మే. అందుకే నారాయణునికి హృషీకేశుడు అన్న పేరు గొప్ప విశిష్టత కలిగి ఉంది. కాబట్టే ఆధ్యాత్మికంగాకూడా అశ్వమేధయజ్ఞానికీ, అశ్వవాహనానికీ ఎంతో ప్రాధాన్యం ఉంది.

## అశ్వమేధం

అశ్వమేధమహాయజ్ఞాలకు వేదం విశేషస్థానం ఇచ్చింది. అశ్వమేధయాగానికి మరింత విశిష్టస్థానం కల్పించింది. అశ్వమేధయాగం వేదకాలంనుండి వస్తున్న రాజసంప్రదాయాల్లో అతి ముఖ్యమైంది. ఈ యాగం వివరంగా యజుర్వేదంలో చెప్పబడింది. అశ్వమేధయాగాన్ని కేవలం రాజవంశానికి చెందిన వారు మాత్రమే చేయాలి. ఈ యాగం ఉద్దేశం ఇరుగు పొరుగు దేశాల రాజ్యాలపై ఆధిపత్యాన్ని తెలుపడం, తమ రాజ్యంయొక్క గొప్పతనాన్ని చాటుకోవడం.

దశరథుడు, శ్రీరాముడు, కర్దమప్రజాపతి, పృథు చక్రవర్తి... ఇలా ఎందరో మహాత్ములు అశ్వమేధం ఆచరించారని చెబుతారు. అశ్వాన్ని యజ్ఞపశువుగా చేసి ఆచరించే యాగం కనుక దీన్ని అశ్వమేధయాగమన్నారు. బృహదారణ్యకోపనిషత్తు ఈ యాగాశ్వాన్ని విరాట్‌రూపంగా వర్ణించింది. దీని శిరస్సు- బ్రహ్మముహూర్తం, నేత్రాలు- సూర్యుడు, ప్రాణం- వాయువు, ఉదరం- ఆకాశం, పాదాలు- భూమి, నాడులు- నదులు, రోమాలు- ఓషధులు, శబ్దం- వాక్కుగా ఉపనిషత్తు వర్ణించింది. రాజ్యాధిపత్యం కలవారే ఈ యాగనిర్వహణకు అర్హులని, నూరుసార్లు దీన్ని ఆచరిస్తే ఇంద్రపదవి పొందుతారని శాస్త్రం చెప్తోంది. 'మనస్సే అశ్వం, ఇంద్రియాధిపత్యం ఉన్నవాడే రాజ్యాధిపతి, జితేంద్రియత్వమే మహేంద్రపదవి'... ఇదే అశ్వమేధయాగ సందేశం.

ఈ యాగంలో అన్ని శుభలక్షణాలున్న అశ్వాన్ని (గుర్రాన్ని) సర్వదేవతాస్వరూపంగా పూజించి, స్వేచ్ఛగా వదులు తారు. యువరాజులు, సేనాధిపతులు దానివెంట ఉంటూ దాన్ని ఎవరూ బంధించకుండా రక్షిస్తూ ఉంటారు.



అలా ఏడాది కాలం సంచరించి, తనకు తానుగా యాగశాలకు తిరిగివస్తేనే హోమాలు ప్రారంభిస్తారు. ఇందులో మరొక అంతరార్థాన్ని గ్రహించవచ్చు. అశ్వంలా మనస్సును స్వేచ్ఛగా బాహ్య ప్రపంచంలోకి వదలాలి. అనేక వ్యామోహాలు, విషయవాంఛలు దాని కంటపడతాయి, వెంటపడతాయి. ఇంద్రియలోలత్వమనే శత్రురాజుల భూభాగంలోకి ఇది చొరబడే అవకాశమూ ఉంది. వాటినుంచి కాపాడేందుకు సద్బుద్ధి అనే రాజుసైన్యం మనసు వెంట ఉండాలి. సుదీర్ఘకాలం బాహ్యవిషయాల్లో స్వేచ్ఛగా విహరించినా, ఏ విషయవాంఛలకూ చిక్కకుండా యాగాశ్వమనే మనసు తిరిగి రావడమే మనోవిజయానికి సంకేతం.

## అశ్వవాహనం


శ్వః అంటే రేపు, అశ్వ అంటే రేపు లేనిది. రేపు అంటే ఆశ, అశ్వ అంటే ఆశ లేకపోవటం. ఆశ లేకపోవటం అంటే వైరాగ్యం. వైరాగ్యమే భగవానునికి వాహనం కాబట్టి వైరాగ్యం తోటే భగవానుడు మనదగ్గరకి వస్తాడు. సంసారంమీద వైరాగ్యం ఉంటే భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. భగవంతునిపై కోరిక లేకుంటే సంసారంలో నిమగ్నమవుతాం. భగవంతునిపై కోరికల గుఱ్ఱాలు కావాలని తలిస్తే ఆ గుఱ్ఱంపై భగవంతుడు తరలి వస్తాడు. ఇలా అశ్వవాహనం అంటే వైరాగ్యవాహనం. ఇలా అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామిని చూసి వైరాగ్యాన్ని పొంది ఆ గుఱ్ఱాలతో పరమాత్మను చేరుకోవాలి. ఇలా సూర్యప్రభ అంటే



జ్ఞానం, చంద్రప్రభ అంటే భక్తి, రథము అంటే దేహాత్మ, వివేకం, అశ్వము అంటే వైరాగ్యం. ఇవన్నీ ఉంటే పరమాత్మే దిగి వస్తాడు. ఇదే ఆ వాహనసేవలలోని ఆంతర్యం.

కేశి అను రాక్షసుడు అశ్వరూపంలో రాగా కృష్ణుడు అతణ్ణి సంహరించాడు కాబట్టి స్వామికి కేశవ అని పేరు. ఆశలు పెరిగేవి అహంకారంతోటే. ఇక్కడ కేశి అంటే అహంకారం. అశ్వవాహనం అంటే అహంకారాన్ని అదుపులో పెట్టేదని అర్థం. దేహంలో పరమాత్మను చూస్తే దేహంపై మోహం ఉండదు. నా కనులు బాగున్నాయని అనుకోక నా కన్నులలో సూర్యుడు బాగున్నాడు అనేది అశ్వవాహనం. అశ్వం అంటే స్వామియొక్క హయగ్రీవ అవతారం. ఆ అవతారంతోనే హయగ్రీవుడనే రాక్షసుణ్ణి సంహరించి వేదాలను రక్షించాడు. అశ్వం బలానికి ప్రతినిధి. మనబలాన్ని కొలిచేది అశ్వం. ఆ నిజమైన బలం అంటే అశ్వం పరమాత్మే. శరీరం, ఇంద్రియాలు, వాటి బలంకూడా ఆయనే అని తెలపడానికే స్వామి అశ్వ వాహనంపై ఊరేగుతున్నాడు. అలా ఊరేగుతున్న స్వామిని దర్శించి అన్ని వ్యామోహాలను విడిచిపెట్టి తరిద్దాం.

విశ్వదాభిరామం — వేమన పద్యసూక్తి



## చదువుకోసం దెబ్బలు తినవచ్చు

చాకివాడు కోక చీకాకు పడజేసి,
మయిల బుచ్చి, మంచిమడుపు జేయు;
బుద్ధి చెప్పువాడు గుద్దితే నేమయా?
విశ్వదాభిరామ! వినుర వేమ!


**అర్థాలు:** చాకివాడు = బట్టలుతికేవాడు; కోక = చీర; చీకాకుపడజేసి= అటూ ఇటూ జాడించి..

**భావం:** చాకలి బండకేసి ఉతికి చీరకు పట్టినమురికిని పోగొట్టి శుభ్రంగా చేస్తాడు. బుద్ధి చెప్పేవాడు దెబ్బలేస్తే మాత్రమేమి? జరిగేది మేలే కదా!

**వివరణ:** బట్టలకు పట్టినమురికి పోగొట్టి, శుభ్రం చేయ డానికి ఆ బట్టల్ని ఉడకబెట్టాలి. బండకేసి బాదాలి. ఎండలో ఆరబెట్టాలి. ఇలా కష్ట పెట్టడం భావ్యం కాదు అనుకుంటే, బట్టల మురికి పోదు. అవి శుభ్రం కావు. అలాగే చదువు చెప్పేటప్పుడు గానీ, తప్పు చేసినవాడికి అది తప్పని అర్థమయ్యేటట్లు చెప్పేటప్పుడు కాని ఒకదెబ్బ వేయవలసివస్తుంది. కొడితే బాధ పడతాడని కొట్టడం మానుకుంటే వాడికి చెప్పిన అంశం బుర్రకెక్కదు. కాబట్టి వాళ్లలాభంకోసమే దెబ్బవేయవలసివచ్చింది కాబట్టి అది తప్పు కాదు. అది వాడి ప్రయోజనంకోసమే కాని, వాడిమీద పగ ఉండి కాదు. కాబట్టి తనలాభం కోసమే పెద్దవారు ఇలా చేశారని గ్రహించి, విద్యార్థులు కొన్నిబాధలకు సిద్ధపడిఉండాలనేదే పై పద్య తాత్పర్యం.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:

కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,

కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి భాగం...)*

తిరుమలపైన ఆనందాళ్వార్ కైంకర్యంగా శ్రీభగవద్రామానుజాచార్యులకు ఉత్సవమూర్తిని మాత్రమే నిర్మింపజేసిన పిమ్మట గోవిందరాజస్వామి సన్నిధియందును శ్రీభగవద్రామానుజుల ఉత్సవవిగ్రహం మాత్రం నిర్మింపజేసి ప్రతిష్ఠ చేయించి ఒకేగదిలో విజయం చేయించి ఆరాధన చేయిస్తూన్నారు. చెరువు గట్టున ఉన్న భగవంతునకు శ్రీమండపమందు గర్భాలయమును, గోవిందరాజస్వామికిని ఒక గర్భగృహమును నిర్మింపజేసి అచట పుట్టలో ఉన్న శ్రీఅనంతాళ్వారు(సర్పము) నకును ఆరాధన జరుపు నట్లును తన వాసస్థానమైన నారాయణపురమున తన ఉద్యాన వనమునందలి నాలుగుస్తంభాలమండపాలను మూడింటిని తెప్పించి శ్రీమహామణిమండపం నడుమ ఒక స్తంభమండపాన్ని నిర్మింపజేసి తనదిగా ప్రత్యేకోత్సవం మొదట ఉండవలెనని తలచి తన జన్మనక్షత్రం వృషభమాసపు అనూరాధానక్షత్రంన అవభృథోత్సవం (దీక్షాంతస్నానం) నెరవేర్చునట్లుగ ఏర్పాటు చేయించారు. గోవిందరాజపురాణ (చిత్రకూటమాహాత్మ్య) ప్రసిద్ధమైన తిరువాడి త్రిరునాళ్లను (కర్కాటకమాసోత్సవము) జరిపించారు. శ్రీరామానుజాచార్యుల ఆజ్ఞచొప్పుననే కోవెలకు ఉత్తర (దిక్కున) మాడవీథిని రెండుప్రక్కలందును మేడలను కట్టించి రామానుజపురమని పేరు పెట్టించారు. ఆ దినములలో శ్రీవేంకటేశ్వరస్వామికిని గోవిందరాజస్వామికిని మంగళాశాసనం చేసే శ్రీమహాభాగవతులకును, జ్యేష్ఠశ్రీశైలపూర్ణులకును, అనంతాళ్వారులకును (ఆనందాళ్వాన్), శ్రీవైఖానస శ్రీవైష్ణవులకును దివ్యభవనాలు కట్టించి ఇచ్చి తిరుప్పణిప్పిళ్లైకు (తిరువేంగడచ్చిఱుక్కన్) ఒక మఠం కట్టించి ఇచ్చి వైయాశి(వృషభ) మాస తిరునాళ్ల మొదలుకొని నిత్యోత్సవ మహోత్సవ సంవత్సరోత్సవాలన్నీ జరిగేట్లు చేశారు.

శ్రీ వేంకటేశ్వరుడు అధ్యయనోత్సవమును ఆకర్ణించి అనుగ్రహించేవిధానానికి శ్రీమణవాళమహామునులు తమ శిష్యులైన అష్టదిగ్గజాలల్లో ఒక్కరైన పెద్దకోవెల విచారణకర్త తిరువేంగడ రామానుజజియ్యరుకు వ్రాసి ఇచ్చి పంపిన శాసన పత్రం.

శ్రీవేంకటేశ్వరస్వామి తమ అధ్యయనోత్సవసమయంలో ఇయఱ్పా మొదలుగా దివ్యప్రబంధ మాకర్ణించటానికి శ్రీభగవద్రామానుజాచార్యుల ఆజ్ఞారూపమైన ఐతిహ్యం.

**శ్రీరామానుజ యోగినో హ్యుపదిశన్ సూక్తీశ్శఠారే శ్శుభా**
**శ్చాద్యాయోనిజయోగినాం వృషగిరీశానాజ్ఞయా తత్పురః,**
**భక్త్యాగాయదుదారధీః కరివరస్తద్దేవగానేవ యః**
**శ్రీరంగేంద్రగురుం భజే మునివహాహ్వం నాథవంశోద్భవమ్.**

(మహామేధావి ఐన ఏ కవివరుడు మంగళకరాలైన శఠకోపశ్రీసూక్తులను (తిరువాయ్మొళి) రామానుజయతీంద్రులకు ఉపదేశిస్తూ వృషాద్రిపతి ఆజ్ఞచొప్పున ఆ స్వామి ఎదుట అయోనిజులైన ముగ్గురు మొదలాళ్వారుల గీతాలను భక్తితోడ దేవగానపద్ధతియందు గానం చేసెనో, అట్టి నాథముని



మనిషి ప్రవర్తననుబట్టి నీచత్వం, పెద్దతనం ఆధారపడి ఉంటుంది

వంశోద్భవులై మునివాహనామధేయులైన శ్రీరంగేంద్రగురువును (తిరువంగప్పెరుమాళ్ అరయర్) సేవింతును.)

అనినచొప్పున నాథముని (పెరియముదలియార్) వంశ్యులై, శ్రీరామానుజాచార్యులకు శ్రీముఖసూక్త్యాచార్యులై, శ్రీవేంకటాచలపతి ఆజ్ఞమేరకు స్వామిచిత్తమానందించునట్లు ముదలాళ్వారుల శ్రీసూక్తులను కొన్నింటిని దేవగానమను సంధించి పాడినవారై, 'జ్ఞానీత్వాత్మైవ' అనిన వడువున, శ్రీరంగ నాథుని దివ్యమంగళవిగ్రహసౌందర్యంచేత సేవానంతరం మోక్షంచెందేట్లు భగవంతునకు (సమ్మతుడై) సాధుచేతసుడైన తిరుప్పాణాళ్వారుల శ్రీనామధేయమును పెట్టి, కరుణ చూపదగినట్టి మహిమగల ఆళ్వార్ తిరువరంగప్పెరుమాళ్ అరయర్ అనుప్రబంధగాయకులు ఒక కృత్తికాదీపోత్సవ సందర్భంలో శ్రీరంగనాథునకు మంగళాశాసనం చేసినపిమ్మట శ్రీభగవద్రామానుజమఠానికి విజయంచేయగ శ్రీభగవ ద్రామానుజులు ప్రత్యుత్థాన ప్రణామాద్యుపచారముల నొనర్ప ప్రబంధగాయకులు 'పైత్తపాంబణైయాన్ తిరువేంగడమ్' (పడగ ఎత్తిన ఆదిశేషుడు శయ్యగాగలవాని శ్రీవేంకటాద్రి) "మొయ్త్త శోలై మొయ్పూందడం తాళ్వరై ఏయ్త్తిళైప్పదన్ మున్నం అడైమినో" (సాంద్రవనములు, పుష్పసమృద్ధియు, తటాకములును గల పర్వతమును క్రుంగికృశించుటకు పూర్వమే చేరుకొనుము), "శెన్ఱు వణంగుమినో శేణుయర్ వేంగడమ్" (చేరి మ్రొక్కుడు అంబరచుంబియగు వేంకటశైలమును), "వేంగడ మడైంద మాలపాదమేయడైందు నాళుమ్ ఉయ్మినో" (వేంకటశిఖరి చేరిన భగవంతుని శ్రీచరణమునాశ్రయించి ఎల్లప్పుడుజ్జీవిం పుడు) అనియు ఇట్లు పలుచోట్ల దివ్యసూరులు సంతుష్టులై స్తుతించిన తిరువేంకటయాత్ర చేయ అనుజ్ఞ కోరుచున్నాను' అనగ భగవద్రామానుజులు అట్లే విజయం చేయుము అనగ పయనమై శ్రీకాంచీపురం మార్గంగా బయలుదేరి అచట తమకు అర్థితార్థప్రదాత వదాన్య శ్రీదేవరాజస్వామి శ్రీపాదములకు మ్రొక్కి దివ్యసూరుల భక్తిసార్ద్రగీతాలచే చక్కగా స్తుతించి పిమ్మట తిరుమల అడివారమునకు చేరి భగవద్రామానుజులకు ఆనంద సంధాయకుడైన శ్రీగోవిందరాజస్వామిని తరువాత అలిపిరి (అడిప్పుళి అనగా, కొండఅడుగున ఉన్న దివ్యచించావృక్షమున్న స్థలము) తింత్రిణీవృక్షానికి సమీపమందే విజయం చేసియున్న పరాంకుశ (నమ్మాళ్వారు) పరకాలాదులయొక్క (తిరుమంగై ఆళ్వారు మున్నగువారి) చరణాలకు సాగిలి, పిమ్మట వేంకటశైల మధిరోహించి త్రోవలో విజయం చేసిఉన్న అటవీసుందర నరసింహస్వామికి ప్రణమిల్లి శిలాప్రాకారంవద్దకు చేరగ, అంతట శ్రీశైలపూర్ణులు, శ్రీశైలానంతార్యులు ఈ వృత్తాంతం విని ఎదురేగి పరస్పర ప్రదక్షిణ నమస్కారాద్యుపచారాలు పరిపాలించి, ప్రబంధగాయకులు వారితోబాటు శ్రీమహాద్వారం చెంత ప్రణమిల్లి శ్రీవీథులందు ప్రదక్షిణంగా విజయం చేసి స్వామిపుష్కరిణియందు స్నానంచేసి సకలానుష్ఠానములు నెరవేర్చుకొన్నారు.

"వానత్తవర్కుమ్ అల్లాదవర్క్కుమ్ మత్తెల్లార్క్కుమ్ ఞానప్పిరానై యల్లా లైనాన్ కండ నల్లదునే" (దేవతలకును, మానవులకును, నరకలోకవాసులకును జ్ఞానవరాహస్వామితప్ప నేను కాంచిన మంచిదొకటి లేదు) అనిన చొప్పున దివ్యసూరు లకు ఆనందహేతువైన శ్రీవరాహస్వామికి మంగళాశాసనం చేసి, పిదప శ్రీమహాద్వారమున దండవత్ప్రణామమొనర్చి సేవాక్రమంగా శ్రీదివ్యమందిరం చేరి శ్రీబలిపీఠానికి జోతలిచ్చి, తిరుమడప్పళ్లినాచ్చియారు (పాకశాలలోని అమ్మవారు) పాదాలకు మ్రొక్కి, ప్రదక్షిణంగా వేంచేసి శ్రీనరసింహస్వామికి సాగిలి, శ్రీకృష్ణ (శర్మ) మండపానికి భూషితమైన మత్తగజంవలె 'శెంగమల'అను గీతంచొప్పున సర్వాభరణభూషితుడై విజయం చేసిఉన్న శ్రీనిధిని (శ్రీవేంకటేశ్వరుని) కడుపేద పెన్నిధిగని నట్లు కాంచి ఆనందించి పాదాలకు మ్రొక్కి స్వాచార్యులైన శ్రీయామునాచార్యులను గ్రహించిన స్తోత్రరత్నమును ఆరంభించి 'మదీయమూర్ధాన మలంకరిష్యతి' అనువరకును అనుసంధింపగా అంతట శ్రీవేంకటాచలపతియు 'స మహాత్మా సుదుర్లభః' అనెడు విషయము మనకు సులభంగా దొరికింది గదా అని మిగుల మనస్సున మోదమంది ప్రబంధగాయకులనుచూచి అర్చక ముఖంగా "అడిక్కీళ్ అమర్న్దు పుగం దడియార్ వాళ్వాన్" (శ్రీ పాదముల క్రింద అమరికగా చేరి చొచ్చి, భక్తులైన మీరు జీవింపుడు) అని స్వాగతం పలికారు.

(ఇంకా ఉంది)

## శ్రీవేంకటేశ్వరలీలలు



# ప్రసాదాల స్వామి

- శ్రీ బి.శ్రీనివాసరావు

సప్తగిరీశుడు పిలిస్తే పలికే దైవం. శ్రీవారిలీలలు అద్భుతం. అనంతం. మాది కర్నూలు. మా ఇలువేల్పు శ్రీవేంకటేశ్వరస్వామి. స్వామి దయవల్ల మా కుటుంబమంతా ఓసారి తిరుమలకు వచ్చి స్వామివారిదర్శనం చేసుకున్నాం. మరుసటిదినం మా కుటుంబసభ్యులమంతా మూడు కల్యాణోత్సవాలకు టిక్కెట్లు తీసుకుని కమనీయంగా జరిగిన కల్యాణ ఉత్సవాలను దర్శించి, పులకించాం. స్వామివారికి తనివితీరా మ్రొక్కి, అర్చకులిచ్చిన శేషవస్త్రాలు, తలంబ్రాలు బియ్యం, లడ్డూప్రసాదాలు అన్నీ ఒక సంచిలో పెట్టుకొని శ్రీవారిని దర్శించాం.

ఆ తర్వాత అందరం శ్రీవరాహస్వామివారిని దర్శించుకుని, శ్రీవెంగమాంబ అన్నసత్రంలో ప్రసాదం భుజించాం. మా అందరి ప్రసాదాలసంచి నేనే జాగ్రత్తగా పట్టుకొని ఉన్నాను. ఆ సమయంలో వర్షం వస్తోంది. మా కారుకోసం కార్లపార్కింగు వద్దకొచ్చాం. అక్కడ పెద్ద మఱ్ఱిచెట్టు ఉంది. దానిక్రిందనే అందరం నిలబడ్డాం. అప్పుడక్కడ, ప్రసాదాలసంచి పెట్టి నేను, మా అబ్బాయి మా కారుడ్రైవరుకోసం వెదికాం. అతను ఎక్కడా కనిపించలేదు. వర్షం ఎక్కువైంది. మా రూముకు చేరుకోవాలని, ప్రయివేటువాహనం మాట్లాడుకొని, వర్షంలోనే గబగబా వాహనంలోనికి ఎక్కేశాం. ఎందుకైనా మంచిదని డ్రైవర్ని పార్కింగు చివరవరకు తీసుకెళ్లమన్నాం. అక్కడ చివర్లో మా డ్రైవరు, కారు కనిపించాయి. ప్రైవేటువాహనానికి డబ్బులిచ్చేసి, మా కారు ఎక్కుతుంటే, మా అమ్మగారు ప్రసాదాలసంచి ఏదిరా? అని నన్ను అడిగారు. అప్పుడు గుర్తుకొచ్చింది. నేను చెట్టుక్రింద పెట్టి మరచిపోయాను కదా అని. మా డ్రైవరును, మఱ్ఱిచెట్టువద్దకు తీసుకెళ్ళమన్నాం. మా అందరిముఖాలు ఆత్రంగా ఉన్నాయి. ఆ సంచి దొరుకుతుందో, లేదోనే...?? అయ్యో! అన్ని ప్రసాదాలు అందులోనే ఉన్నాయే. కల్యాణం ప్రసాదాలు లేకుండానే ఇంటికెలా వెళ్లాలో అని ఆర్తిగా, దీనంగా మనసారా అందరం ఆ ఏడుకొండలస్వామినే ప్రార్థిస్తూ, చెట్టువద్దకొచ్చాం. స్వామి దయామయుడు. ఆర్తజనరక్షకుడు. మా ప్రసాదాలసంచి పెట్టినచోటే పెట్టినట్లుంది. ఆ సంచిని చూడగానే, కల్యాణవేంకటేశ్వరుడే ఆ సంచిగా కనిపించాడు మాకు. అందరం ఒక్కసారిగా గోవిందా! గోవిందా! అంటూ ఒక గొప్పనిధి దొరికినంత సంబరపడ్డాం. అది పదిమంది తిరిగే కార్లపార్కింగ్ప్రదేశం. అక్కడ అటు ఇటు ఎందరో తిరుగుతున్నారు. ఆ ప్రదేశంలో పెట్టిన మా ప్రసాదాలసంచి దొరికిందంటే, అది ఆ శ్రీనివాసుని మహిమకాక మరేమిటి?

సౌలభ్య, సౌశీల్య, వాత్సల్యాది గుణపరిపూర్ణుడైన ఆ గోవిందుని దయ కడు రమణీయం. మనోహరం. మహదానందం.



# క్షేత్రయ్య


-డా॥ శివలెంక ప్రకాశరావు

పదకవితలకు ఆద్యుడు తాళ్లపాక అన్నమాచార్యుడు. అన్నమాచార్యుని కవితలు భక్తిరసభరితాలైతే, క్షేత్రయ్య పదాలు శృంగారభరితాలు. పదంలోని వాక్కులక్షణాన్ని, గేయలక్షణాన్ని సమర్థవంతంగా నిర్వహించిన కవితల్లజుడు, పదకవితాచక్రవర్తి క్షేత్రయ్య.

క్షేత్రయ్య అసలుపేరు వరదయ్య. అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించడంవల్ల ఆయన క్షేత్రయ్య అని పిలువబడ్డాడు. ఆయన నివాసస్థలం కృష్ణామండలంలోని మొవ్వ. అక్కడున్న వేణుగోపాల స్వామిపై భక్తితో క్షేత్రయ్య రచించిన పదాలే 'మువ్వగోపాల పదాలు'. క్షేత్రయ్య సంస్కృతాంధ్రాలలో మంచి వైదుష్యం సంపాదించుకొని, 'మువ్వగోపాల' మకుటంతో శృంగారరస భరితమైన పదాలు రచించి శాశ్వతకీర్తిని సముపార్జించుకొన్నాడు.

క్షేత్రయ్యే నాయిక, ప్రాణనాయకుడు మువ్వ గోపాలుడు. భగవంతునితో ఆత్మనివేదన చేసుకొని, పరమ ప్రేమను ప్రకటించి, పరమాత్మలో విలీనం చెందడంకోసం పడిన మధురవేదన, తపన, ఆతృత, భక్తిపారవశ్యం క్షేత్రయ్య పదాలలో అడుగడుగునా ప్రస్ఫుటమౌతాయి.

ఒకమారు శ్రీపెరుందేవీ వరదరాజస్వామివారి దేవళంలో పూజారులు తలుపులు వేసుకొని వెళ్ళిపోవడంతో క్షేత్రయ్య రాత్రంతా అక్కడే ఉండిపోయాడట! తెల్లవారుజామున ఒక దివ్యస్త్రీ అంటే పెరుందేవే క్షేత్రయ్యకు దర్శనమిచ్చిందట.



క్షేత్రయ్య పదాలు ముక్తకాలవంటివి. ఒక్కొక్కపదం ఒక్కొక్క మధురకావ్యంలా అనిపిస్తుంది. పల్లవిలో భావం సూచన ప్రాయంగా కనబడుతుంది. తరువాత అనుపల్లవిలో ఆ భావం బలపడి, చరణాల్లో విస్తరింపబడి మధురంగా, ఆనందరస తరంగడోలికలలో ఊగిసలాడిస్తుంది.

**మొలకనవ్వులవాడే-ముద్దుమాటలవాడే**
**తళుకారు చెక్కుటద్దములవాడే**
**తలిరాకు జిగిదెగడ-దిగుమోము గలవాడే**
**తెలితమ్మి రేకు కన్నుల నమరువాడే!**
**ఎంత చక్కనివాడేఇంతి మువ్వగోపాలుడు**
**సతతము నామదికి సంతోషము చేసెనే!**

క్షేత్రయ్య చేసిన ఇలాంటి వర్ణనలు ప్రబంధకవులను తలపిస్తాయి. క్షేత్రయ్య తేటతెలుగులోని మాధుర్యాన్ని, సంగీత సాహిత్యాల మేళవింపును తన కవిత్వంలో చవిచూపించాడు, తెలుగు నుడికారాన్ని ప్రయోగించడంలో తిక్కన తరువాత క్షేత్రయ్యనే చెప్పుకోవాలి.

క్షేత్రయ్యపదాలలో మధురభక్తి పారవశ్యం ఎక్కువగా కనిపిస్తుంది. అన్నమయ్యపదాల్లో సాహిత్యం ప్రధానంగా, సంగీతం అప్రధానంగా ఉంటుంది. అలాగే త్యాగయ్యకృతులలో సాహిత్యం అప్రధానంగా, సంగీతం ప్రధానంగాను కనిపిస్తుంది. ఐతే క్షేత్రయ్యపదాలలో సంగీతసాహిత్యాలు సమానంగా ఉండి, అభినయం జోడించినట్లు అనిపిస్తుంది. అనేక రాగతాళాలను తన పదాలకు వాడి సమన్వయం చేకూర్చాడు క్షేత్రయ్య. అందుకే అన్నమయ్య పదకవితాపితామహుడైతే, క్షేత్రయ్య 'పదసంగీత పితామహుడు' అన్నారు.

క్షేత్రయ్య మధురభక్తిని ఉపాసించడమేకాక, ఆత్మానందానుభూతిని పొంది, ఇతరులకు అందించి తరించిన భక్తవరేణ్యుడు. సంగీతసాహిత్యాభినయాలలో తన పదాలద్వారా ఎందరికో మార్గదర్శకుడై శాశ్వతకీర్తినార్జించాడు.

బాలనీతి

# స్వార్థం వద్దు!!

- శ్రీమతి ఆసూరి ఉషారాణి,
94416 46016

ఓసారి శ్రీకృష్ణార్జునులు కలిసి వెళ్తుండగా వారికి మార్గమధ్యంలో ఒక పేద యాచకుడు కనిపించాడు. అతణ్ణి చూసి జాలిపడి అర్జునుడు ఒక సంచినిండా బంగారునాణేలు ఇచ్చాడు. అవి తీసుకొని సంతోషంగా అతడు ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఒక దొంగ అతణ్ణి కత్తితో బెదిరించి నాణేల సంచిని లాక్కున్నాడు.

మరలా ఇంకోరోజు అతను యాచకుడిగా భిక్షాటన చేస్తూండగా అర్జునుడు అతణ్ణి చూసి ఆశ్చర్యపోయాడు. విషయం తెలిసి జాలిపడి ఒక ఖరీదైనవజ్రం ఇచ్చి, "సుఖంగా జీవించు" అన్నాడు. అతను ఈసారి జాగ్రత్తగా ఆ వజ్రాన్ని ఇంటికి తీసుకెళ్ళి గదిలో మూలనున్న ఒకకుండలో దాన్ని దాచిపెట్టి ఆ రాత్రి నిద్రించాడు. తెల్లవారిలేచి చూసేసరికి ఇంట్లో తన భార్య లేదు. అంతేకాక ఆ కుండకూడా లేదు. పరుగెత్తుకుంటూ నదీతీరంవద్దకెళ్ళాడు. తన భార్యను, ఆమె చేతిలోని కుండను చూసి హమ్మయ్య అనుకున్నాడు. ఆ కుండలో చూస్తే వజ్రం లేదు. అది నదిలో నీళ్ళకోసం కుండను ముంచినప్పుడు నదీప్రవాహంలో కొట్టుకుపోయింది. తన దురదృష్టానికి ఎంతో చింతించిన అతను మళ్ళీ యాచకుడుగా వీథుల్లోకి వెళ్లాల్సొచ్చింది.

శ్రీకృష్ణార్జునులు అతణ్ని చూశారు. అప్పుడు అర్జునుడు కృష్ణునితో "బావా! ఇతనెవరో పరమదురదృష్టవంతుడిలా ఉన్నాడు" అని అన్నాడు. అందుకు కృష్ణుడు లేదు అర్జునా! ఈసారి ఏం జరుగుతుందో చూడు అని అతనిచేతిలో రెండు బంగారునాణేలు పెట్టాడు.

"ఒకప్పుడు సంచెడునాణేలు, ఎంతో విలువైన వజ్రంలాంటివే నాదగ్గర నిలువలేదు... ఈ రెండునాణేలుమాత్రం నా తలరాతను ఏమైనా మారుస్తాయా నాపిచ్చిగానీ..." అని అనుకుంటూ అతను ఇంటికి వెళ్తున్నాడు. అప్పుడు దారిలో ఒక జాలరి వలకు చిక్కి విలవిలలాడుతున్న చేపను చూశాడు. అతనిహృదయం ద్రవించింది. "నా దగ్గరున్న ఈ రెండునాణేలు నా తలరాతను మార్చలేవు కాబట్టి... పాపం ఈ మూగజీవి ప్రాణాలైనా రక్షిద్దాం" అని, తన దగ్గరున్న రెండునాణేలూ ఇచ్చేసి ఆ చేపను తీసుకొని ఇంటికెళ్లి ఒక నీటితొట్టెలో వేశాడు.



కొద్దిసేపటికి ఆతని భార్య ఆ చేపను చూసి, "అయ్యో! దానినోటిలో ఏదో ఇరుక్కుని ఉంది. అందుకే అది అలా గిలగిలా కొట్టుకుంటోంది" అని తన భర్తకు చెప్పింది. ఇద్దరూ కలసి ఆ చేప నోరు తెరువగా నదిలో పోగొట్టుకొన్న ఆ వజ్రం చేపనోట్లో కనిపించగానే, "దొరికింది దొరికింది... చిక్కింది చిక్కింది... నా చేతికి చిక్కింది" అని గావుకేకలు పెట్టారు. ఆ సమయంలో అతనిఇంట్లో దాక్కొన్న దొంగ భయంతో తననే కనిపెట్టారని వణికిపోయాడు. ఆ దొంగ అతనివద్దకొచ్చి, "నీకు దణ్ణం పెడతాను. నీ బంగారునాణేలసంచి నీవు తీసుకో... నన్ను మాత్రం రాజభటులకు పట్టివ్వవద్దు" అని బ్రతిమలాడాడు. ఆ దంపతులు ఆశ్చర్యపోయారు. పోగొట్టుకొన్న రెండు విలువైన వస్తువులూ తమకు చేరాయని మిక్కిలి సంతోషించారు.

వెంటనే వెళ్లి ఈ విషయాన్ని శ్రీకృష్ణార్జునులకు చెప్పారు.

"కృష్ణా..! నేను ఎంతో అమూల్యమైన బంగారునాణేల సంచి, వజ్రం ఇచ్చినా అతని దశ తిరుగలేదు. నీ విచ్చిన రెండు నాణేలు అతనిజీవితాన్ని మలుపు తిప్పాయి. ఇదెలా సాధ్యం" అని ప్రశ్నించాడు అర్జునుడు. అందుకు శ్రీకృష్ణుడిలా అన్నాడు. "అర్జునా..! అతని వద్ద బంగారం, వజ్రం ఉన్నప్పుడు అతను తన అవసరాలగురించి మాత్రమే ఆలోచించాడు... రెండు నాణేలు ఉన్నప్పుడు మరో జీవి మంచి చెడు, కష్టసుఖాలగురించి ఆలోచించాడు. నిజానికి అది భగవంతుని పని. అతను దేవునిపనిని పంచుకున్నాడు కాబట్టి అతని కష్టాలనన్నంటినీ నేను పంచుకున్నాను." అదీ విషయం అంతే.

**నీతి: స్వార్థంతో మనిషి ఉన్నప్పుడు ఏదీ కలిసిరాదు, ఎప్పుడైతే ఇతరులగురించి ఆలోచిస్తారో అప్పుడే వారికి మంచి జరుగుతుంది.**

# అక్టోబరు, 2024 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** మనోనిర్మలత, భార్య, సంతానంవలన శుభాశయాలు నెరవేరుతాయి. స్థిరాస్తుల వృద్ధి, అనేకవిధాలుగా ఆదాయం పెరగడం, సర్వ కార్యములయందు అనుకూలత, శరీరసౌఖ్యం, గృహవాతావరణం అనుకూలం.

**వృషభం–** పనివత్తిడివలన కుటుంబసభ్యులతో సరియైన సమయం గడపకపోవడం. విందు వినోదాలకు దూరంగా ఉండటం మంచిది. సంఘంలో గౌరవం, సన్మిత్రులు లభించడం, ఉద్యోగవిషయాలు అనుకూలం.

**మిథునం–** ఉద్యోగజీవితంలో సమస్యలు, వ్యాపారస్తులకు అధికారుల ఒత్తిడి. ఈ మాసప్రారంభంలో ఉదరసంబంధరుగ్మత. ద్వితీయార్ధంలో ఉపశమనం. ఈ సమయంలో ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొడతారు.

**కర్కాటకం–** ప్రతికూల పరిస్థితులను అర్థం చేసుకోలేకపోవడం, అహంకారానికి గురికావడం, అబద్ధమాడవలసిరావడం, స్వయంనిర్ణయాధికారాన్ని కోల్పోవడంవంటివి జరుగుతాయి.

**సింహం–** వ్యాపారం లాభదాయకంగా ఉంటుంది. అందరినుంచి మంచి మంచి ప్రోత్సాహాన్ని పొందుతారు. తోబుట్టువులనుండి అనుకూల వాతావరణం. పిల్లలవిషయాలుకూడా సంతోషాన్ని మరియు శుభవార్తను అందిస్తాయి.

**కన్య–** ఆత్మవిమర్శ చేసుకుని ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించాలి. ఆరోగ్యంపట్లకూడా శ్రద్ధ అవసరం. శత్రువులను విస్మరించడం మంచిది.

**తుల–** మిత్రులతో ఆనందంగా గడిపే సమయం. కుటుంబంలో వంశోద్ధారకులు ఆవిర్భవిస్తారు. గృహంలో మంగళతోరణాలకు కుటుంబ వాతావరణం అనుకూలం. ఆర్థికసమతుల్యత, ఆర్థికవికాసం కల్గుతుంది.

**వృశ్చికం–** ఆధ్యాత్మికకార్యక్రమాల్లో పాల్గొంటారు. గృహనిర్మాణాలు కలసివస్తాయి. బంధుమిత్రుల సమాగమం, వృత్తిలో లాభం, అఖండైశ్వర్యాలు కల్గుతాయి.

**ధనుస్సు–** ధైర్యం, ప్రణాళిక, పట్టుదలతో కార్యసిద్ధి కలుగుతుంది. అన్నిరకాల ప్రయత్నాలలోనూ జయం కలుగుతుంది. ఎంతటి కార్యాన్నైనా సులువుగా సాధిస్తారు. మంచివక్తగా పేరు తెచ్చుకుంటారు.

**మకరం–** ప్రారంభంలో అధికఖర్చులు. ముక్కు, గొంతు, చెవి వైద్యులసహాయం అవసరమవుతుంది. వస్త్రాలు, నిత్యకృత్య అవసరాలు కొనుగోలు చేస్తారు. ఆకస్మిక ధనలాభాలు వరిస్తాయి. శత్రువుల జాబితాకూడా పెరిగే అవకాశం ఉంది.

**కుంభం–** మీ సామాజికస్థితి పెరుగుతుంది. విలాసవంతమైన జీవనశైలిని అనుభవిస్తారు. పిల్లలవ్యవహారాలుకూడా సజావుగా సాగుతాయి. తెలివైననిర్ణయాలు తీసుకునే సమయస్ఫూర్తిని కలిగిఉంటారు.

**మీనం–** మానసికవేదన, గుండె, ఊపిరితిత్తుల సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కుజుడి అర్ధాష్టమ సంచారప్రభావాన్ని అధిగమించేందుకు సుబ్రహ్మణ్య ఆరాధన మంచిది. కొత్తప్రణాళికకు దూరంగా ఉండండి.


ఇతరులపై పగను కల్గి ఉంటే ప్రశాంతంగా జీవించలేం


చిత్ర కథ

# గరుడ గర్వభంగం

కథ– శ్రీమతి వావిలాల నాగవల్లి
చిత్రాలు– శ్రీ కె. ద్వారకనాథ్

గరుత్మంతుడు తన తల్లి వినతను తన పెదతల్లి దాస్యంనుండి విడిపించాడు. ఆ తర్వాత విష్ణువుకు వాహనమయ్యాడు. ఆ కోవలో గర్వంతో విర్రవీగాడు. అందుకు విష్ణువు గుణపాఠం చెప్పాడు. అదేంటో చూద్దాం. గరుత్మంతుడు తన తండ్రి కశ్యపుడితో...






**నీతి-** ఎలాంటి పరిస్థితుల్లోనైనా గర్వాంధకారంతో కన్నూ మిన్నూ గానక, ఎవ్వరినీ చిన్నచూపుతో చులకనగా చూడకు. అలా చేస్తే దైవం దృష్టిలో నీవే చులకనైపోతావు. ఇతరులను గౌరవించు, వారిచేత గౌరవం పొందు.

## పిల్లలూ.. మీకిది తెలుసా...?



'తోమని పళ్యాలవాడే దురితదూరుడే..!!' అని అన్నమయ్య కీర్తించాడు ఘనంగా తిరుమలస్వామిని. అంటే ఏమంటే... తిరుమలస్వామి నిత్యమూ "తోమనిపళ్లాల్లో" నైవేద్యం ఆరగిస్తాడు తెలుసా! ఆ.. అవునా...!! ఆ భోగం ఎంతటిదో! ఎంతెంతటిదో!! కదా అని మురిసి పోతున్నారు కదూ!! ఆశ్చర్యపోతున్నారు కదూ! వినండి మరి!

ఆ స్వామి ఒకసారి ఆరగించిన పళ్లాన్ని మళ్లీ తోమకుండా దానిని పారేస్తారు. మళ్లీ ఆరగింపుకు మళ్లీ కొత్త పళ్లెం! మళ్లీ.. మళ్లీ... కొత్తపళ్లాలే వాడతారు. ఆ "తోమని పళ్లాలు" అంటే ఏంటో తెలుసా..? అవి మట్టికుండలు! అదీ సగం పగిలిన మట్టిపెంకు! దానినే 'ఓడు' అంటారు. అదే 'ఓటి కుండ'. స్వామి ఆ ఆ మట్టిపెంకులోనే విందారగిస్తాడు. పైగా అదీ ఏం ప్రసాదం పెడతారంటే.. చక్కటి మీగడ పెరుగన్నమే! దానికే 'ఓడు' ప్రసాదమని పేరు. దీనికే 'మాత్రా' లేక 'మాతృదధ్యోదనం' అనికూడా పేరు. ఇది వినడానికే చాలా ఆశ్చర్యంగా ఉంది కదూ! అందుకే స్వామి బ్రహ్మాండనాయకుడయ్యాడు.

---

క్రిందివాటిలో
తిరుమలస్వామి పంచబేరాల చిత్రాలున్నాయి.
వాటికి వేరే ఇతర మూడు పేర్లున్నాయి.
ఆ పేర్లు క్రింద తెలుపబడ్డాయి.
ఆ పేర్లతో ఉన్న స్వామి
ఏ బేరమో తెలుసుకొని
క్రింది ఖాళీలో వ్రాయండి.

01) ఉగ్రశ్రీనివాసమూర్తి
02) వేలకటత్తురైవార్
03) స్నపనమూర్తి

..........................................

జవాబు: స్నపనబేరం



01) మూలవిరాట్టు
02) ధ్రువమూర్తి
03) స్థానకమూర్తి

..........................................

జవాబు: ధ్రువబేరం



01) కొలువు శ్రీనివాసమూర్తి
02) లేఖన శ్రీనివాసమూర్తి
03) దర్బార్ శ్రీనివాసమూర్తి

..........................................

జవాబు: బలిబేరం



01) మనవాళ్ళ్పెరుమాళ్
02) భోగశ్రీనివాసమూర్తి
03) కౌతుకమూర్తి

..........................................


జవాబు: కౌతుకబేరం



01) మలయప్పస్వామి
02) మలైకునియనిన్ట
పెరుమాళ్
03) ఉత్సవమూర్తి

..........................................

జవాబు: ఉత్సవబేరం






ప్రక్కన చూపిన వృత్తంలో ద్వాదశాళ్వారుల 'విష్వంశలు' చిత్రాలున్నాయి. వాటిని చూసి ఆ 'ఆళ్వారు' పేరు, వారి 'విష్వంశ' పేరు క్రింది ఖాళీల్లో పూరించండి.

01) ..............................
02) ..............................
03) ..............................
04) ..............................
05) ..............................
06) ..............................
07) ..............................
08) ..............................
09) ..............................
10) ..............................
11) ..............................
12) ..............................

జవాబులు-1)పొయ్‌గైఆళ్వారు(పాంచజన్యం-శంఖం) 2)పూదత్తాళ్వారు (కౌమోదకి-గద) 3)పేయాళ్వారు(నందకం-ఖడ్గం) 4)తిరుమళిశైఆళ్వారు (సుదర్శనం-చక్రం) 5)కులశేఖరాళ్వారు(కౌస్తుభమణి) 6)తొండరడిప్పొడిఆళ్వారు (వైయంతిమాల)7)తిరుప్పాణాళ్వారు(శ్రీవత్సం) 8)తిరుమంగైఆళ్వారు (శార్ఙ్గం- ధనుస్సు) 9)పెరియాళ్వారు(రథం) 10)ఆండాళ్(గోదాదేవి) (భూదేవి) 11)నమ్మాళ్వారు(విష్వక్సేనుడు) 12)మధురకవిఆళ్వారు(గరుత్మంతుడు)



## దారికనుక్కోండి చూద్దాం!!





ఈ ఇద్దరు చిన్నారులు
తిరుమలస్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్లాలంట...
వారికి దారి చూపండి మరి!

## రంగులు వేద్దాం..!!





పై చిత్రాన్ని
చూసి
రంగులు
వేయండి



ఆయుర్వేదం

# గరికె

– డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

గరికె కొన్ని జీవజాతులకు ఆహారంగా ఉపయోగపడితే, మరి కొన్ని జీవజాతులకు ఔషధంగాను, ఇంకొన్ని జీవజాతులకు ఆహారంగాను, ఔషధంగాను ఉపయోగపడుతుంది.

దైనందినజీవితంలో మనం ఎదుర్కొనే వివిధ అనారోగ్యసమస్యలకు గరికెను ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

**'దూర్యతే పశుభిరితి దూర్వా'** అను వచనానుసారం పశువులచే పీకబడటంవల్ల దూర్వా అని, మిక్కిలి దూరం ప్రాకుచుండుటచే అనంత అని, అనేక కణుపులతోపాటు ప్రతి కణుపుకి చిగురించే స్వభావముండటంతో శతపర్వ అని, శక్తివంతమైనమొక్క కావున సహస్రవీర్య అనే సంస్కృతపేర్లు ఈ గరికెకు ఉన్నాయి.

**చర్మవ్యాధులకు:** 50మి.లీ. గరికెరసం, 50మి.లీ. వేపాకుల రసం, 150మి.లీ. నువ్వులనూనె కలిపి నురగ వచ్చేలా సన్న మంటపై మరిగించి 50గ్రాముల పసుపుపొడి కలిపి దించి చల్లార్చి వడగట్టి నిల్వ ఉంచుకుని రోజూ ఒకట్రెండుసార్లు లేపనం చేస్తుంటే గజ్జి, తామర, దురదలు, సోరియాసిస్‌లాంటి చర్మవ్యాధులు తగ్గుతాయి.

**చెవిపోటు, హోరు, చీము, కురుపులకు:** 50మి.లీ. గరికెరసం, 50మి.లీ. ముల్లంగిరసం, 100మి.లీ. నువ్వులనూనె కలిపి నీటిశాతం అంత ఇగిరిపోయి నూనె మాత్రం మిగిలేలా సన్న మంటపై మరిగించి వడగట్టి 10గ్రాముల సైంధవచూర్ణం కలిపి చల్లార్చి నిల్వ ఉంచుకుని రోజూ రెండుపూటలా పూటకు 3,4 చుక్కలు చెవిలో వేసుకుంటుంటే చెవికి సంబంధించిన వివిధసమస్యలు తగ్గుతాయి.

**గాయాలు, పుళ్ళు మానేందుకు:** గరికె, ఉత్తరేణిఆకులు, ఏలకు గింజలు సమానంగా కలిపి నూరి పట్టిస్తుంటే గాయాలు, దీర్ఘ కాలికవ్రణాలు, పుళ్ళు త్వరగా మానిపోతాయి.

**ముక్కునుంచి రక్తస్రావం:** ఒకట్రెండుసార్లు 5, 6చుక్కల గరికె రసం ముక్కులో వేస్తే తక్షణమే రక్తస్రావం ఆగుతుంది.

**తలమీద తరచూ వచ్చే చీముగుల్లలు తగ్గేందుకు:** రోజూ ఒకసారి 100మి.లీ. గరికెరసం ఒకటీస్పూన్ శీకాయపొడి, 2, 3చిటికెలసున్నం కలిపి పట్టించి గంటసేపాగి కడిగేస్తుంటే త్వరలో ఫలితం కలుగుతుంది.

**మంగుమచ్చలు, నల్లమచ్చలకు:** గరికెరసంలో తగినంత కరక్కాయపొడి, పసుపు కలిపి లేపనం చేసి గంటసేపాగి కడిగేస్తుంటే ముఖంపై వచ్చే మంగుమచ్చలు, ఒంటిపై వచ్చే నల్లమచ్చలు తగ్గుతాయి. ఇలాగే వాడితే తామరవ్యాధికూడా త్వరగా తగ్గుతుంది.

**కడుపు, ప్రేవుల్లో వ్రణాలు:** రోజూ రెండుసార్లు పూటకు 10–20 మి.లీ. గరికెరసాన్ని రెట్టింపు పెరుగు కలిపి సేవిస్తుంటే వ్రణాలు త్వరగా మానిపోతాయి. నీళ్ళు, జిగురు, రక్త విరేచనాలుకూడా తగ్గిపోతాయి.

**మోకాళ్ళనొప్పులకు:** 150మి.లీ. గరికెరసం, 300మి.లీ. నువ్వులనూనె కలిపి సన్నని మంటపై రసమంతా ఇగిరి నూనె మాత్రమే మిగిలేలా మరిగించి, దించి, వడగట్టి 50గ్రాముల కర్పూరంపొడి కలిపి చల్లారాక వడగట్టి రోజూ ఒకట్రెండుసార్లు ఆయాభాగాల్లో సున్నితంగా మర్దన చేసుకుంటుంటే మోకాళ్ళ నొప్పులు, నడుంనొప్పులు, కీళ్ళనొప్పులు, భుజం నొప్పులు లాంటివి తగ్గుతాయి.

**సూచన:** గరికెరసం లేదా పేస్టు తయారుచేసుకునేటప్పుడు కాడలను తొలగించిన గరికెఆకుల్ని ఉపయోగించుకోవాలి.

దుర్వాదితైలం, దుర్వాదిఘృతం అనే ఆయుర్వేదౌషధాల తయారీలో గరికెను ప్రధానద్రవ్యంగా ఉపయోగిస్తారు.



# క్విజ్ 27

01) శ్రీవేంకటేశ్వరుని మెడలో హారంగా మారిన భక్తురాలు? జ)........................
02) క్షీరనీరవివేకం గల పక్షి? జ)........................
03) సామవేదంనుండి పుట్టిన జంతువు? జ)........................
04) అహనాసూల్ గ్రంథరచయిత? జ)........................
05) పరబ్రహ్మస్వరూపం? జ)........................
06) అర్జునుడి పేడివానిరూపం పేరు? జ)........................
07) కౌత్సుడి గురువు? జ)........................
08) 'అశ్వము'నకు అర్థం? జ)........................
09) ర్యాలీగ్రామం ఉన్న జిల్లా? జ)........................
10) 'రాత్రి' శబ్దానికి అర్థం? జ)........................
11) నరకాసురుణ్ణి సంహరించినవారు? జ)........................
12) మహావిష్ణుస్వరూపం? జ)........................
13) హిందూధర్మంలో శుభసూచకం? జ)........................
14) పరమాత్మను చేరే మార్గం? జ)........................
15) తిరుమలస్వామి బ్రహ్మోత్సవంలో ప్రధానవాహనసేవ? జ)........................
16) "నానాటిబతుకు నాటకము" సంకీర్తన కర్త? జ)........................
17) "అద్వైతభావన"కు మరోపేరు? జ)........................
18) 'మోక్షం'నకు అర్థం? జ)........................
19) 'సంగీతం' అనేది? జ)........................
20) ఉత్తర నాట్యాచార్య గురువు? జ)........................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-10-2024.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ........................ వయస్సు: ..........

పాఠశాల: ........................ తరగతి: ..........

పేరు: ........................

చిరునామా: ........................

........................

........................

........................ పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ........................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________

______________________

______________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) [ ][ ][ ][ ][ ][ ]

సెల్ నెం. [ ][ ][ ][ ][ ][ ][ ][ ][ ][ ][ ]

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

............................................ తేది : ..................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 105




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)శ్రీవేంకటేశ్వరునిమెడలో హారంగామారిన భక్తురాలు(5); 5)ఒకఅప్సరస(2); 6)బ్రహ్మపుత్త్రుడు, ప్రథమమనువు(4); 10)విష్ణువువక్షఃస్థలాన్ని తన్నినమహర్షి(3); 11)హిరణ్యనాభునిపుత్త్రుడు(3); 14)విజయదశమిరోజున దుర్గ సంహరించిన రాక్షసుడు(6); 15)కొండ(2)

**నిలువు** 1)ఈ స్వామిని దర్శించినతర్వాతే శ్రీవారిని దర్శించాలి(5); 2)సుకేశునిపుత్త్రుడు(2); 3)మహిషాసురుని చంపిన దేవత(2); 4)శ్రీవేంకటేశ్వర స్వామికి గుడికట్టించిన రాజు(5); 7)భరతునిపుత్త్రుడు, దుష్యంతునిపౌత్రుడు(4) 8)ఆశ్వయుజశుద్ధదశమిరోజున చేసేపండుగ(3); 9)వైవస్వతుని పుత్త్రుడు(3); 12)శ్రీనివాసుడు పుట్టలో నివసించిన అద్రి(3); 13)పదకొండుఅణాల ఎత్తుగల బంగారపు నాణెం(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుమల, శ్రీవేంకటేశ్వరస్వామివారికి 15-08-2024నుండి 17-08-2024వరకు
కడు రమణీయంగా జరిగిన **పవిత్రోత్సవాలు**. అందులో పాల్గొన్న
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి గౌ॥ శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు.
తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి గౌ॥ శ్రీ సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.,
మరియు ఇతర అధికారులు.



తిరుచానూరు, 2024 ఆగష్టు 16న
అష్టలక్ష్మీవ్రతమండపంలో శ్రీపద్మావతి అమ్మవారికి వైభవంగా జరిగిన
**వరలక్ష్మీవ్రతం**లో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
గౌ॥ శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు.



తిరుపతి, శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాలలోని శ్రీవేణుగోపాలస్వామివారి
ఆలయంలో 2024, ఆగష్టు 27న జరిగిన **గోకులాష్టమి గోపూజ**లో
పాల్గొన్న గౌ॥ శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు మరియు
తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీమతి ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్.,
మరియు ఇతర అధికారులు.



తిరుపతి, 2024, ఆగష్టు 30న
శ్రీకపిలేశ్వరస్వామివారిఆలయంలో శ్రీకామాక్షిఅమ్మవారికి
శ్రావణమాసం చివరి శుక్రవారం రోజున
కన్నులపండువుగా జరిగిన **లక్షకుంకుమార్చన.**



తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి పరిపాలనభవనప్రాంగణమైదానంలో
2024, ఆగష్టు 15న జరిగిన ఘన **స్వాతంత్ర్య దినోత్సవ** వేడుకల్లో
గౌరవ సైనికవందనం స్వీకరిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
గౌ॥ శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., మరియు తి.తి.దే.
ముఖ్య నిఘా మరియు భద్రతాధికారి గౌ॥ శ్రీ ఎస్.శ్రీధర్, ఐ.పి.ఎస్.,




తిరుపతి, శ్రీ కపిలేశ్వరస్వామివారిఆలయంలో
2024, సెప్టెంబరు 07న
**వినాయకచవితి**పండుగ సందర్భంగా మూషికవాహనంపై
శ్రీవినాయకస్వామివారి గ్రామోత్సవవైభవం

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-09-2024 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.



చక్రస్నానం
(12-10-2024)